చంద్రిక కథ

తెలుగు మహాపురుషుడు
వీరేశలింగం పంతులుగార్ని పాత్రగా తీసుకుని
ఆధునిక తమిళ మహాకవి
సుబ్రహ్మణ్య భారతి వ్రాసిన తమిళ నవల

★

తెలుగు సేత
గోపాల- కృష్ణ-రాఘవన్

894.8273
K.94

★

ప్రచురణ
బంగోరె

★

సహాయ సంపాదకుడు
జమీన్ రైతు
నెల్లూరు-1

Blank Page

1

చంద్రికకథ

[తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి
అరవంలో వ్రాసిన అసంపూర్ణ నవల]

★

తెలుగుసేత :

గోపాల - కృష్ణ - రాఘవన్

★

ప్రచురణ :

బంగోరె

సహాయసంపాదకుడు, 'జమీన్‌రైతు'

నెల్లూరు - 1

Nellore Historics Publication No : 2
April 1971

*

CHANDRIKA KATHA

(A Telugu rendering of Subrahmanya Bharati's unfinished novel in Tamil with notes and introduction)

*

Publisher :
'BANGOREY'
Asst-Editor,
'ZAMIN RYOT'
Nellore (A. P.)

*

Price Rs. 2-50

*

Printers :
FREEDOM PRESS
198-A, T. H. Road
Madras-21.

★ ★ ★ అంకితపత్రం ★

నార్లగారు కేంద్రసాహిత్య అకాడమీ
పక్షంగా కందుకూరి వీరేశలింగం
జీవిత సాహిత్యాలను గూర్చి 1968 లో
ఇంగ్లీషులో పుస్తకం వ్రాయకుండా
వుంటే - తమిళంలో ఈనవల వొకటి
వుందని ప్రత్యేకంగా పేర్కొంటూ
ఇంగ్లీషు 'స్వరాజ్య' పత్రికలో
ప్రేమానందకుమార్ సమీక్ష చేసి
వుండేవారుకాదు—

ఆ పుస్తకాన్నీ సమీక్షనూ బంగోరె
చూడకుండావుంటే ఇప్పట్లో ఈనవల
ఈ రూపంలో తెలుగు వెలుగు చూచి
వుండేదికాదు - ఈనవల ప్రచురణకు
ప్రధానమైన ప్రేరణ నార్లగారి అనర్ఘు
మైన ఆఇంగ్లీషు గ్రంథమే గనుక
ఆయనకే దీన్ని అంకిత మిస్తున్నాను.

—బంగోరె

IV

విషయసూచిక

పేజీ సంఖ్య

లోకకథానాయకుడు వీరేశలింగం :

కె. వి రమణారెడ్డి v

తమిళదేశపు తపఃఫలం సుబ్రహ్మణ్య భారతి :

డా॥ చల్లా రాధాకృష్ణశర్మ xi

ముందుమాటలు :

బంగోరె xix

చంద్రిక కథ (నవల) : 1-86

లోక కథానాయకుడు వీరేశలింగం

నెల్లూరి మాండలికంలో వర్ణించవలసివస్తే, కందుకూరి వీరేశలింగంపంతులు 'దశమంతుడు' అనదగిన అసాధారణ వ్యక్తి. తన పూర్వీకులు కందుకూరి ప్రాంతాన్ని విడిచి గోదావరి ప్రాంతానికి వలస వెళ్లకుండా స్థిరనివాసంచేసి ఉంటే, అలా అనిపించుకొనేవాడేమో కూడా.

అరవ కవి సుబ్రహ్మణ్యభారతి తన ఈ అసంపూర్ణరచనలో వీరేశలింగం గారిని పిలిచి పెద్ద పీట వెయ్యకముందే, తెలుగుకవి గురజాడ అప్పారావు అంత పనీ చేసి కూర్చున్నాడు. 'కన్యాశుల్కం' నాటకం తొలికూర్పు పాఠాన్ని ఒళ్ళు దగ్గరబెట్టుకొని చూస్తే, ఆ నాటక కథకు నాయకస్థానంలో ఉండిన సంస్థాకల్పుడైన వ్యక్తి వీరేశలింగమేనని బోధపడుతుంది. 'వీరయ్యపంతులు' అనే నాటక పాత్రకు ఆ రచనలో ఉన్న కీలకస్థానాన్ని తెలుగు సాహిత్యవిమర్శకులు సరిగా గుర్తించేందుకు మరికొన్నేళ్లయినా అవసరమయ్యేట్లుంది. అయినా అది ఇంకా వివాదంలో పడి నలుగుతూంది కాబట్టి ప్రస్తుతానికి దాన్ని విడిచిపెడ్దాం.

సుబ్రహ్మణ్యభారతి కవి మాత్రమేగాక పాత్రికేయుడు కూడా అయినందుచేత, ఈ రచనలో పడుగుపేకల్లా కల్పనమూ వాస్తవచిత్రణమూ పెనవేసుకుంటున్నాయి. యథార్థవ్యక్తులు కూడా కల్పితకథలో దూరివచ్చి నిలిచినప్పుడు, పాఠకుడు విచిత్రమైన ఒక అనుభూతిని పొందుతున్నాడు. కల్పిత కథే అయినా, దానికి వాస్తవాభాసం లాంటిది కలిగి ఘటనలపట్ల విశ్వసనీయత ఇతోధికం కాగలుగుతున్నది. ఇలాంటి రచనాపద్ధతికి బుణాంశకూడా లేకపోలేదు. కల్పితకథే అయి ఉంటే, అది కల్పించే భ్రమ పాఠకుడి మనస్సును పూర్తిగా ఆవరిస్తుంది. దానిమైకంలో అతడు తలమునకలౌతాడు. యథార్థకథనమే అయి ఉంటే, అది స్థాపించే విశ్వసనీయత పాఠకుడి మనస్సును భ్రమవైపుకు నెట్టివెయ్యదు. అతడు మాగన్ను పడే అవకాశమే ఉండదు. భారతియార్ రచనలో అదీ ఇదీ జమిలిగా సమకూడటంచేతే, పాఠకుడికి కలిగే అనుభూతిని విచిత్రమని అనవలసివచ్చింది.

నిజానికి వీరేశలింగంపంతులు ఈ కథాకాలంనాటికి మదరాసులోనే ఉన్నాడు. 1904 డిసెంబరులో 'స్వదేశమిత్రన్' పత్రికాధిపతి, ప్రముఖ దేశాభిమాని అయిన జి. సుబ్రహ్మణ్యయ్యరు ఇంటికి చంద్రికను చంకబెట్టుకొని బాల వితంతువైన విశాలాక్షి రావడంతోటి పూర్వరంగంనుంచి కథ బయటపడుతుంది. అప్పటికి ఏడేళ్ళక్రితంనుంచీ (1897) వీరేశలింగం మొదటి రెండుసంవత్సరాలు

తన గ్రంథాలను అచ్చు వేయించుకొంటూ, తర్వాత ప్రెసిడెన్సీ కాలేజిలో ఆంధ్ర శాఖాధ్యక్షులుగా పనిచేస్తూ మద్రాసులోనే ఉంటూవచ్చాడు. 1903 ఆఖరులో ఆయన ఉద్యోగవిరమణ చేసినా మరొక సంవత్సరంపాటు—అంటే 1904 ఆఖరు వరకు—మద్రాసులోనే ఉండిపోయాడు. ఆ సంవత్సరంలో రెండు నెలలపాటు రాజమండ్రిలో ఉండి వచ్చినమాట నిజమే. అయితే అది డిసెంబరు మాసానికి ముందే. అదీగాక, భారతియార్ కథలో చెప్పినట్లుగా, ఎళుంబూరు (ఎగ్మూరు)లో ఆయన కాపురం పెట్టలేదు. 'స్వీయచరిత్రము' రెండవభాగంలో మొదటి ప్రకరణం చూద్దాం:

> 'నేను కొన్ని సంవత్సరములనుండి చెన్నపట్టణమునకు పోవలెనని తలఁచుచుండిన వాఁడనయి 1894 వ సంవత్సరమునందు వేసవికాలపు సెలవులలో నక్కడకుఁ బోయినప్పుడు పరశువాకములో నా స్నేహితులైన మన్నవ బుచ్చయ్య పంతులుగారి యింటి కెదురుగా నొక యిల్లుకొని, తరువాత నేను వాసము చేయుటకు యోగ్యముగా నుండునట్లు దానిని పడఁగొట్టించి మేడ యిల్లు కట్టించితిని.
>
> ...ఇట్లు స్వదేశీయుల దీవనలను బడసి 1897 వ సంవత్సరాంతమునందు సకుటుంబముగా నేను చెన్నపురిఁ జేరితిని.'

పరశువాకంలో ఉంటూవచ్చిన పంతులుగారిని సమీపంలోనే ఉన్నా, ఎగ్మూరుకు ఎందుకు మార్చారు రచయిత? అయితే ఎగ్మూరు ప్రాంతంతోటి వీరేశలింగంగారికి సంబంధం పూర్తిగా లేకుండాపోలేదు. తమ ఇంటిలో ఉండిన నలుగురైదుగురు బాలవితంతువులు ఎగ్మూరులోని ప్రభుత్వ స్త్రీ బోధనాభ్యసన పాఠశాలకు పోతూ వచ్చారు. ఆ సంబంధం అంతే. వీరేశలింగంగారి చుట్టూ లేచిన సంస్థల కార్యాలయాలన్నీ ఆయన ఇంటిచుట్టుపట్లనే ఏర్పాటయ్యాయి: వెల్లాల వీధిలోని 23 వ నెంబరు ఇల్లు వీరేశలింగంగారిది మూడిళ్ళ ఇవతల 20 వ సంఖ్యగల ఇంటిని కొని సంఘసంస్కారసమాజంవారిపరం చేశాడు. గంగాధరేశ్వరుని కోవెల వీధిలో ఒక స్థలం సంపాదించి ఇల్లువేయించి వితంతుశరణాలయానికి నిలువనీడ కల్పించాడు.

అయినా ఇది ముఖ్యమైన విషయమేమీకాదు. జి. సుబ్రహ్మణ్యయ్యరుగారితోటి వీరేశలింగంగారికి గాఢపరిచయం ఉండినట్లు 'స్వీయచరిత్ర'లో ఆధారం ఏదీ కనిపించదు. ఇద్దరు సంస్కర్తలు ఒకేనగరంలో ఉంటూ అపరిచితులై ఉంటారను కోవడం సరికాదు గాని ఈ గ్రంథంలోగానీ వీరేశలింగం స్వీయచరిత్రలోగాని

ఆలాంటి దాఖలా ఏదీ కనిపించదు. 'హిందూ' పత్రిక స్థాపనలో తనతో కలిసి పని చేసిన న్యాపతి సుబ్బారావుద్వారా వీరేశలింగం పంతులుగురించి జి. సుబ్రహ్మణ్యయ్యర్ తెలుసుకొని ఉంటాడు. ఆనాటి ఆంధ్రులలో అయ్యగుతోటి బాగా స్నేహంచేసిన వ్యక్తి గురజాడ అప్పారావు. అయ్యరుగారుకూడా ఆనందగజపతి మిత్రులలోనే జమ.

ఈకథలో వరుణ్ణి చూసిపెట్టమని తనవద్దకు వచ్చిన విశాలాక్షిని వీరేశలింగం గారివద్దకు రాజమండ్రికి పంపుతారు అయ్యరు. అప్పటికే అరవదేశంలో అంతటా అయ్యరుగారి సంఘసంస్కరణాభిమానంగురించి ప్రచారం జరిగి ఉంది. పదేళ్ళప్రాయంలోనే భర్తను కోల్పోయిన తమకుమార్తె శివప్రియమ్మాళ్‌కు బొంబాయి మహానగరంలో వరుణ్ణి నిశ్చయించి మహాదేవగోవిందరణడే సమక్షంలో వివాహం జరిపించి ఉన్నాడు. ఆవివాహం 1889 డిసెంబరు 31 న జరిగింది. ఆతర్వాత ఆయన కుటుంబాన్ని వెలి వెయ్యడమూ జరిగింది. మరి కొంతకాలానికి అయ్యరుగారి సతీమణి కాలధర్మం చేసింది. శివప్రియమ్మాళ్‌దే ఇంటిపెత్తనం యావత్తూ. ఇవన్నీ భారతియార్ కథలోకూడా ప్రస్తావనకు వచ్చాయి. అప్పటికి వీరేశలింగం రాజమండ్రిలోనే ఉంటూ, తాత్కాలికంగామాత్రమే మద్రాసుకు వచ్చినట్లు ఆయన సూచించడం జరిగింది. విశాలాక్షితోటి సుబ్రహ్మణ్యయ్యరు అంతమాటా అన్నాడు. పంతులుగారిని వెదుక్కుంటూ ఊరూరుమని విశాలాక్షి రాజమండ్రిదాకా పోయివచ్చిందంటే, భారతియార్ చారిత్రక సమాచారం ఇలా కొంత అపసవ్యం అయినందుచేతనే.

ఇదికూడా పెద్ద లోపమేమీ కాదు లెమ్మని మాటవరసకు ఒప్పుకొన్నా, భారతియార్ చెయ్యబోయిన మరొక పొరబాటును తోసిపెయ్యవలసిన అవసరం కనిపించదు. వీరేశలింగం ఎన్ని వితంతు పునర్వివాహాలైనా చేయించగలిగాడు గాని అరవదేశంలోమాత్రం ఆయన కృషి ఫలించలేదు. 'దక్షిణభారత విద్యాసాగరుడు' అని బిరుదు వచ్చినా, ఆయన సంఘసంస్కరణ మైసూరుకైనా పాకిపోయింది గాని మద్రాసు మహానగరాన్ని దాటి దక్షిణం పోలేదు. ఈవిషయంగురించి ఆయన మనస్తాపాన్ని వెల్లడించవలసి వచ్చిందికూడా.

'ఈ శరణాలయమును రాజధానియైన మద్రాసిడదేశమునందుంచినను, అందు చేరినవారిలో నిరువురు తప్ప తక్కినవారందఱును తెలుఁగుదేశమునుండి వచ్చినవారే యయియుండిరి. ఆ యిరువురిలో నొక్కతెమాత్రమే యఱవ బాల వితంతువు; రెండవయామె తిరునల్వేల్లినుండి తండ్రిచేత తీసికొని రాఁబడిన తెలుఁగు బాలవితంతువు... మొదటి చిన్నది మిక్కిలి తెలివిగలదయి

పాఠశాలలో బహుమతులనుబడసి సంవత్సరకాల ముండినమోఁదట తండ్రి వచ్చి వేసవికాలపు సెలవులలో తనయొద్ద నుంచుకొని మరలఁ బంపెదనని కాతో నమ్మఁబలికి రానని యేడ్చుచుండఁగా పిల్లదానిని బలవంతముగా తీసికొనిపోయి బంధువుల బాధచేత మరలఁ బంపక పోయెను.'

(స్వీయచరిత్రము, రెండవభాగము, మొదటిప్రకరణము)

1897 నుండి 1905 వరకు మద్రాసులో ఉండినప్పుడు వీరేశలింగం పంతులు గారు జరిపించిన పది పునర్వివాహాలలో ఒక్కటిగూడా తమిళ 'సంప్రదాయ' పరత్వాన్ని ఈషణ్మాత్రమైనా కదిలించజాలక పోయింది. మద్రాసు మహానగరం లోని సంస్కరణాభిమానులు ఎక్కువగా మాటల్లోమాత్రం పోటుబంట్లు. క్రియలో పంతులుగారికి యథార్థమైన సహకారం అభించింది కాదు.

'...వాక్సహాయము కావలసినంత వచ్చుచున్నను కార్యకారిగాక యది క్రియాశూన్యమయినది. కార్యములలో నాకు తోడుపడెడు మిత్రులు బుచ్చయ్య పంతులుగారు స్వర్గస్థులయిరి. వితంతు శరణాలయములోనికి వచ్చెడువారు సాధారణముగా దూరమునందున్న గంజాము విశాఖు (Sic) పట్టణము గోదావరి కృష్ణామండలములనుండి వచ్చు తెలుఁగువారే కాని చేరువనున్న యఱవదేశమునుండి వచ్చువారొక్కఱును కనఁబడలేదు.... ఈ హేతువు లన్నిటిచేతను నాకు చెన్నపురి విడిచి రాజమహేంద్రవరము మరలఁ జేరినచో నెక్కువపని జరుగవచ్చునని తోఁచినది.'

(స్వీయచరిత్రము.)

నిజం ఇదికాగా, కల్పన మరొకవిధంగా భారతియార్ రచనను నడిపింది. విరక్తితో నిస్పృహతో మకాం ఎత్తివేద్దామని వీరేశలింగం ఆలోచిస్తూండిన కాలంలోనే, ఎక్కడో తంజావూరు సమీపంనుంచి విశాలాక్షిని మద్రాసుకు తెచ్చి నిలపడం జరిగింది. వితంతు పునర్వివాహసమస్య అనేసరికల్లా వీరేశలింగంగారి పేరుతప్ప మరొకటి భారతియార్‌కు తట్టలేదంటే, అది ఆయన తప్పేమీకాదు సరిగదా, వీరేశలింగం ఘనతకు మరొక నిదర్శనమే అవుతున్నది. సమకాలికులలో వీరేశలింగం ఒక ఐరావతమే. ఉత్తరభారతదేశంలో పదుగురు చేయగలిగిన పనులను ఆయన ఒక్కరే చేసి చూపారు.

భారతియార్ రచనలోగల వీరేశలింగం పాత్రీకరణలోగూడా యథార్థం కొంతైనా భంగపడక పోలేదు. వాస్తవంలోకంటె పాత్రగా ఎక్కువ మెరుగెక్కి మనకు దర్శనమిస్తున్నాడు. విధవా పునర్వివాహమంటేనే ఎక్కడాలేని ఓపిక

వస్తుందేమో తెలియదుగాని, తాను ముఖ్యంగా 'ఖడ్గవాది'యే తప్ప 'కార్యవాది' కాదని ఆయన స్వయంగా రాసుకొన్నాడు. ఈ కథలోమట్టుకు కొంత లౌక్యాన్ని జత జేసుకొని కార్యవాదిగాకూడా కనిపిస్తున్నాడు. డిప్యూటీ కలెక్టరు గోపాలయ్యంగారుగారికి విశాలాక్షి గురించి సదభిప్రాయం కలిగించేందుకు వీరేశలింగం దంపతులు పడినశ్రమ ఇక్కడ పేరొక్కనదగింది. తన నైజానికి కొంచెం విరుద్ధంగా ఓర్పూ నేర్పూ చూపెట్టారు పంతులుగారు.

ఈ సందర్భంలో పూజ్యమిత్రులు ముద్దుకృష్ణగారు నాకు చెప్పిన ఒక ఉదంతాన్ని పేరొక్కడం ఉచితమనే అనుకొంటున్నాను.

రాజమండ్రిలోని సంఘసంస్కరణాభిమానులలో పెద్దాడ సుందరశివరావు గారొకరు. ఆయన కుమార్తె కామేశ్వరమ్మకు ఆయన బాల్యవివాహాన్ని నిర్ణయించారు. ఇది విని పంతులుగారు మండిపడ్డారు. నేరుగా సుందరశివరావుగారి వద్దకు వెళ్ళి, పెళ్ళికుమార్తెను 'దీర్ఘసుమంగళీ భవ!' అని దీవించేబదులుగా, త్వరలోనే ముండమోస్తుంది లెమ్మని అర్థం వచ్చేట్లు పరుషంగా మాట్లాడి వెళ్ళిపోయారు. పంతులుగారు భయపడినట్లుగానే, కామేశ్వరమ్మ అచిరకాలంలో విధంతువై పుట్టింటికి తిరిగి వచ్చింది. సుందరశివరావుగారికి బుద్ధికూడా తిరిగి వచ్చింది. పంతులుగారు ఆశీర్వదించి ఉన్నట్లుగానే, ఆమెకు పునర్వివాహం జరిగిపోయింది.

'ఖడ్గవాదం' అంటే ఇదీ. అలాంటివ్యక్తి గోపాలయ్యంగారు విశాలాక్షిని తిరస్కరించి దాసీపిల్ల మీనాక్షిని మరులుగొన్నాడని విన్నాక, అగ్నిరాముడై ఉండేవాడు. అలాకాకుండా, వరుడి మనస్సును మరల్చుదామనే సదుద్దేశంతోటి సమాజంలోగల అంతస్థులనుగురించీ బీదవాళ్ళ సంస్కార శూన్యతగురించీ ఈ కథలో ఒక ఉపన్యాసమే ఇచ్చాడు. 'కార్యవాద'మంటే ఇదీ. అంటే, ఖడ్గవాది అయిన పంతులుగారు భారతియార్ చేతిలో 'కార్యవాది' కాగలిగారన్నమాట!

కందుకూరి రాజ్యలక్ష్మమ్మను గురించిమాత్రం భారతియార్ ఊహించింది యథార్థానికి బాగా అమరిపోయింది. ఆమెగారి శాకపాక విశారదత్వంమాట ఏమోగాని, దూరాభారాలనక అయినవాళ్లను విడిచి దీనంగా దయనీయంగా తమ చూపు కిందికివచ్చి నిలిచిన ఆడబిడ్డలనుచూసి రాజ్యలక్ష్మమ్మ నిలువునా కరిగిపోయేదట. ఇలాంటి సానుభూతే కరువై ఉంటే, వీరేశలింగంగారి చెయ్యి సాగిఉండేదే కాదు. ఈ కథాకాలంతర్వాత ఆరేళ్లకు ఆమె చనిపోయింది. అప్పుడు వీరేశలింగం రాసిన మాటలు భారతియార్ పాత్రీకరణకు మరింత ఉన్మీలనాన్ని కలిగించగలవని వాటి నిక్కడ ఎత్తి రాస్తున్నాను:

'పదమూడవయేట కాపురమునకు వచ్చినది మొదలుకొని యంతకంతకు మా యిరువురకు పరస్పరానురాగము ప్రబలి యిద్దటిము నేకాభిప్రాయములము కాఁజొచ్చితిమి. ఆమెకు నాయందుఁ గుదిరిన యవ్యాజప్రేమనుబట్టి నా యెడల పరమవిశ్వాసము కలదయి నా తోడిదే లోకమని మంచికయినను చెడ్డ కయినను సర్వమునందు నన్ననుసరించుచు భ్రమరకీటన్యాయమున నామె నావలె మాఱుపోయెను. అందుచేత నే నే సాహసకార్యమునం దడుగుపెట్టి నను తాను వెనుకఁజవేయక నన్ను వెనుక కీడ్వక తోడునీడయైయుండి ప్రోత్సాహవాక్యములు పలుకుచు నన్ను ముందుకు నడిపించుచుండెను. నాది కొంత కోపస్వభావము; నా భార్యది శాంతస్వభావము. ఎప్పుడైన చిత్తోద్రేకము కలిగినప్పుడు నే నెవ్వరిని లక్ష్యముచేయక ముందు విచారింపక తొందరపడి మత్తగజమువలె సంచరింపఁ జూచినప్పుడు తానంకుశమయి నన్ను మరలించి యుక్తసమయమున శాంతవాక్య సుధారసముతో నన్నప్పుడు మరల స్వస్థచిత్తునిఁ జేయుచుండును. ఆమె మాతృస్నేహముతో చేసెడి యుపచారము సదా నా శరీరసంరక్షణమున కత్యంత సహకారిగా నుండుచు వచ్చినట్లే మంత్రివలెఁ జేసెడి యుపదేశముకూడ నా యాత్మసంరక్షణమునకు నత్యంత సహకారిగ నుండుచు వచ్చెనని చెప్పవచ్చును.'

(స్వీయచరిత్రము : రెండవభాగము, నాలుగవప్రకరణము)

విశాలాక్షిపట్ల రాజ్యలక్ష్మమ్మ ఈకథలో చూపిన వాత్సల్యంగానీ, అయ్యంగారు మనస్సును విశాలాక్షిపట్ల నుముఖం చేసేందుకు పడిన తాపత్రయంగానీ, వాస్తవంలోలాగే కల్పితకథలోనూ బాగా కుదిరాయి.

ఇంతకూ విశాలాక్షి తన వరుణ్ణి తానే చూసుకొని, పంతులుగారి ఆరాటాన్ని తొలగించివేసింది. ఆయన చేసిందల్లా ఆ పెళ్ళికి ఆధ్వర్యంవహించి వధూవరులను బ్రహ్మసమాజంలో చేర్చుకోవడమే. తాను కుదర్చని పునర్వివాహానికికూడా తానే పెద్ద అయ్యాడు. అదే వీరేశలింగానికి లోక కథాక్రమంలో ఉండిన యథార్థమైన స్థానం. దానికి అయన నాయకుడు.

గొప్పవ్యక్తులు మరణించిన చాలాకాలం తర్వాతగాని లోకం వాళ్ళ గొప్పను అంగీకరించదు. ఇది మామూలు. దీనికి వీరేశలింగం జీవితం అపవాదం. జీవితకాలంలోనే ఆయన కథాపురుషుడయ్యాడనడానికి, ఇదుగో ఈ పుస్తకంకూడా సాక్ష్యం. అంత సామీప్యంలో ఉండిగూడా వీరేశలింగంగారి ఘనతను కళంకరహితంగా ఆవర్భీకరించి చిత్రించినందుచేత, భారతియార్ నవలకు కల్పితవాఙ్మయంలో లాగానే సాంఘికచరిత్రా వాఙ్మయంలోకూడా విశిష్టమైన స్థానం ఉంది.

జవహర్ భారతి
కావలి.

కె. వి. రమణారెడ్డి
18-2-1971.

XI

తమిళదేశపు తపఃఫలం

సుబ్రహ్మణ్యభారతి

1882, డిసెంబరు 11 న తిరునెల్వేలి జిల్లాలోని ఎట్టయాపురం అనే గ్రామంలో ఆయన జన్మించాడు. 1921, సెప్టెంబరు 11 న మదరాసులో తిరువల్లిక్కేణిలో కాలధర్మం చెందాడు. పెద్ద చదువులు చదవలేదు. పెద్ద ఉద్యోగాలు చెయ్యలేదు. సామాన్యుడుగా జీవించాడు. కాని సమ్రాట్టులకు సైతం లభించని కీర్తిని సముపార్జించాడు. జీవించింది సుమారు నాలుగు పదుల సంవత్సరాలే అయినా, నాలుగు కాలాలపాటు నిలిచే సాహిత్యాన్ని సృష్టించి తమిళ సారస్వత చరిత్రలో చిరంజీవి అయినాడు. పాటలూ, పద్యాలూ, కథలూ, వ్యాసాలూ ఎన్నెన్నో వెలయించి; తమిళవాఙ్మయాన్ని సుసంపన్నం చేశాడు; తరువాతి రచయితలకు మార్గదర్శకు డైనాడు. పాతపుంతలు వీడి, కొత్తపుంతలు తొక్కి, ఆధునిక తమిళ వాఙ్మయానికి శ్రీకారంచుట్టి, తమిళ నవయుగ ప్రవక్తగా ప్రథిత యశస్కుడైనాడు! రాజాజీ చెప్పినట్లుగా:

> 'భారతి మామూలు కవి కాడు. నిజమైన కవి. విదేశీయుల పరిపాలనను నిరసిస్తూ జరిగిన పోరాటపు రోజుల్లో ఆయన జీవించాడు. తన అద్భుతమైన కవితలద్వారా భారత జాతీయతను సుస్పష్టం చేశాడు. సంఘ సంస్కరణ ఆవశ్యకమని బోధించాడు. అన్నిటికంటె ముఖ్యంగా, అందరికీ అర్థమయ్యే భాషలో వేదాంతబోధ చేశాడు. ప్రాచీన సంప్రదాయాల తంతువు విచ్ఛినం కాకుండా దాన్ని కాపాడగలిగాడు. కాగా, ఆధునిక తమిళ కవులలో ఆయన అగ్రగణ్యుడుగా ప్రతిభాసిస్తున్నాడు. తమిళ ప్రజల దృష్టిలో ఆయన భగవంతుని వరప్రసాదం!'

సంప్రదాయబద్ధమైన తమిళ సాహిత్యంలో కొత్తదనం ప్రవేశపెట్టిన చిర యశస్సు భారతికే సంక్రమిస్తుంది. ఆయన కవితలో కొట్టవచ్చినట్లుగా కనిపించే విశిష్ట లక్షణం గేయాంశం. ప్రాచీన తమిళకవులలో, ఆళ్వార్లు, నాయన్మారులూ మొదలైన భక్తకవుల చేతుల్లో గేయం అందాలు దిద్దుకుంది. ఆధునికులలో భారతి గేయరచనకు పెద్దపీట వేయడమే కాకుండా, దేశభక్తి, జాతీయ భావాలు, సంఘ సంస్కరణోద్దేశాలు మొదలైనవాటిని ప్రవేశపెట్టి తద్రచనా ప్రక్రియకు ఒక విశిష్టత కల్పించాడు కూడా. కొందరు భారతిని భావకవిగా ప్రస్తుతిస్తారు. మరి కొందరు విప్లవకవిగా కీర్తిస్తారు. ఇంకా కొందరు ప్రకృత్యుపాసకుడుగా కొనియాడుతారు.

నిజం చెప్పవలెనంటే, భారతిలో ఈ మూడు కోవలకు చెందిన కవులూ మనకు కనిపిస్తారు. వచన కవితలు సంతరించాడు. వచన రచనకు వ్యావహారిక తమిళాన్ని ఎంచుకున్నాడు. భావప్రకాశమే ముఖ్య మనుకున్నాడు కాని భాషా ప్రకర్షకు చోటివ్వలేదు. భాషా స్వచ్ఛత అన్న పేరుతో వ్యవహారంలో ఉన్న సంస్కృత శబ్దాలను చిన్నచూపు చూడలేదు. క్షీరంలో నీరంలా, భారతి శైలిలో సంస్కృత ద్రావిడోక్తులు కలసి మెలసి కాపురం చెయ్యడం గమనింపదగిన అంశం. అందుకనే ఆయన రచనల్ని చదువుతున్నప్పుడు, ముఖాముఖి మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. అనగా, భారతి వ్యక్తంచేసే భావం సూటిగా హృదయంలోకి ప్రవేశిస్తుంది. ఆయన పద్యరచనలో కూడా వ్యావహారిక భాషా ప్రయోగాలు కనిపించకపోవు. మొత్తం మీద భారతిశైలి, పద్యమైనా గద్యమైనా, ప్రజాహృదయానికి అతి సన్నిహితంగా ఉంటుంది. నేటి తమిళ రచయితలలో చాలామంది భారతి అభిమానులే. కాని వీరి శైలిలో భారతిలో కనిపించే భాషా సారళ్యమూ, భావగాంభీర్యమూ అంతగా కనిపించవు.

పునర్జన్మం అనే ఒక వ్యాసంలో కవిత, శైలి మొదలైనవాటిని గురించి మాచ్చటిస్తూ భారతి ఏమన్నాడో వినండి.

'మన కవితలలో ఆనందం తగ్గుముఖం పడుతోంది. రాళ్లూ రప్పలూ, ముళ్లూ మొదలైనవాటితో నిండి, ఎగుడు దిగుడుగా ఉండేబాట మన కవులకు మంచిదిగా కనిపిస్తోంది. కవితలో ఓజస్సు, స్పష్టత, మనోహరమైన శైలి_ఈ మూడూ ఉండవలెనని కంబకవి (తమిళ రామాయణకర్త) ఆశయం. ఇదే సమంజసమని నా అభిప్రాయం. పైగా చాలా కాలానికి ముందు వెలుగులోకి వచ్చిన గ్రంథములు ఆ కాలపు భాషను ఆశ్రయించినవి. కాలాలు మారేకొద్దీ, భాషకూడా మారుతున్నది. పాతమాటలు మారిపోయి, కొత్తవి వాడుకలోకి వస్తున్నవి. ఆ యా కాలములకు అనుగుణంగా ప్రజలకు అర్థమయ్యే మాటలను పండితులు వాడాలి. మనోహరములైన భావాలను సరళమైన భాషలో వ్రాయడమే మంచి కవిత్వానికి లక్షణం.'

భారతి మహా లోకజ్ఞుడు. కనుకనే ఆనాటి సాంఘిక రాజకీయ పరిస్థితుల్నీ, సాహిత్య స్వరూపాన్ని బాగా అవగాహన చేసుకుని, తదనుగుణంగా సాహిత్య సృష్టి జరగాలని ఆశించాడు. సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను విమర్శించాడు. జాతి మతభేదాలను నిరసించాడు. స్త్రీ విద్యను ప్రోత్సహించాడు

'భారదేశంలోని ప్రజలందరూ ఏకోదరులు. మనలో జాతిభేదం, మత భేదం, కులభేదం, భాషాభేదం - ఇటువంటి వేమీలేవు. ఇదే యీ కాలానికి వర్తించే లక్ష్యం.'

అని వేరొక్కచోట. మరొకచోట ఇలా వేరొక్కన్నాడు.

'క్రైస్తవులైనా, పార్శీలైనా, మహమ్మదీయులైనా, ఎక్కడినుంచి వచ్చి ఏదైవాన్ని పూజించినా, భారతదేశంలో పుట్టి పెరిగి యీ దేశాన్నే నమ్ముకున్న వారినందరినీ భారతీయులుగానే భావించాలి. ఇది ఏకజాతి. విభజింపరానిది; నాశనం లేనిది.'

మహాకవి సుబ్రహ్మణ్యభారతి వ్యక్తిత్వానికి వన్నెచిన్నెలు తీర్చిదిద్దిన విశిష్ట లక్షణాలలో ఒకటి, ఆయన ప్రదర్శించిన భాషాసహనం. భారతిది అన్య భాషద్వేష మెరుగని మాతృభాషాభిమానం. అందువల్లనే,

'సెందమిళునాడని విన్నంతనే-ప్రవించు
కమ్మతేనెలు శ్రవోయుగళిలో',
'మేము నేర్చిన భాషలలో తమిళము లా
మధురమైనది చూడము మరెచ్చటను.'

అని వేరొక్కన్నా, ఇతర భాషలనుగాని, ఇతర భాషలవారినిగాని ద్వేషించలేదు భారతి. మాతృభాషాభిమానం అవాంఛనీయం కాదు. కాని అది అన్యభాషా ద్వేషానికి దారితీయకూడదు. భారతిలోని స్వచ్ఛమైన యీ భాషాసహనం ఆయనలో జాతీయతాదృష్టిని ఇనుమడింపజేసింది. కనుకనే కన్యాకుమారినుంచి కాశ్మీరం వరకూ గల అఖండ భారతదేశమే తన మాతృదేశమని భావించగలిగాడు. వారణాశిలో జరిగే విద్వత్ గోష్ఠులు కాంచీపురంలో ప్రతిధ్వనించాలని ఆశించాడు. కన్నడ దేశంలో లభించే బంగారాన్ని రాజపుత్ర వీరులకు బహూకరించాలని వాంఛించాడు. కావేరీతీరపు తమలపాకులకు బదులుగా గంగాతీరపు గోధుమల్ని తీసుకోవాలని అభిలషించాడు. భారతి ఈ విషయాన్ని రకరకాలుగా తెలియజేశాడు. ఆ తీరుని పరికించండి.

'భారతదేశము ప్రాచీన మహాదేశము
దాని సంతతివి నీవు, విస్మరించకు దీనిని.'
'వేదము వెలసిన దేశమిది - మేటి
వీరులు పుట్టిన దేశమిది.

అఖండ హిందూస్థాన మిది - దైవ
మనుచు పూజించుము దీనిని, పాపా.'
'అందరిదీ ఒకేకులము
అందరిదీ ఒకేజాతి
అందరూ భారతీయులు
అందరూ ఈ దేశపు సమ్రాట్టులు.'

భారతికి తేనెసోనల తెలుగుభాష అన్నా తెలుగువారన్నా ఎక్కడలేని అభిమానం!

'విరియగాచిన వెన్నెలరాత్రిలో
చేరదేశపు చెలులు వెంటరాగ
సుందరాంధ్రపదమ్ము పాడుచునే
సింధునదిని పడవ నడుపుచు నాడుదాం.'

అని తెలుగులోని తీయదనాన్నీ గానానుకూల్యాన్నీ ప్రశంసించాడు భారతి. తీయని తెలుగుపాట పాడుతూ సింధునదిలో నౌకావిహారం చెయ్యాలట! అనగా, సింధు నదీప్రాంతంలోకూడా తెలుగుపాట వినిపించాలన్నమాట! ఎంత ఉదారాశయం! రామభక్తి సామ్రాజ్యాధినేత అయిన త్యాగరాజునీ, మందార మకరంద మాధుర్యమును తలదన్నే చక్కని చిక్కని కవిత చెప్పిన పోతన్ననూ భారతి కీర్తించాడు.

1917 లో జూన్ మొదటి తేదీని నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభా విశేషాలను గురించి ముచ్చటిస్తూ, తెలుగువారి రాజనీతి శాస్త్రవైదుష్యాన్ని భారతి బహుధా ప్రశంసించాడు. ఈ వ్యాసాన్ని కనుక పరిశీలిస్తే, తెలుగుజాతి విశిష్టతా; భారతి సహృదయతా తెలియవస్తాయి. ఆ వ్యాసంలోని కొన్ని పంక్తుల నిక్కడ యథాతథంగా ఉదాహరిస్తాను.

'తెలుగువారు తమిళుల్ని పరిపాలించిన చిహ్నాలు మన భాషలోనూ నిఘంటువులలోనూ చెరగని ముద్రలుగా నిలిచిపోయినవి. మన సంగీత సాహిత్యశాస్త్రాలుకూడా నేటిదాకా తెలుగులోనే మునిగివున్నాయి. మన గాయకులు పాడే కీర్తనలలో ఉత్తమమైనవి తెలుగు కీర్తనలే...మన గ్రామాలలో నివసిస్తున్న తెలుగు రెడ్లు, నాయుళ్లు, తెలుగు బ్రాహ్మణ పురోహితులు, తెలుగు దేవదాసీలు రాయలవారి కాలంలో ఇక్కడికి వచ్చి స్థిరపడినవారే. మన వివాహసమయాలలో పాడే పాటా లాలీ మొదలైనవి కూడా తెలుగువారి సంప్రదాయానికి చెందినవే. మన భాషలో గమనం, సొగసు, ఎచ్చ

రిక, దొర, వాడిక, కొంచెం, మొదలైన నూర్లకొలది తెలుగుమాటలు కలసి మెలసి పోయినవి.'

మిత్రులు శ్రీ బంగోరె గారు వెలుగులోకి తెస్తున్న యీ చంద్రిక కథలో కవ్యాంధ్ర నిర్మాతలలో ప్రముఖు లనదగిన కందుకూరి వీరేశలింగం పంతులుగారి గురించి చెప్పబడింది. వీరేశలింగం దంపతులను కథాగత పాత్రలుగాచేసి, కథను కమ్మగా నడిపించిన భారతిని కొండాడక తప్పదు. ఇలా కథా వాఙ్మయంలో కందుకూరి వారికి స్థానం కల్పించిన కథకులలో, తెలుగు తమిళ భాషలలో, సుబ్రహ్మణ్య భారతియే ఆద్యు డనడం సాహసం కాదనుకుంటాను. కాని దుర దృష్టం! భారతి యీ నవలను పూర్తి చెయ్యలేదు.

భారతి నవీనుడు; కాని సంప్రదాయ విధేయుడు. అభ్యుదయవాది; కాని ఆర్ష ధర్మములయందు ఆసక్తిగలవాడు. అంటే, ఆర్ష సంప్రదాయములను తు. చ. తప్పకుండా నమ్మవలెనని గాని, అవలంబించవలెనని గాని ఆయన ఆశించలేదు. వాటిలోని మంచిని మాత్రమే భారతి గ్రహించాడు. కాలంతోపాటు, మన సంప్రదాయాలలో మార్పు రావాలని అభిలషించాడు. ఈ సందర్భంలో ఆయన మాటలనే ఉదాహరిస్తాను.

'ఈ ప్రపంచపు ప్రధమధర్మం మార్పు. మార్పు అంటే అన్నిటినీ ఒక్కసారిగా మార్చివేయడం_అని కాదు అర్థం. అర్థవంతములైన మంచి విషయాలను గ్రహించి, లాభరహితము లైనవాటిని మార్చాలి.'

నవభారతావతరణను గురించి ప్రస్తావిస్తూ భారతి ఒక గేయంలో ఇలా పేర్కొన్నాడు.

'నవభారతం అవతరించింది.
ఆమె కొత్తపేరు_పూర్వమున్న పేరే_భరతవర్షం_
మోగించండి గుడిగంటలు
చేయండి విందులు, జరపండి వేడుకలు.
తల్లి కొత్తవిజ్ఞానం సంతరించుకుంటోంది.
కళలూ శాస్త్రాలూ అభ్యసిస్తున్నది.'

ఈ వివిధవిషయాలను అవగాహన చేసుకున్నప్పుడు, భారతి రచనలోని స్వారస్యాన్ని కొంత గ్రహించవచ్చు.

చంద్రిక కథను మూలంగా పరిశీలించినా, విధవా వివాహాల్ని భారతి సహర్షంగా సమర్థించినట్లు తెలియకపోదు. కనుకనే వీరేశలింగం దంపతుల కీ కథలో పెద్దపీట వేశాడు.

ఆ నాటి ప్రముఖులకు కందుకూరివారంటే అఖండమైన గౌరవభావం ఉండేదని చెప్పవచ్చు. తొలి తమిళ దినపత్రికను స్థాపించినవారు, దానికి తొలి సంపాదకులూ, దేశభక్తులూ అయిన జి. సుబ్రహ్మణ్య అయ్యరు, తొలి తమిళ నవలా రచయితలలో ప్రముఖులైన అ. మాధవయ్య ప్రభృతులు కందుకూరివారి ప్రతిభకు జోహారు లర్పించారు. 'పంచామృతం' అనే పత్రికలో మాధవయ్య వీరేశలింగం పంతులుగారిని గురించి వ్రాశాడు. ఆ నాళ్లలోనే పంతులుగారి రచనలు కొన్ని తమిళం చేయబడినవి కూడా. ఆ రోజుల్లో వెలువడిన పత్రికలు, పుస్తకములు మొదలైనవాటిని కనుక పర్యాప్తంగా పరిశీలిస్తే, దక్షిణాపథంలో కందుకూరివారికి గల పేరు పెంపులు తేటతెల్లమవుతాయి.

సుబ్రహ్మణ్య భారతి స్త్రీ విద్యను ప్రోత్సహించడమే కాక, బాల్య వివాహాలను నిరసించాడు. స్త్రీ పునర్వివాహాన్ని ఆదరించాడు. సంఘంలో మహిళకు సముచితమైన స్థానం కలగాలన్నాడు. చంద్రిక కథలో ఒకచోట (పుట_76) భారతి అన్నమాటలు గమనించండి. 'తల్లితర్వాత నీకు అదే (భార్య) దిక్కు. ఇంతదాకా నీవు నీ భార్య ముత్తమ్మను నానా బాధలుపెట్టి ఆనందించేవాడివి. కట్టుకున్న పెళ్లాన్ని రాచి రంపానపెడ్తే ఇంట్లో లక్ష్మి వుండదురా నాయనా. ఈ మాట మర్చిపోబాకు. ఇదే మహామంత్రమని ముడివేసిపెట్టుకో.' అనగా, భార్య తల్లి తర్వాత తల్లివంటిదని పైమాటలలో స్పష్టంచేశాడు.

'మహిళను నీచంగా చూచే

మూఢ్యమును కాల్చివేద్దాము.' అనీ,

'స్త్రీని బానిసగా చూడకు. పూర్వకాలపు తమిళులు భార్యను సహధర్మచారిణిగా భావించారు. ఆత్మా, శక్తి ఒక్కటే. స్త్రీ పురుషులు సమానులు.' అనీ భారతి పేరొక్కొన్నాడు.

చంద్రిక కథలోని కొన్ని పాత్రలవలె, కొన్ని సంఘటనలు కూడా కల్పితములు కావు. ఉదాహరణకు, భూకంపం గాలివాన వచ్చి వేలాంగుడి అగ్రహారంలో జననష్టం జరిగిన సంఘటనను పరిశీలిద్దాం. 1900 ఆ ప్రాంతాల తిరునెల్వేలి జిల్లాలో భూకంపం వచ్చినట్లు జ్ఞాన వయోవృద్ధులైన శ్రీ పి. యన్. అప్పుస్వామిగారివల్ల

తెలుసుకున్నాను. అయితే జననష్టం సంభవించలేదట. బహుశః భారతి యీ భూకంపం విషయాన్ని తన నవలకు అనుగుణంగా మలచుకుని వుంటాడు. భూకంపం గాలివాన వచ్చి వేలాంగుడి సర్వనాశన మయింది. తత్ఫలితంగా విశాలాక్షి, చంద్రిక దిక్కులేని పక్షులయినారు. వేలాంగుడి కనక సర్వనాశనం కాకుండేటే, విశాలాక్షి చెన్నపట్టణానికి తరలివుండేది కాదు. అప్పుడు చంద్రిక కథ మనకు లభించి వుండేదికాదు. కాగా, కథాగమనానికి భూకంపం సంఘటన విశేషంగా తోడ్పడిం దనడంలో సందేహం లేదు. ఇందులోని కొంతభాగం జి. సుబ్రహ్మణ్య అయ్యర్ గారి స్వదేశమిత్రన్ పత్రికలో అచ్చుపడింది. ఆతర్వాత పుస్తకరూపంలో వెలువడింది.

చంద్రిక పేరుమీద భారతికి మోజు ఉన్నట్లు చెప్పవచ్చు. ఆయన చంద్రిక అనే ఒక పాట వ్రాశాడు. దీని రచనాకాలం 1906, 25 సెప్టెంబరు.

మిత్రులు బంగోరె, ఎన్. ఎస్. కృష్ణమూర్తి, వి. ఎస్. రాఘవన్...కలిసి అనువదించిన యీ నవల మూలవిధేయంగానూ, పఠనయోగ్యంగానూ ఉన్నది. అనువాదానికి ఈ రెండూ తప్పనిసరిగా ఉండివలసిన లక్షణాలు. కనుక ఈ తెలుగు సేత పాఠకుల్ని అలరిస్తుందని ఆశిస్తున్నాను.

తెలుగుసేతలో ఉణ్ణింది, వరుమానం (ఆదాయం, రాబడి), బయటచేరు (వారచేరు), అనుకోబాకండి (అనుకోవద్దు) వంటి నెల్లూరు మాండలికాలు కొన్ని కనిపిస్తాయి. ఇవి కొంతమందికి వింతగా కనిపించవచ్చు. కాని నెల్లూరు వెంకట గిరి రాజాగారి కళాశాలలో చదివిన నాకు; నెల్లూరు మాండలికాలంటే మోజుగల నాకు ఇవి ప్రీతిపాత్రములు_రచనలలో మాండలిక పదప్రయోగం వాంఛనీయమని నా అభిప్రాయం. ఇందువల్ల తెలుగులో పదజాలం ఎంత విస్తృతమయిందో మనకు అవగత మవుతుంది.

ఈ నవలను.కనుక కొంచెం శ్రద్ధగా చదివితే, వీరేశలింగం పంతులు_భారతి నివసించిన ఆ రోజులలో భాషాద్వేషమన్నది మచ్చుకైనా కనిపించదు. వీరేశలింగం పంతులుగారు తమిళం మాట్లాడేవారని యీనవల తెలియజేస్తుంది. తిరునెల్వేలి జిల్లాకు చెందిన విశాలాక్షికి తెలుగు వచ్చు. ఆమె ముఖతః భారతి అనిపించిన యీ క్రిందిమాటలు పరిశీలింపదగినవి.

'మా వూర్లో పక్కింట్లో వొక తెలుగు బ్రాహ్మణకుటుంబ ముండేది. చిన్న ప్పట్నుండీ వాళ్లతో స్నేహంగా వుంటూ వాళ్లింట్లో పెరగడంచేత తెలుగు మాట్లాడ్డం నేర్చుకున్నానండి.' (పుట 10)

అలాగే గోపాలయ్యంగారుకి తెలుగు వచ్చు. తెలుగుపత్రిక చదివేవాడు.

భారతీయ సాహిత్యంలోని ఏకత్వాన్ని దర్శించిన విశాలహృదయుడు భారతి. భారతీ స్తవంలో ఇలా పేర్కొన్నాడు.

'చెప్పుమొళి పదినెట్టుడైయాళ్ ఎనిన్ సిన్దనై ఒన్ఱుడైయాళ్.'
(పదునెనిమిది భాషలు గలది అయినా భావంలో ఏకత్వం గలది.)

ద్వేషరహితమైన భాషాభిమానం ఏర్పడినప్పుడే, భారతీయ సాహిత్యంలోని ఏకత్వాన్ని మనం గుర్తింపగలుగుతాము. ఇందుకు ఒక భాషనుంచి మరొక భాషలోనికి ఉత్తమ అనువాదాలు రావాలి. ఈ దృష్టితో చూచినా, చంద్రిక కథ అవశ్యపఠనీయమని భావిస్తున్నాను.

తమిళ నవయుగ ప్రవక్త సుబ్రహ్మణ్యభారతినిగురించి మళ్ళీ నాలుగుమాటలు వ్రాయడానికి అవకాశం కలిగినందుకు సంతోషిస్తున్నాను. ఈ అవకాశాన్ని కలిగించిన మిత్రులు శ్రీ బంగోరెగారి సహృదయతకు నా కృతజ్ఞత.

న్యూఢిల్లీ (మకాం)
సాహిత్యఅకాడమీ.

డా॥ చల్లా రాధాకృష్ణశర్మ
20-2-1971.

ముందుమాటలు

ముందుగా వొక అపాలజీ

ముందుగా వొక అపాలజీ చెప్పుకోవాల. ఎందుకనంటే ఈనాడు తెలుగునాట కనపడే ప్రతి 'అనన్య సామాన్య ప్రచారంగల' తెలుగు వార - మాస పత్రికల్లో సీరియల్స్‌గానూ, సంక్షిప్తంగానూ, స్వతంత్రంగానూ తెలుగు నవలలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న ఈ రోజుల్లో మరొక నవలను ఆంధ్రపాఠక మహాశయుల మీదకు విసరుతున్నందుకు అపాలజీగాక ఇంకేం చెప్పుకోవాల? పైగా ఈ మరొక నవల తర్జుమానవల. కానీ దీన్ని నేను కేవలం మరొక నవలగా తెలుగులోకి తీసుక రావడం లేదు. ఇది పూర్తి నవలకూడా కాదు. అసంపూర్ణంగా వుండిపోయిన నవల. ముద్రణలో పట్టుమని నూరు పేజీలమోయినైనా రాలేదు. అట్లాంటి దీనికి యేపాటి విలువ వుంటుంది?

దీనికున్న విలువల్లా నా దృష్టిలో వొక్కటే-కందుకూరి వీరేశలింగంపంతులు గారంతటి తెలుగు మహాపురుషుణ్ణీ ఆయన ధర్మపత్ని రాజ్యలక్ష్మమ్మనూ అచ్చం కథాపాత్రలుగాచేసి సుబ్రహ్మణ్యభారతి అంతటి తమిళ ఆధునిక మహాకవి దాదాపు 50 ఏళ్లక్రితం వొక నవలవ్రాసి పెట్టిపోతే దాన్ని ఇంతవరకూ మన తెలుగువాళ్లు పట్టించుకోకపోవడం అన్యాయంగా భావించి ఇంతకాలానికి ఈ అనామకుడు ఈ రూపంగా వెలువరించ సాహసించడమే. ఎట్లయితేనేం ఈ 50 ఏళ్లుగా తెలుగు వాళ్ళ దృష్టికి రాకుండా అజ్ఞాతంగా వుండిపోయిన ఈ నవల ఈనాడు ఈ రూపంలో వెలువడ్తున్నది. వీరేశలింగంగారి వైపునుండి శ్రీ కె. వి. రమణారెడ్డి పీఠికాప్రాయంగానూ, సుబ్రహ్మణ్య భారతిగారి వైపునుండి డా॥ చల్లా రాధాకృష్ణ శర్మగారు పరిచయరూపంగానూ రెండు వ్యాసానికలను ఈ నవలకు జతచేసారు. ఇక ఏదిక్కులేని వాణ్ణయిన నేను ఏదిక్కునుండి ప్రవేశించాల్నో తెలియడంలేదు.

మొదట ఈ నవల ఇంకొంచెం 'క్రూడ్‌ఫార్మ్'లో జమీన్‌రైతు పత్రికలో సీరియల్‌గా వెలువడింది. 'గోపాల-కృష్ణ-రాఘవన్' అనే ముగ్గురు గుప్త నామధేయుల పేర అబందరగా తర్జుమాచేయడం జరిగింది. 'గోపాల' అంటే బంగోర (గోపాలరెడ్డి), 'కృష్ణ' అంటే పండిత ఎన్. ఎస్. కృష్ణమూర్తి, 'రాఘవన్' అంటే వి. ఆర్. కాలేజి సంస్కృత అధ్యాపకులు వి. ఎస్. రాఘవన్. ఇందులో మొదటివారికి, తమిళ రాజధాని అల్లుడైనా, తమిళం బొత్తిగారాదు; రెండో

ఆయనకు 'తోడాతోడా' వచ్చు; మూడో ఆయనకు బాగావచ్చు. మూడో ఆయన తమిళమూలం చదివి తెలుగులో 'డిక్టేట్' చేస్తుంటే, రెండో ఆయన గురునాథుడై వ్రాస్తుంటే, మొదటాయన మామూలు తెలుగులోకి పరివర్తన చేసుకుని సీరియల్ గా ప్రచురించేవాడు. ఇట్లా తయారైన ఆ మొదటి ముడిరూపాన్ని తర్వాత కాస్త మెరుగుపెట్టి మూలాన్ని మరొకసారి దగ్గర పెట్టుకుని తెలుగుసేతను మరికొంత సరిచేసి సాఫీచేసి ఈ రూపంలో వెలువరిస్తున్నాను.

వెలువరింపు
వెనుకకథ

ఈ నవల ఈ రూపంగా వెలువడ్డానికి వెనక వొక కథవుంది. 1968 లో నార్ల గారు ఇంగ్లీషులో వీరేశలింగంగారిపైన వొక పుస్తకాన్ని వ్రాసారు—కేంద్ర సాహిత్య అకాడమీవారి 'భారతీయ సారస్వత నిర్మాతల జీవిత చరిత్రల' సీరీస్‌లో. అచ్చయిన కొత్తలోనే అది నాచేతికొచ్చి సగందాక చదివి వుత్తేజితుణ్ణవుతున్న దశలోనే-ఈ పుస్తకంపై ఇంగ్లీషు పత్రిక 'స్వరాజ్య'లో శ్రీమతి ప్రేమానంద కుమార్ గారు సమీక్ష చేసారు. 1968 నవంబరు 2 తేది సంచికలో. ఇది వొట్టి సమీక్షగా కనపళ్ళేదు-భారతిగారు వీరేశలింగంగార్నీ ఆయన భార్యనూ పాత్రలుగా చేసి వ్రాసిన ఈ తమిళ నవలను ప్రముఖంగా ప్రత్యేకంగా తెలుగువారి దృష్టికి తెచ్చేదానికోసంగానే ప్రధానంగా ఈ సమీక్షను ఆమె వుపయోగించుకున్నదా అనిపించింది.

అది చదివినతర్వాత నాలో వుత్సుకత కల్గింది. తెలుగు వీరేశలింగంగార్ని ఏమిటి, అరవ సుబ్రహ్మణ్యభారతిగారు పాత్రగాచేసుకుని నవల వ్రాయడమేమిటి-ఈ విషయాన్ని ఆరాతీయాలనిపించింది. రెండుసెల్లు వేచిచూచాను-తెలుగువాళ్ళకు ఇన్ని పెద్దపత్రికలున్నాయికదా, ఈ పెద్దపత్రికల్లో పనిచేసే పెద్ద రచయితలు ఈ సమీక్షను చూచినతర్వాతైనా ఆ నవల విషయం పట్టించుకోకుండా వుంటారా-అని కొంతకాలం దాటవేసాను. ఎంతకాలం చూచినా ఆ విషయం ఎవరుకూడా పట్టించుకొన్నపాపాన పోయినట్లు లేదు. మన జాతీయ పెద్ద పత్రికా రచయితలకు పెద్దపెద్ద అంతర్జాతీయ విషయాలుతప్ప ఇట్లాంటి చిన్నచిన్న జాతీయ దేశీయ విషయాలు పట్టవేమో?

కడకు వొక చిన్న మారుమూల పత్రికలో పనిచేసే నేనే పట్టించుకోవల్సి వచ్చింది. మద్రాసువెళ్లి ఆ నవల ముద్రిత ప్రతిని సేకరించి చదివించుకోగా ఆశ్చర్యం కల్గింది. ఇంతటి చారిత్రక ప్రాధాన్యం కల్గిన రచనను ఇంతకాలం

ఎవరూ పట్టించుకోకపోవడం విడ్డూరంగానే తోచింది. కేవలం వొక చిన్న 'లిటరరీ స్కూప్'గా భావించి హడావుడిగా దీన్ని 'జమీన్ రైతు'లో సీరియల్‌గా ప్రచురించడం జరిగింది. అంతటితో ఆ విషయం తీరిపోయింది.

ఈ నవలను గూర్చిన కొన్ని ప్రస్తావనలు

ఇక్కడొకమాట చెప్పవల్సివుంది-ఈ నవలనుగూర్చి ఇంతకాలం ఎవరూ పట్టించుకోలేదనడం సత్యదూరమే అవుతుంది. 1942 ఏప్రిల్-జూలై 'ఆంధ్ర సారస్వత పరిషత్ పత్రిక'లో కొమాండూరు శరకోపాచార్యులుగారు 'సుబ్రహ్మణ్య భారతి' అనే వ్యాసంలో ఈ నవలనుగూర్చి ఇట్లా ప్రస్తావించివున్నారు:

"'చంద్రికైయిన్ కవితై' అనునది సాంఘికనవల. దాని కథ చాల మనోహరము. మన సాంఘిక లోపముల బోగొట్టు సంస్కరణోద్దేశముతో భారతి ఈ నవలను రచించెననుట స్పష్టము. విధవా వివాహము సంఘక్షేమకరమనియు బ్రాహ్మణ శూద్రులమధ్యను వివాహమును నిజముగ ప్రేమజనితమైనపుడు నిర్దోషమనియు నిందలి కథవలన సూచితము. మఱియు భారతి సందర్భోచితముగ నీ నవలలో దాక్షిణాత్య సంస్కర్తలలో ముఖ్యుడగు జి. సుబ్రహ్మణ్యయ్యరును, ఆంధ్ర సంస్కర్తలలో నగ్రేసరుడైన మహాకవి శ్రీ వీరేశలింగం పంతులుగారిని కథాపాత్రలుగా బెట్టి వారిట్టి సంస్కరణల కొఱకు ప్రచారమును ప్రత్యక్షనిజేసి ధన్యులైనట్లు యథార్థ కథను గూడ నిందు మిళితముచేసి వివరించినాడు. ఇందువలన భారతికి మన వీరేశలింగంగారిపైన విశేష గౌరవముండెననియు నిందువలన వ్యక్తమయినది."

తర్వాత 1948 ఏప్రిల్ 'భారతి' పత్రికలో వీరేశలింగంగారిపై శ్రీనిడదవోలు వెంకటరావు వొక వ్యాసం ప్రాస్తూ ఇట్లన్నారు:

"సంఘ సంస్కరణమున వితంతూద్వాహ మూలమున వీరేశలింగ కవికీర్తి రాష్ట్రేతర ప్రదేశములయందు వ్యాపించినది. తమిళ దేశీయులకు జాతీయ కవియైన సుబ్రహ్మణ్యభారతి తన రచనలో 'చంద్రికై' అను ఒక నవలయందు వీరేశలింగంగారి పాత్రను అద్భుతముగ చిత్రించి వున్నారు."

ఆ తర్వాత "తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావం" (1960) అనే గ్రంథంలో డా॥ కొత్తపల్లి వీరభద్రరావుగారు 439 పేజీలో 'ఫుట్ నోట్సు'గా—

"ప్రఖ్యాత తమిళ కవియైన సుబ్రహ్మణ్య భారతి తన 'చంద్రిక' యను రచనలో వీరేశలింగం పంతులుగారిని పేర్కొని వారి సంఘ సేవ నుగ్గడించెను"—

అని ఇరికించివున్నారు. ఇక వీటన్నిటి తర్వాత డా॥ చల్లా రాధాకృష్ణశర్మగారు కూడా తన 'సుబ్రహ్మణ్యభారతి' అనే గ్రంథంలో ఈ నవలనుగూర్చి పేర్కొనక పోలేదు.

ఇట్లా ఈ తమిళ నవలనుగూర్చి ఎట్లనో ఒకట్లా మన తెలుగువారు కొన్ని తరాలుగా పేర్కొంటూ వస్తున్నా ఎందువల్లనో ఇంతకాలం 'తెలుగు వెలుగు' చూడలేక పోయింది. ఇన్నాళ్లకైనా ఈ నవల వెలుగుచూస్తున్నది. అదే పదివేలనుకొందాం. సీరియల్ గా వెలువడ్డ లగాయితూ ఈ నవలనుగూర్చి అప్పుడప్పుడూ ఆలోచించిన కొద్దీ వీరేశలింగంగారి జీవితానికి సంబంధించి కొన్ని కొత్తకోణాలు స్ఫురిస్తూ కొత్త సందేహాలు కల్గుతూ వచ్చాయి.

ప్రశ్నలూ - సందేహాలూ

అరవ భారతిగారికీ తెలుగు వీరేశలింగంగారికీ పరిచయమేమైనావుందా? పరిచయ ముండివుంటే వీరేశలింగంగారి స్వీయచరిత్రలో భారతిగారి ప్రస్తావన లేదెందువల్ల? పరిచయం లేకపోతే వీరేశలింగంగార్ని ఒక పాత్రగా ఎన్నుకుని నవలను నిర్మించేందుకు భారతిగార్ని ప్రేరేపించిన శక్తులేవి? వీరేశలింగం గారు మద్రాసులోను, బెంగుళూరులోను సంఘసంస్కరణవిషయంగా అంత కృషిచేసినపుడు ఆ భాషలవారికి ఆయనపై కల్గిన భావాలేమిటి? వాళ్ళ reactions ఏమిటి? ఏదో 'సైటైర్లు'గాను 'సింబాలిక్'గానూ వ్రాయడంగాక అసలు సమకాలిక వ్యక్తులను (వొక్క వీరేశలింగంగార్నే గాక, హిందూ పత్రిక సంస్థాపక-సంపాదకుడైన జి. సుబ్రహ్మణ్యయ్యర్ను కూడా) అదే పేర్లతో పాత్రలుగా స్వీకరించి నవలగా వ్రాసే సంప్రదాయమేమిటి? ఆట్లా రచన సాగినపుడు చరిత్రకూ సారస్వతానికీ తేడాను పరిశీలించేదెట్లా? ప్రపంచ సారస్వతంలో ఇట్లాంటి సాదృశ్యాలున్నాయా? (నిజానికి ఇట్లాంటి సాదృశ్యాలు కొన్ని లేకపోలేదు - స్కాట్ వ్రాసిన 'సర్జన్స్ డాటర్' అనే నవలలో మన తెలుగువాడూ ఆ రోజుల్లో మద్రాసు ప్రముఖుడూ అయిన అవధానం పాపయ్య వొక పాత్ర అయి కూర్చున్నాడు; థాకరే వ్రాసిన 'న్యూకమ్స్' నవలలో 'రొమన్ లాల్' పాత్ర కల్పనకు

సాహిత్తు మన భారతీయుడు రాజారామమోహనరాయ్‌గారు లండన్‌లో పర్యటించినప్పటి సన్నివేశాల ప్రభావం వుందంటారు; ప్రిన్సెప్ నవల 'బాబూ'లో బ్రిజ్ మోహన్ బెనర్జీ, హెచ్. జి. వెల్స్ 'జోన్ & పీటర్'లో మీర్‌జలాలుద్దీన్ వగైరావగైరా సమకాలికులు పాత్రలుగా ప్రవేశపెట్టబడినట్లు 'మిథిక్ సొసైటీ జర్నల్' 1942 జనవరి సంచికలో పి. ఆర్. కృష్ణస్వామిగారు వ్రాసిన 'ఇండియన్ కారెక్టర్స్ ఇన్ ఇంగ్లీషు ఫిక్షన్' అనే వ్యాసంలో పేర్కొని వున్నారు.) ఇట్లా ఈ వివిధ ప్రశ్నలపై మనసుపోయి కొంత పరిశీలన-పరిశోధన చేయవల్సి వచ్చింది.

వీరేశలింగంగారికీ
భారతిగారికీ పరిచయముందా?

వీళ్ళిద్దరికీ పరిచయమున్నట్లు దాఖలా లేమీ లేవు-వున్నంతమటుకు వీరేశలింగం గారి స్వీయచరిత్రలో భారతిగారి ప్రస్తావనే ఎక్కడా లేదు. వీరేశలింగంగారి అస్తమయం 1919 లో, భారతిగారిది 1921 లో-రెండేళ్ల ఎడమవుంది. భారతి గారు పుట్టింది 1882 లో, వీరేశలింగంగారు 1848 లో-ఇద్దరిమధ్య 34 ఏళ్ళ తేడా వుంది. మిగతా విషయాల సంగతటుంచి వీరేశలింగంగారు భారతిగారికన్నా వయస్సులోనూ అనుభవంలోనూ పెద్దవారు. ఈ పెద్ద చిన్న ప్రస్తావన లటుంచి ప్రవృత్తిలో ఇద్దరికీ చాలామటుకు ఏకతవుంది గాబట్టి, వొక విధంగా సమకాలికులు గావడమేగాక ఇంకోవిధంగా మద్రాసుతో ఇద్దరికీ సన్నిహిత సంబంధమున్నపుడు పరిచయంలేకుండా ఎటుంటుందనేది మొదటి సందేహం.

వీళ్ళ జీవిత చరిత్రలను సూక్ష్మంగా పరిశీలించినపుడు ఆ సందేహానికి తావు లేదు. వీరేశలింగంగారు పెద్దయి, కాస్త ప్రముఖుడై మొట్టమొదట మద్రాసుకు వచ్చింది 1875 లో. అప్పటికి భారతి పుట్టనేలేదు. తర్వాత 1882 - 83 లో వచ్చినపుడు భారతి ఇంకా ఎట్టయాపురం పొత్తిళ్ళు దాటి రానేలేదు. ఇకపోతే దీనితర్వాత 15 ఏళ్ళకు 1897 లో వీరేశలింగంగారు మద్రాసువచ్చి ప్రెసిడెన్సీ కాలేజి తెలుగు అధ్యాపకుడై ఇతర సామాజిక వుద్యమాల్లో కూడా ప్రముఖుడుగా వుంటూ అక్కడే స్థిరపడి 1904 చివరిదాకా మద్రాసులోనే వుండి 1905 జనవరిలో రాజమండ్రి చేరుకుంటారు. ఈ కైమువకు భారతి అన్నిటా పెద్దవాడై 'స్వదేశ మిత్రన్' తమిళ దినపత్రికలో 1904 లో చేరడానికి మద్రాసు వచ్చారు.

1905 తర్వాత వీరేశలింగంగారి జీవితానికి వొక విధంగా రాజమండ్రే కేంద్రమైపోయినా ఆ తర్వాత కాలంలో మద్రాసుకొచ్చిన సందర్భాలు కొన్ని వున్నా అప్పుడు భారతిగాగు వీరేశలింగంగార్ని కల్సివుండే అవకాశం వుండదు,

ఎందుకనంటే 1908 నుండి 1918 నవంబరుదాకా పదేళ్ళ పర్యంతం భారతిగారు పాండుచ్చేరిలో ప్రవాసిగా వుండిపోవల్సి వచ్చింది.

అయితే వీరేశలింగంగారు 1919 లో మరణించింది మద్రాసు వేదవిలాస భవనంలో. (ఈ వేదవిలాస భవనం మద్రాసు మైలాపూర్‌లోనని శ్రీ ఆవుల సాంబ శివరావుగారి అధ్వర్యంలో అచ్చయిన వీరేశలింగం స్మారక సంచిక (1963) లో పేర్కొనబడిందిగానీ, అది ఎగ్మూరు ప్రాంతంలోనిది.) ఈ మరణానికి కొంచెం అటు ఇటుగా భారతిగారు వీరేశలింగంగార్ని మద్రాసులో కల్సివుంటారా అనుకునే దానికికూడా ఆస్కారంలేదు. భారతిగారు 1918 నవంబరు 20 తేదిన పాండుచ్చేరినుండి మద్రాసుకు తిరిగివచ్చినా దాదాపుగా 1920 వరకూ కడయం ప్రాంతంలోనే వుండిపోయారు. 1920 డిసంబర్‌లోగానీ మళ్ళీ 'స్వదేశమిత్రన్' చేరుకోలేదు. అయితే ఈ మధ్యలో 1919 మార్చిలో భారతిగారు మద్రాసులో రాజాజీ ఇంట గాంధీగార్ని కల్సినట్లు ఓక దాఖలావుంది. వీరేశలింగంగారు మద్రాసు వచ్చింది 1919 ఏప్రిల్ 21 తేదిన, మరణించింది 1919 మే 28 న. ఈ మరణమాసన్న మైవున్న వీరేశలింగంగార్ని భారతిగారు మద్రాసులో చూచి వుంటారా ?

అంతేకాదు, ఇంతకంతేముందు భారతిగారు 'స్వదేశమిత్రన్'లో పని చేయడానికి 1904 నవంబరులో మద్రాసుకు వచ్చారుగదా. అప్పుడు వీరేశలింగంగారు మద్రాసులోనే వున్నారు మరి - ఇంతోనెలా రెణ్ణెల్లకల్లా మద్రాసుకు గుడ్‌బై చెప్పేసి రాజమండ్రికివెళ్ళి స్థిరపడేదానికి పెట్టే బేడా సర్దుకుని సిద్ధమవుతున్నారు. ఈ వొకటి రెణ్ణెల్లవ్యవధిలో భారతిగారు వీరేశలింగంగార్ని కలిసివుండేదానికి అవకాశం లేకపోలేదు. 'స్వదేశమిత్రన్'లో జర్నలిస్టు అయ్యాడు కాబట్టి ఏదైనా సభల్లో గిభల్లో భారతిగారు వీరేశలింగంగార్ని కల్సివుండొచ్చు. కనీసం చూరం నుండైనా చూచివుండొచ్చు. ఈ రెండు స్వల్పవ్యవధులను తీసేసిచూస్తే, భారతిగారు వీరేశలింగంగార్ని కనీసం చూచికూడా వుండేదానికి ఆస్కారం లేదేమో.

ఏవిషయమూ ఖచ్చితంగా చెప్పడానికి మనకు వాళ్ళ డైరీలు, లేఖలవంటివి సమగ్రమైన గట్టి దాఖలాలు లేవు. ఇటీవల మంజుశ్రీగారు సంకలనంచేసిన వీరేశలింగంగారి డైరీలు, లేఖలు (విశాలాంధ్ర ప్రచురణాలయం 1970 నవంబరు) గ్రంథంలో డైరీలకు సంబంధించి అన్ని సంవత్సరాల్లోనూ అన్నిపుటలూ లేవు. అందువల్ల ఏవిషయమూ చెప్పలేనిస్థితిలో వున్నాం. ఇక సుబ్రహ్మణ్యయ్యర్‌గార్ని కథాపాత్రగా ఎన్నుకొన్నారంటే నేరుగా అతనికిందనే పనిచేసాడు భారతి.

వీరేశలింగంగారితో భారతికి పెద్ద పరిచయం వుండివుండదనుకోడానికి ఈ 'చంద్రిక కథ'లోనే మనకొక చిన్న 'క్లూ' దొరుకుతుంది. నవల కొనసాగినంత వరకూ వీరేశలింగంగారి భార్యనుకూడా ఇందులో వొక ప్రముఖపాత్రగానే చిత్రించివున్నా ఆమెపేరు ఎక్కడా చెప్పలేదు. పేరెందుకు చెప్పలేదు? తెలియదు కాబట్టే చెప్పలేదు. పేరెందుకు తెలియదు? ఆయనతో ఆయనకుటుంబంతో అంత పరిచయంలేదు గాబట్టే తెలిసుండదు అని తీర్మానించుకోవడం తొందరపాటు కాదేమో.

తెలుగువారి వర్ణాంతరవిందు భోజనంలో భారతి

అయితే తెలుగువారితో భారతికి పరిచయం లేకపోలేదు. ఒక తెలుగువ్యక్తి 1906 సెప్టంబరులో మద్రాసులో ఏర్పాటుచేసిన వొక 'వర్ణాంతరవిందు భోజనాని'కి భారతిగారు హాజరైనట్లు ఆనాటి 'కృష్ణా పత్రిక'లో వొక దాఖలా దొరికింది. 1906 సెప్టంబరు 15 తేది కృష్ణాపత్రిక 9 వ పుటలో ఈ క్రింది వార్తాంశాన్ని పరిశీలిస్తే ఈవిషయం తెలుస్తుంది.

> "మనదేశమునందు లెక్కలేని వర్ణములుండి, యొకరికొకరికి నైక మత్యము చెడి, సంఘము చీలిపోవుచుండుటచే నైకమత్యము, సోదర భావము పుట్టించుటకుగాను సెప్టంబరు నెల 2 వ తేది చెన్నపురిలో పెద్ద విందుజరిగెను. దానికి కోకా అహోబిల నరసింహారావునాయుడు గారేను రూపాయలనొసంగి, సంవత్సరమున కొక సభయైన రావింప సమకట్టిన, ప్రతిసంవత్సర మిటులనే యిచ్చుటకును అటుగాక శాశ్వ తముగా మూలధనమును జేర్చి నుద్దేశమున్న నూరురూపాయల నిచ్చెదమనియు వాగ్దానము చేసిరి. లక్ష్మీనరసు నాయుడుగారును, డేవి డాశీర్వాదముగారును, అన్నాజీరావుగారును, సుబ్రహ్మణ్య భారతిగారును డెబ్బదియేనుకంటె నధికముగ బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర, పంచమ, క్రైస్తవ, మహమ్మదీయాది జాతులవారు వచ్చిరి.
>
> "ప్రొఫసరు లక్ష్మీనరసు నాయడుగా రధ్యాసనాధిపత్యము వహించి జాతిభేదం బొకింతైన మది నంటనీక యొండొరుల కనురాగ మును జూపించుచు, లోకమునం దెల్లరిని ప్రేమించి వారలయందు

సహోదరభావముంచి సత్యమార్గమునం బ్రవర్తింపవలయుననియు, ఇట్టి సభ నొకటి రావించక మరి యేవిధంబునైనను అభివృద్ధి చెందెద మని యత్నించిన యది సాఫల్యము గానేరదనియు, సావకాశముగ బనుల నెరవేర్చెదమనునది మిగుల నింద్యమనియు, ఒక్కొక్కడును నిజశక్తికి జాలినంతసాహాయంబు జేసెనేని మహాయద్భుతకార్యములఁ జేయనగుననియు, ఇట్టి సభ లల్పమాత్రంబులైనను నొండొరులకుంగల ద్వేషంబును నివారించి వారియం దనురాగముఁ గలుగజేసి జనంబుల మనంబులు రంజిల్లజేయుననియు సెలవిచ్చిరి. నాయుడుగారి యూహి పత్యముక్రింద ప్రతి సంవత్సరము నొకసభ గావించుటకు నాఱుగురు కార్యనిర్వాహకుల నేర్పరచిరి. ఇవ్విధంబున సరససల్లాపముతోడ కాలముగడపి సంతోషభరితాత్ములగుచు....." అని వుంది—
(ఆఖరు రెండులైన్లు చిరిగిపోయి వున్నాయి).

తెలుగువాడైన కోకా అహోబిల నరసింహారావునాయుడుగా రేర్పాటుచేసిన ఈ వర్ణాంతరవిందు భోజనసభలో వీరేశలింగంగార్ని గూర్చి భారతిగారు కాస్త వివరంగా విని వుంటారా? ఈ కోకా అహోబిల నరసింహారావునాయుడుగారికీ- వీరేశలింగంగారు 1901 లో మద్రాసులో చిరంజీవమ్మతో వివాహంచేసిన పిఠాపురం 2 వ దివాను కోకా వెంకటసుబ్బారావు నాయుడుగారికీ (వీరేశలింగంగారు జరిపించిన 33 వ వివాహం) ఏమైనా బంధుత్వం వుందా? ఈ విందుభోజనాన్ని గూర్చి భారతిగారు తమిళ స్వదేశమిత్రన్‌లో ఏమైనా రిపోర్టు వ్రాసారా? అందులో వీరేశలింగంగారి ప్రస్తావనేమైనా చేసారా? ఇవన్నీ పరిశోధించాల్సిన అంశాలు.

1908 లో తిరునల్వేలి ఇంగ్లీష్ కలెక్టరు 'ఆష్'ను అతివాదులు కాల్చి చంపినపుడు, దానిపై తెలుగు 'స్వరాజ్య'పత్రికలో గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి సంపాదకీయాన్ని పురస్కరించుకుని 1909 జులైలో రాజద్రోహం నేరం మోపినపుడు ఈ కేసులో వొక ముద్దాయైన పింగళి లక్ష్మీనారాయణగారుకూడా అరెస్టు తప్పించుకుని పాండుచ్చేరి వెళ్లారు. అంతకుముందే అక్కడకు చేరుకునివుండిన భారతితో ఈయన పరిచయం కల్పించుకున్నారా?

ఏమైనా భారతిగారు తన స్వీయజీవితంలో పరిచయంలేని (కనీసం అంతగా పరిచయంలేని) వీరేశలింగంగార్ని తనకవితలో వొకపాత్రగా ఎన్నుకోడానికి తోడ్పడినశక్తి లేవి? వీరేశలింగంగార్ని తప్ప ఇంకొకర్ని ఎన్నుకొనడానికి వీలు

లేని పరిస్థితిగనుకనే ఆయన్ను ప్రస్తావించవల్సి వచ్చింది. దక్షిణభారతదేశంలో విధవావివాహాలవంటి సంఘసంస్కరణవిషయాలన్నపుడు వీరేశలింగంగారి పేరు తప్పనిచ్చి ఇంకొకరిపేరు స్ఫురించని అప్రతిహతమైనస్థానాన్ని ఆయనకొక్కరికే దక్కింది గనుక, తన నవలలో విధవావివాహం చేయించాల్సినపుడు వీరేశలింగం గారి ప్రస్తావన తేవడం మినహా భారతిగారికి వేరే దారిలేకపోయిందని అనుకోవల్సి వుంది. ఏమైతేనేం ఆధునిక తమిళమహాకవి అనదగిన సుబ్రహ్మణ్యభారతి అంతటి వానిచేత వొక నవలలో గౌరవనీయమైన పాత్రగా మలచబడిన విశేషగౌరవం తెలుగుమహాపురుషుడైన వీరేశలింగంగారికే దక్కింది. ఒకరకంగా తెలుగుజాతికే ఆ గౌరవం దక్కిందనుకొందాం.

ఈ నవల రచనాకాలం

భారతిగారు ఈ నవలను ఎప్పుడు వ్రాసినట్లు? ఎంతమందిని కనుక్కున్నా ఎన్నిపుస్తకాలు చదివినా స్పష్టంగా చెప్పినవారు లేరు. కథాప్రారంభమే-1901 సంవత్సరంలో వేలాంగుడిలో వచ్చిన భూకంపంతో. "ఆ బీభత్సమైన భూకంప తాండవం సమసిపోయి మూడేళ్ళయింది. 1904 సంవత్సరం కడపటి భాగంలో సుబ్రహ్మణ్యయ్యర్ బొంబాయి కాంగ్రెసు పోదల్చి దుస్తులు, తిను బండారాలు సర్దుకుంటుండినారు"—అని రెండో అధ్యాయంలో ప్రారంభవాక్యాలివి. అంటే ఈ నవలారచన 1905 తర్వాతనే అయివుండాల. 1905 తర్వాత ఎప్పుడు? 1905 మందట్నే రచించాడనుకుంటే-1921 లో భారతి చనిపొయ్యేంత వరకూ ఈ రచనను మధ్యలోనే ఎందుకు ఆపేసి పెడ్తాడు పూర్తిచేయకుండా?

ఈ నవలలో కొంతభాగం స్వదేశమిత్రన్ పత్రికలో సీరియల్‌గా ఏమైనా వచ్చిందా? "ఇందులోని కొంతభాగం జి. సుబ్రహ్మణ్యయ్యర్ గారి స్వదేశమిత్రన్ పత్రికలో అచ్చుపడింది"-అని డా॥ ఎల్లా రాధాకృష్ణశర్మగారి పరిచయవ్యాసంలో పేర్కొనివున్నారు. ఈ నవల ఆఖరులోవున్న పబ్లిషర్స్‌నోట్‌లో తర్వాతవచ్చే కథాభాగానికి సంబంధించి తయారుచేసి పెట్టిపోయిన చిత్తుప్రతిని భారతిగారు స్వదేశమిత్రన్ మేనేజరుకు ఇచ్చిపోయినట్లున్న వాక్యాన్నిబట్టి అంతే అన్పించ వచ్చుగానీ, ఇది శర్మగారు నిక్కచ్చిగా తేల్చుకుని చెప్పినమాటగా కనపళ్ళేదు. భారతిగారికి ప్రియమిత్రుడు, సన్నిహిత సహచరుడూ అయిన కే. శే. వి. ఒ. చిదంబరంపిళ్లైగారి కుమారుడు శ్రీ వి. ఒ. సి. సుబ్రహ్మణ్యన్ గార్ని ఇటీవల మద్రాసు యు. ఎస్. ఐ. ఎస్. కార్యాలయం తమిళవిభాగంలో కల్సినపుడు అడ్డగా-ఆయన స్వదేశమిత్రన్ పాతసంచికల ఫైళ్ళన్నిట్నీ తిరగేసి పరిశోధనచేసిన

'కుమారి మలర్' సంపాదకుడు శ్రీ వి. కె. చెట్టియార్‌కు ఫోన్ చేసి కనుక్కొంటే స్వదేశమిత్రన్‌లోమాత్రం సీరియల్ గా పడలేదని సమాధానమిచ్చినట్లు చెప్పారు. మరి ఇంకోపత్రికలో ఏమైనా మొదట సీరియల్ గా పడిందా?

ఇటీవల పక్కుంరోజులక్రితం విశాఖపట్నంలో భారతి బైయోగ్రఫర్ శ్రీమతి ప్రేమానందకుమార్ గార్ని కల్సి విచారించగా—ఈ నవలను ఆయన పాండుచ్చేరిలో వుండగా వ్రాసినట్లుగా వా. రా. గారు ఎక్కడో పేర్కొనివున్నట్లు చెప్పింది. పాండుచ్చేరిలో వుండగా వ్రాసినట్లు అంటే 1908-1918 మధ్యకాలంలో ఎప్పుడైనా వుండొచ్చుననన్నమాట. నా కెందుకో ఈ రచనాకాలం సరియైనదై వుండక పోవచ్చునని తోస్తున్నది. వా. రా. గారు వొకవేళ అట్లా వ్రాసేవున్నా-శ్రీ పి. మహాదేవన్ గారు భారతిపైవ్రాసిన ఆంగ్లగ్రంథంలో—"...for such details as dates and sequences Va. Ra. shows an airy disregard which though amusing in one sense is tantalising to the lover of chronology..." అని పేర్కొనబట్టి వా. రా. ఇచ్చిన తేదీలను మనం అంతగా ఖాతరుచేయాల్సిన పన్లేదేమో.

నే నూహించడంలో భారతిగారు చనిపోయేదానికి కొన్ని నెలలముందు, అంటే, 1920 కి కొంచెం అటు ఇటుగా ఈ నవలను ప్రారంభించి కొంతపరకు సాగించి అట్టే పెట్టేసి వుంటారని తోస్తున్నది. ఈ వూహకు కొన్ని కారణాలు లేకపోలేదు. 1916 లో జి. సుబ్రహ్మణ్యయ్యర్ మరణించిన మూడు సంవత్సరాలకు 1919 మే లో వీరేశలింగంగారు అస్తమించారు. ఈ మరణాన్ని పురస్కరించుకుని అప్పటి ఇంగ్లీషు, తమిళ పత్రికల్లో వీరేశలింగంగారిపై obituary రచనలు కొన్ని వచ్చి వుండొచ్చు. సంతాపసభలు సమావేశాలు కొన్ని మద్రాసులో జరిగుండొచ్చు. మిత్రులుకూడా వార్నిగూర్చి వారి గొప్పతనాన్నిగూర్చి చెప్పి వుండొచ్చు. ఇవి చదివీ వినీ భారతిగారిలో ఈ రకం నవల వ్రాయాలనే ప్రేరణ కల్గివుండొచ్చు. అంతేగాక ఆ వ్యక్తులు బ్రతికుండగానే కన్నా చనిపోయిన తర్వాతనే వాళ్ళను పాత్రలుగా పరిచయం చేయాలనే ఆలోచన సహజంగా వుంటుంది. అప్పుడు ఈ నవల రచనకు వుపక్రమించి కొంత దూరందాకా వ్రాసిన తర్వాత కొద్దికాలానికే భారతిగారు మద్రాసు దేవళంలో ఏనుగవాతబడి ఆరోగ్యం దెబ్బతిని హఠాత్తుగా మరణించారు గనుక అక్కడితో ఇది అసంపూర్తిగా మిగిలి పోయి వుండొచ్చు. భారతిగారు చనిపోయినతర్వాత పదేళ్ళకు 1930 ప్రాంతంలో ఆ వ్రాతప్రతుల్ని బయటకుతీసి గ్రంథరూపంలో వెలువర్చి వుండొచ్చు. ఇదీ నా వూహ. తప్పుగావచ్చు, వొప్పు కావచ్చు.

పోతే, రమణారెడ్డిగారు తన పీఠికలో వొక చిన్న 'పాయింట్' లేవ దీసారు. వీరేశలింగంగారు 1897 నుండి 1905 దాకా వున్నది మద్రాసు వెల్లాలవీధి (పరశువాకం)లో అయితే, భారతిగారు ఎగుంబూరు (ఎగ్మూర్) అని ఎందుకు పేరొక్కనవల్సి వచ్చింది - అనే అంశంపై కొంత చర్చ చేసారు. ఈ విషయమై కూడా నే నీ విధంగా వూహిస్తున్నాను. భారతిగారు 'ఎగ్మూరు' అని ఎందుకు పేరొక్కనవల్సి వచ్చిందంటే - 1919 లో వీరేశలింగంగారు మరణించింది మద్రాసు ఎగ్మూరులోని వేదవిలాస భవనంలో. మరణ మప్పటి ఈ ఎగ్మూరు భవనమే వీరేశ లింగంగారి మద్రాసు నివాసస్థానమని ఆ మందట్లో నవల వ్రాసిన భారతిగారు పొరపాటు పడివుండొచ్చు ననడానికి వీలుంటుంది. లేకుంటే ఎగ్మూరని భారతి గారు ఎందుకు పేరొక్కనవల్సి వచ్చింది ? ఎగ్మూరు - పరశువాకానికి పెద్ద దూర మేమీకాదు కాబట్టి అప్పటి మద్రాసు నగరాన్ని దృష్టిలో పెట్టుకున్నపుడు అదొక పెద్ద తేడాగా భావించుకో నక్కర్లేదని సర్ది చెప్పుకోవల్సిన అవసరంలేదు - ఎందు కంటే వీరేశలింగంగారే తన స్వీయచరిత్రలో ఎగ్మూరు, పరశువాకం అని రెండూ వేరువేరుగా పేరొక్కనివున్నారు. ఏమైనా ప్రత్యక్ష సాక్ష్యాలు కరువైనపుడు ఇట్లాంటి వూహాపోహలే మనకు శరణ్యం మరి. భవిష్యత్తులో జరిగే పరిశోధనల్లో ఈ విషయాలు తేటతెల్లం కావల్సివుంది.

వర్ణాంతర వివాహాలు—
వీరేశలింగంగారి దృక్పథం :

ఈ విషయమై పెద్దపరిశోధనే సాగవల్సి వుందేమో ననిపిస్తున్నది. చంద్రిక కథ నవలలో భారతిగారు వీరేశలింగంగార్ని ఈ పరంగా కాస్త సంప్రదాయవాది (puritan) గానే చిత్రించారు. నవలలో 29 పేజీనుండి 33 వరకు వీరేశలింగంగారి చేత (గోపాలయ్యంగార్ విశాలాక్షినిగాక పనిమనిషిని పెండ్లి చేసుకోబోయేముందు) చెప్పించిన సంభాషణలు ఈ ప్రశ్నకు తావు కల్గిస్తున్నాయి. తన నిజజీవితంలో అన్ని అభ్యుదయ ఆధునిక సంస్కరణ భావాలుకలిగి అన్ని విధవావివాహాలు, స్త్రీజనోద్ధరణాది కార్యక్రమాలను చేపట్టి మహా వుద్యమశీలిగా విరాణ్మూర్తిగా భాసించే వీరేశలింగంగారు వర్ణాంతర వివాహాలపట్ల ఏ యే భావాలు కలిగివుణ్ణారనేది మనకిక్కడ చర్చనీయాంశం.

ఆరేళ్ళక్రితం 'వీరేశలింగం-సంఘ సంస్కరణ' అనే విషయంపై అమెరికా విస్కాన్సన్ యూనివర్సిటీవారిక్రింద జాన్ లియొనార్డ్ అనే అమెరికన్ యువకుడు పిహెచ్. డి. చేస్తూ నెల్లూరు వర్ధమానసమాజం లైబ్రరీలోని కొన్ని పాత

పత్రికలు గ్రంథాలను పరిశీలించేందుకై వచ్చినపుడు నాకు పరిచయమైనారు. ఆయన సెల్లూరులో తన పరిశోధన ముగించుకుని వెళ్లేముందు అడిగాను. "ఇంతకూ వీరేశలింగంగారిపై మీరు పరిశోధించినంతమటుకూ ఏమంటారో చెప్పలేదు" - అని ప్రశ్నించగా ఒకమాటన్నట్లు జ్ఞాపకం. "ఆయన చేసిన విధవావివాహాలన్నీ ముఖ్యంగా కులాన్ని పాటించి చేసిన వివాహాలుగానే వున్నాయి. అంటే బ్రాహ్మలమ్మాయికి బ్రాహ్మలబ్బాయి, నాయుళ్ళబ్బాయికి నాయుళ్ళమ్మాయి, వైశ్యలమ్మాయికి వైశ్యులబ్బాయి - ఈ ధోరణి వివాహాలే చేసారుతప్ప, ఇంకొక్క అడుగు ముందుకెళ్ళి కులాంతర వర్ణాంతర వివాహాలుకూడా ఎందుకు జరిపించలేదా అనే విషయాన్ని మరికొంచెం లోతుగా తరచిచూడాల"-అని అనిపిస్తున్నదంటూ- 'ఇంతకూ ఈ విషయమై మీరేమంటారు?'-అని నన్ను ఎదురుప్రశ్న వేస్తారు.

అప్పుడు నేనన్నాను: "ఈ రోజుల్లో మనం ఈప్రశ్న వేయగలగొచ్చుగానీ ఆరోజుల్లో ఆయన అవి జరిపించడమే గొప్ప, తన వుద్యమాన్ని ఆమేరకు కేంద్రీకృతం చేసుకుని కృషిచేయడమే ఒక మహా విషయం. ప్రధానంగా వీరేశలింగంగారు ఒక Brahminical reformer అని మనం ఈనాడు అంచనాకట్టి ఆయన విస్తారమైన వుద్యమ పరిధిని సంకుచితపర్చి విలువకట్టడం వుచితంకాదు. బ్రాహ్మణులే సమాజంలో ఒక ప్రధానమైన, కీలకమైన వర్ణస్తులుగా వుండిన రోజులవి, జనంలో చదువుకున్నవారు, వుద్యోగాల్లో వున్నవారు 100 కి 5, 10 శాతంకంటే బహుశా ఎక్కువలేని రోజులవి. ఈ 5, 10 శాతం వారిలోకూడా ముప్పాతిక ముప్వీసం బ్రాహ్మణులుగానే వుంటూవచ్చిన రోజులు గాబట్టి ఆరోజుల్లో వీరేశలింగంగారు-అట్నుంచి నరుక్కురావాలని గిరీశం అన్నట్లు-తన వుద్యమాన్ని ఆమేరకు జయప్రదంగా నిర్వహించగలగడం ఉదాత్తమైన విషయంగదా"-అన్నాను.

అప్పుడేమో ఆమాట అన్నానుగానీ అది నాకే అంత సంతృప్తిగా అన్పించలేదు. మూడేళ్ళకు ఈ నవల నా ఎదానపడి, భారతిగారు వీరేశలింగారిచేత వుద్దేశ్యపూర్వకంగా నైతేనేమి, యాదృచ్ఛికంగా నైతేనేమి చెప్పించిన సంభాషణలు, ఆ రూపంగా వీరేశలింగంగార్ని ఒక బ్రాహ్మణసంస్కర్తగాను, ఒక సంప్రదాయకమైన 'స్నాబ్'గానూ చిత్రించినవిధం చూచి నాలో కొత్తఆలోచనలు రేకత్తాయి. వర్ణాంతరవివాహాలపట్ల వీరేశలింగంగారి అభిప్రాయాలేమైవుంటాయి- అనే విషయంపై కొన్ని సందేహాలు బుర్రలో జొరబడ్డం ప్రారంభించాయి. ఈ సందేహం కల్గడానికి ఇంకో బలవత్తరమైన కారణం లేకపోలేదు-వీరేశలింగం గారు నిజానికి ఒక చరిత్రాత్మకమైన వర్ణాంతర, రాష్ట్రాంతరవివాహాన్ని 1898లో

తను మద్రాసులోవుండగానే తన సొంత చేతులమీదుగా జరిపించినపుడు దాని విషయమై తన స్వీయచరిత్రలో పేర్కొనకపోవడం ఆ సందేహాన్ని మరింత బలపర్చింది.

వీరేశలింగంగారు జరిపించిన చరిత్రాత్మకమైన వర్ణాంతర వివాహం

1898లో సరోజినీదేవి చటోపాధ్యాయ-గోవిందరాజుల నాయుడుగారల వివాహం వీరేశలింగంగారి అధ్యక్షతన జరిగింది. అది దక్షిణభారతదేశంలో జరిగిన దాదాపు మొట్టమొదటి ముఖ్యమైన వర్ణాంతర-రాష్ట్రాంతర వివాహమని చెప్పవచ్చు. ఒక బెంగాలీ బ్రాహ్మణఅమ్మాయిని వొక తెలుగుబలిజ అబ్బాయి పెండ్లి చేసుకున్నసంఘటన అది.

ఈ వివాహాన్ని వీరేశలింగంగారు జరిపించడానికేమో జరిపించారుగానీ, ఆయన స్వీయచరిత్రలో దీన్ని ప్రత్యేకంగా పేర్కొనలేదు. దీన్నిగూర్చి తెలుగు వాళ్లుకూడా ఎవరూ ప్రముఖంగా ప్రస్తావించనూ లేదు. అటు వీరేశలింగం జీవిత చరిత్ర విమర్శకారులుగానీ, ఇటు సరోజినీదేవి జీవిత చరిత్రకారులుగానీ పేర్కొనలేదు. సరోజినీదేవి జీవితచరిత్రను నాకు తెల్సి ఇద్దరు తెలుగులో వ్రాసారు-ఒకరు గొల్లపాటి వెంకటసుబ్బయ్యగారు, ఇంకొకరు పుట్టపర్తి నారాయణాచార్యులుగారు. వీరిలో మొదటివారు సరోజినీదేవి పెండ్లిని వీరేశలింగంగారు జరిపించారని పూరకే వొక వాక్యం వ్రాసారుతప్ప ఇంకేమీ వివరాలు ఇవ్వలేదు. రెండవవారు వివాహం ఫలానాతేది జరిగిందన్నారేతప్ప ఫలానావారు జరిపించారనైనా చెప్పలేదు.

సరోజినీదేవి వివాహానికీ-వీరేశలింగంగారికీ సంబంధమేమిటి?-అని పరిశీలిస్తుంటే-పద్మినీ సేన్‌గుప్త ఆంగ్లంలో వ్రాసిన సరోజినీదేవి చరిత్రగ్రంథంలో యీ వివాహానికి సంబంధించి వొక బ్రిటిష్‌వనిత వ్రాసిన ఆంగ్లగ్రంథంలోనుండి పునరుద్ధరించిన భాగంలో కొన్నివివరాలు లభించాయి. ఆ భాగాన్ని దిగువ ఇస్తున్నాను.

"Sarojini Chattopadhyaya returned to India in September 1898, and married Dr. Govindarajulu Naidu in December the same year.

"Dr. Naidu was in every way an eligible husband for the young nightingale. He was the son of Military Doctor and he had been married at the age of eighteen to a very young girl and had lost her in less than a year.

He had then been sent to England for medical studies and had returned a successful Doctor. He soon proved to be invaluable in the service of the Nizam's Government and built himself a highly respectable name. His love for Sarojini was deep and sincere, and his regard for her had not changed at all during the three years of separation. No one could stop the marriage and it became a landmark in the progress of social reform when intercaste marragies were almost unknown. Eighteen years earlier, when Pandita Ramabai Saraswati, a Konkanasth Chitpawan Brahmin had married a Bengali Kayastha, a furore had been created. When Sarojini married, no such open opposition was voiced, except that the socio-traditional structure of Bengal and the South was slightly shaken. But Sarojini's marriage with Dr. Naidu laid the foundation for intercaste and interprovincial marriages.

"The question arose as to how the bride and bridegroom, of two different castes, could be united. Fortunately, Keshab Chandra Sen had introduced the Brahmo Marriages Bill which was passed through his own efforts on March 19, 1872 (Act III of 1872 which legalized Brahmo marriages). It allowed a civil marraige between two Indians regardless of caste. But both the parties, had to deny that they were Hindu, Mohammedan, Chiristian, Parsee, Buddhist, Sikh or Jain. It was under this Act that Dr. Govindarajulu Naidu, M. B. C. M. (EDIN), Medical officer to His Highness the Nizam's Imperial Service Troops, was married to Sarojini Chattopadhyaya, on December 2, 1898. The Act of 1872 had been introduced in Hyderabad as one of Aghorenath's efforts to bring about reform and break up caste prejudices. Little did he imagine, perhaps, that his own daughter would be among the first to be married under this form of civil registaration.

"An interesting account of the Wedding which took place actually in Madras, appeared in an Indian newspaper: 'Mrs. Ram Mohan Roy, a Brahmo lady of culture and refinement, acted as the bridesmaid and added grace and beauty to the solemnity of the occasion. The cere-

mony opened with a prayer by Mr. S. Somasundaram Pillai, B. A., and after the prescribed rituals had been gone through, Rao Bahadur Pandit Veeresalingam Pantulu Garu officiated as the Minister for the sacred occasion. After the Minister's charge to the happy couple regarding the responsibilities of life, Dr. Aghorenath gave away the bride and united the pair in holy wedlock in due form, the marriage being solemnized in the presence of Mr. F. D. Bird, the Registrar of marriages of Madras Town. Rao Bahadur Pandit Veerasalingam Pantulu Garu then pronounced the benediction. Before the several guests dispersed, some refreshments were served and partaken with great cheers amidst toasts and replies in perfect harmony without any distinction of caste. During the short time they spent in the Brahmo Mandir the couple received the congratulations of all friends present and drove off to the Capper House Hotel, where Dr. Govindarajulu Naidu had been staying.

"This interesting event must be regarded as unique in many respects, and as marking an epoch in the history of the reform movement in this country. The bridegroom belongs to the Balija community, whereas the bride is a Brahman by birth; the former is a Madrasi, where as the later is a Bengali; and both are England returned Hindus. Dr. Govindarajulu Naidu, M. B. C. M., completed his medical course in England, and his wife, a matriculate of the Madras University, spent a couple of years there to receive higher education.' (Quoted in 'wrongs of Indian Womanhood'—by Mrs. Marcus B. Fuller, Oliphart Anderson and Ferrier 1900, London and Edinburgh, pp. 219, 220)".

(SAROJINI NAIDU
A Biography : by Padmini Sengupta
Asia Publishing House, 1966)

ఇదంతా చదివినతర్వాత వొక సందేహం కలక్కపోదు. వధువు సరోజినీ దేవి తండ్రి అఘోరనాథచటోపాధ్యాయ నిజాం సంస్థానంలో పెద్ద విద్యావేత్త

గాను, వరుడు గోవిందరాజుల వాయుడుగారు అదే సంస్థానోద్యోగంలో పెద్ద డాక్టరుగానూ వుంటున్నారు. అంచే ఇద్దరూ అప్పటికే హైదరాబాదు వాసులై నపుడు వారి వివాహాన్ని హైదరాబాదులోగాకుండా మద్రాసులో వీరేశలింగంగారి అధ్వర్యంలో ఎందుకు జరిపించాల్సివచ్చింది? వీరేశలింగంగారి అనుకూలత కోసం గానా? వీరేశలింగంగారే ఎందుకు జరిపించాల్సి వచ్చింది?

అధికప్రసంగ మనుకోకపోతే అఘోరనాథచటోపాధ్యాయగార్ని గూర్చి వాలుగుమాటలు. రవీంద్రుని 'ఛుదితపాషాణ్' (హంగ్రీ స్టోన్స్) కథలో 'రైల్లో మనిషి' పాత్ర ఈ అఘోరనాథుడేనని బెంగాలీ సాహిత్య చరిత్రకారులు సాక్ష్యాలు బయటకు తీసారు. 1877 లోనే జగదీశచంద్రబోస్, ఆచార్య ప్రఫుల్లచంద్రరేల కన్నా ముందే సైన్సులో విదేశీ విశ్వవిద్యాలయంనుండి డాక్టరేట్ పట్టాపొందిన మొదటిభారతీయుడు, మేధావి అఘోరనాథ్. ఎడింబరోలో, జర్మనీలో విద్యగరిపి వచ్చిన వ్యక్తి. విదేశాలనుండి తిరిగి వచ్చినవెంటనే హైద్రాబాదులో కొక మ్యాకులు స్థాపించడం, తర్వాత ఇప్పటి నిజాంకాలేజి (అప్పటి హైదరాబాదు కాలేజి)కి ప్రిన్సిపాల్ కావడం జరిగింది. బహుభాషాకోవిదుడు, సంస్కృతీపరుడు. ఆయన సైన్సునువదిలి రాజకీయాల్లో అతివాదియై హైద్రాబాదుసంస్థానంలో కాంగ్రెస్ వుద్యమాన్ని ప్రవేశపెట్టిన మహనీయుడు. మద్రాసుతో అఘోరనాథ్‌కు సంబంధమేమిటంటే - అప్పటి ఆ హైదరాబాదు కాలేజి మద్రాసు విశ్వవిద్యా లయానికి అనుబంధింపబడి వుండడం.

అఘోరనాథ్ గారికి, తన కుమార్తె పెండ్లి జరిపించాల్సివచ్చినపుడు-ఈ 'వింత' పెండ్లి ఎవరి అధ్వర్యంలో జరిపించాలనే ఆలోచన వచ్చివుండాల. ఈ ఆలోచనల్లో రాజమండ్రి కాలేజి తెలుగుపండితుడుగావుంటూ దాదాపు 30 విధవావివాహాలు జరిపించి స్త్రీ జనోద్ధారకుడుగా ఎన్నో వుద్యమాలునడిపి పెద్ద సంచలనాన్ని సృష్టించి అంతకుముందు సంవత్సరమే రెండేళ్ల సెలవుమీద మద్రాసుకువచ్చి స్థిర పడివున్న వీరేశలింగంగారిపేరు స్ఫురించివుండాల. స్ఫురించడానికి మరొకరులేరా? లేక అంతకుముందే వీరేశలింగంగారికీ అఘోరనాథ్ గారికీ స్నేహితమేమైనా వుందా? (అఘోరనాథ్ గారిక్రింద కొంతకాలం రఘుపతి వెంకటరత్నం నాయుడు గారు శిష్యరికంచేసినట్లు ఎక్కడో చదివినగుర్తు.) ఏమో? ఏమైనా దక్షిణ భార తంలో ఆరోజుల్లో ఈ రంగంలో అంతటి గురుతరమైనస్థానాన్ని ఆక్రమించివున్న వుద్యమసాయకుడు వీరేశలింగంగారు తప్ప మరొకరు లేరనే చెప్పుకోవాల. ఈ వివాహం జరిగిన సంవత్సరంలోనే 'దక్షిణ భారత విద్యాసాగర్' అనే బిరు

దాన్ని రానడేగారిచేత పొందివున్న వ్యక్తికూడా గనుక వీరేశలింగంగారిపేర అఘూరనాథ్ గారి ఆలోచనకు రావడంలో ఆశ్చర్యం లేదుగదా? బహుశా వీరేశలింగంగారి అనుకూలతకోసంగానే ఈ వివాహాన్ని మద్రాసులో జరిపించాల్సి వచ్చిందేమో. లేక హైదరాబాదులోనే జరిగితే అక్కడ స్థానికంగా యీ అసంప్రదాయమైన వివాహాన్ని పురస్కరించుకుని ఎదురయ్యే ప్రత్యక్షవిమర్శలను తప్పించుకోడానికీ కావచ్చు. లేక మరెందుకైనా కావచ్చు.

ఇక్కడ మనం గమనించాల్సినఅంశం_బొత్తిగా పరిచయంలేని తమిళ మహాకవి సుబ్రహ్మణ్యభారతిగారు నవలద్వారా వొక పాత్రకు విధవావివాహం చేయించాల్సివచ్చినపుడు వీరేశలింగంగార్ని కథలో వాడుకోవాల్సి వచ్చింది. అట్లానే తనతో పెద్దగా పరిచయంలేని వొక బెంగాలీ విద్యావేత్త అఘూరనాథ్ తన కుమార్తెకు వర్ణాంతరవివాహం చేయించాల్సి వచ్చినపుడు ఆవివాహానికీ వీరేశలింగంగారే అధ్వర్యం వహించాల్సి వచ్చింది. అంటే పెద్దగా పరిచయం లేనివారిలో, బొత్తిగా ముఖపరిచయంలేని పరభాషల వారిలోసైతం వొక మహాసంస్థా సదృశమైన వుద్యమనిర్మాతలైన వీరేశలింగంగారి వ్యక్తిత్వవైభవం ఎంతగా ముద్ర వేసుకున్నదో ఈ రెండు సంఘటనలే చాలు వివరించడానికి. మరో వర్ణాంతరవివాహం కూడా వీరేశలింగంగారి అధ్వర్యాన్నే జరిగింది. నేటి కేంద్రమంత్రి మోహన్ కుమారమంగళంగారి తండ్రి కీర్తిశేషులు పి. ఎస్. సుబ్బరాయన్ కూ రాధాబాయి గారికీ జరిగినవివాహాన్నికూడా మన వీరేశలింగంగారే జరిపించారు. దీన్ని గూర్చిన ఇతరవిషయాలు ఇది వ్రాసేసమయానికి అందినవికావు. భవిష్యత్తులో జరగబోయే పరిశోధనలమీద ఆశ పెట్టుకొందాం.

కలకత్తాలో రమాబాయి వివాహంతర్వాత అంతటి చారిత్రక ప్రధానమైన వివాహాన్ని దక్షిణభారతంలో తన సొంత చేతులమీదుగా జరిపించినపుడు వీరేశలింగంగారు దాన్నిగూర్చి తన స్వీయచరిత్రలో ఎందుకు వ్రాసుకోలేదు? ఆ సంఘటననుగూర్చి ఎందుకు వివరించదల్చుకోలేదు? మర్చిపోయినందువల్ల వ్రాయలేదా? ఆమాత్రం చారిత్రక స్పృహలేనివారా వీరేశలింగంగారు? ఆ వివాహాసన్నివేశాన్ని పేర్కొని ఆరకం పెండ్లిండ్లపట్ల అప్పట్లో తనకున్న అభిప్రాయాలను నిష్కర్షగా చర్చించే మానసికస్థైర్యం తనలో లేనందువల్ల దాటవేసారా? ఆ వివాహంతో మనస్ఫూర్తిగా identify గాకుండానే దాన్ని mechanicalగా జరిపించారా? ఆ సంధియుగంలో వీరేశలింగంగారి మానసికస్థితినిగూర్చి అప్పటి ఆయన

mental attitudeను గూర్చి మరింత గాఢంగా గూఢంగా నిర్దుష్టంగా అంచనా కట్టవల్సి వుంది.

కానీ ఈ వివాహాన్ని గూర్చి వీరేశలింగంగారు తన స్వీయచరిత్రలో బొత్తిగా ప్రస్తావించకపోలేదు. ఆ పెండ్లి జరిగిన 10 సంవత్సరాల అనంతరం 1909 లో హిత కారిణీ సమాజానికి విరాళాలు పోగుచేసేందుకై వీరేశలింగంగారు బొంబాయి ప్రాంతాలకు యాత్రవెళ్ళినపుడు ఆ సన్నివేశాలనుగూర్చి వ్రాస్తూ ఆ వేరేవిషయాల మధ్య ఏదో యథాలాపంగా ఈ పెళ్ళినిగూర్చి ఈ క్రిందివిధంగా వ్రాస్తున్నారు :

> "...మేము మఱునాడు సికిందరాబాదు చేరి నాటికక్కడ నిలిచి పోయితిమి. అక్కడ డాక్టరు జీ. నాయడుగారు నన్నుచూచి నేను పోవుచున్నపనిని దెలిసికొని మొదటిచందాను పదునేనురూపాయల నాచేతి కిచ్చిరి. నేను వారియింటికి బోయినప్పుడు కవయిత్రియైన సరోజినీ నాయడస్వస్థులయి మంచముమీద బరుండియుండి బిడ్డలను దనవద్దకు బిలిచి మీ తాతగారు వచ్చినారు చూడుడని నన్ను చూపెను. వారి వివాహమును చెన్నపట్టణములో నేను చేసియుండుట చేత నామె నన్నట్లు పిలిచినది. సరోజినీదేవిగారితండ్రి తమకొమారిత వివాహమును మాయింటనే చేయవలసినదని నన్ను కోరిగాని నేనట్లుచేయక సమాజమందిరములో జరిపితిని." (స్వీయచరిత్రము-రెండవభాగము, మూడవప్రకరణము.)

చారిత్రకంగా అంతటి ప్రముఖమైన వివాహాన్నిగూర్చి ఈ నాలుగుమాటలేనా వ్రాయాల్సింది? ఇంతకంటే సాదా అయిన 'మామూలు' విధవావివాహాలనుగూర్చి ఎంతో విపులంగా వ్రాసిన ('నాయడుశాఖలో ఇది మొదటివివాహం' అని అనేక విధాలుగా ప్రత్యేకంగా వివరంగా ఇతరవాటినిగూర్చి పేర్కొన్న) వీరేశలింగంగారు దీన్నిగూర్చి ఇంతేనా వ్రాయాల్సింది? ఆవివాహాలంటే తానే అన్నీ నిర్ణయించుకుని అన్ని ఏర్పాట్లుచేసుకుని స్వయంగా జరిపించినవి గావడం, ఇవంటే కేవలం అన్నీ ఇతర్లు నిర్ణయించుకుని తాను వూరకే పెద్దగా వివాహమప్పుడు లాంఛనంగా అధ్వర్యం వహించాల్సిరావడంవల్ల — వీరేశలింగంగారు ఇంతకంటే ఎక్కువ వ్రాయలేదనుకోవాల్నా? అంతేగాక, పైన పేర్కొన్నదాంట్లో ఆఖరు వాక్యం ఏదో సంజాయిషీ చెప్పుకున్నధోరణిలో మళ్ళీ అనుమానాస్పదంగా ధ్వనిస్తున్నది. వీరేశలింగంగారి సొంత ఇంట్లో తనకూతురుపెండ్లి చేయమని సరోజినీదేవితండ్రి ఎందుకు కోరారు? అట్లా కోరడంలో ఆయన వుద్దేశ్యం? ఆయన

కోరినట్లుగా వీరేశలింగంగారు తన సొంతఇంట్లో జరిపించకుండా సమాజమందిరంలో ఎందుకు జరిపించారు? అట్లా జరిపించడంలో వారి వుద్దేశ్యం? సొంతఇంట్లో చేయించే ధైర్యం లేకనా? లేక సమాజమందిరంలో జరిపిస్తే వొక 'social sanction' ఏర్పరచినట్లవుతుందనా? అయినా ఆ వాక్యాన్ని ఈ సందర్భంలో ఎందుకు చెప్పుకోవల్సి వచ్చింది? అఘోరనాథ్ అంతటివారు తనను పిల్చి తన కూతురు పెండ్లి జరిపించమని కోరినపుడు కాదనలేక తన నాయకత్వానికి ఎక్కడ బీటలు పడ్తాయోనని జంకి వొప్పుకోవల్సి వచ్చిందా? ఆనాటికి వర్ణాంతరవివాహం విషయమై వీరేశలింగంగారు ఇంకా పూర్తిగా reconcile కాలేదా? మరి ఇతర కారణా లేమైనా వున్నాయా?

వీరేశలింగంగారు తన కవులచరిత్రలో వేమనగూర్చి కవిగా మాట సామె తగానైనా ప్రస్తావించకపోవడాన్ని పేరొక్కంటూ నార్లగారు తన 'వేమన' ఆంగ్ల గ్రంథంలో ఇట్లంటున్నారు:

> "But why did Veeresalingam, himself a social and religious reformer, join the vicious crowd? His Cromwellian Puritanism might have violently repelled by the lewdness and obscenity of some of the verses foisted on Vemana, partly by his rustic devotees and mostly by his devilishly clever detractors and denegators..."

ఆ 'క్రామ్‌వెలియన్ ప్యూరిటనిజమ్'ను ఈ సందర్భంలోకూడా వీరేశలింగం గారికి వర్తింపజేసి అంచనా కట్టడం తొందరపాటవుతుందేమో.

తన మరణానికి 13 ఏళ్ల ముందు 1906 లో తనకులాన్ని తెలియజేసే బాహిరి చిహ్నమైన జంధ్యాన్నికూడా విసర్జించిపారేసి వర్ణభేదాన్ని త్యజించి సార్వజన పౌభ్రాత్వాన్ని వహించిన వీరేశలింగంగారివిషయంలో ఈరకమైన అనుమానాలు పెట్టుకోవడం భావ్యం కాదేమో. అంత మహావ్యక్తులైన రాజారామమోహనరాయ్, దేవేంద్రనాథ ఠాగూర్ గారలుకూడా ఈపని చేయలేకపోయారన్నపుడు, క్రిస్చి యన్ మిషనరీ లిచ్చిన టీపార్టీకివెళ్ళి విందారగించినందుకు రానెడేగారు ప్రాయ శ్చిత్తం చేసుకోవల్సి వచ్చిందన్నపుడు—విరూపాక్షపీఠం శంకరాచార్యులవారు వెలివేసినాకూడా జంకుగొంకుల్లేకుండా ధైర్యవిలసితంగా ఎదురొక్కన్న వీరేశలింగం గారిపట్ల ఈరకమైన సందేహాన్ని వ్యక్తంచేయడం వుచితం కాదేమో. ఆ రోజుల నాటికి బాలవిధవల దుస్థితి సంఘంలో వికృతరూపందాల్చి వొక ఘోరమైన ఇను

స్యగా తాండవిస్తున్నందువల్ల వారి పునరుద్ధరణకే కంకణం కట్టుకుని తన శక్తినంతా అందుకే కేంద్రీకృతం చేయాల్సివచ్చిందనీ; వర్ణాంతరవివాహాలనేవి ఆప్పటికి కేవలం intellectual పరిధిలో వైవర్ణాలవారికిమాత్రమే పరిమితమై వుండడంవల్ల వీరేశలింగంగారు ఆరకం అవగాహనకు లోనయ్యారా? తన స్వీయచరిత్రలో వర్ణ వ్యవస్థనుగూర్చిన విమర్శలు, వ్యాఖ్యలు, తన కేర్పడివున్న అవగాహనలు-వీ టన్ని టినీ సమన్వయించుకుని ఈ కోణనుండి పరిశీలించి అంచనా కట్టవల్సివుంది.

ఆయన డైరీలు, లేఖలు మనకు పూర్తిగా దొరక్కపోబట్టి ఆయన సమగ్రమైన జీవితచరిత్ర మనకు ఇంకా లభించకపోబట్టి ఈ సందేహాలకు స్పష్టమైన సమాధానాలు లభించడంలేదు. బహుశా భవిష్యత్పరిశోధనల్లో వీటిన్ని తేల్చి చెప్పగలగడం సాధ్యమవుతుందనే ఆశిద్దాం. రాజమండ్రిలోవున్న వీరేశలింగంగారి మ్యూజియంలోకి పోయినవి పోగా చేరివున్న కొన్ని లేఖలు వగైరా పత్రాలనుండి కొంత సమాచారాన్ని చూచి ఈ సందేహానివృత్తి చేసుకున్నతర్వాతనే వ్రాయడం మంచిదనుకున్నానుగానీ ఇప్పటికే ఈ గ్రంథముద్రణకు అప్పులపాలైవున్న నేను వెంటనే రాజమండ్రి వెళ్ళిరావడానికి స్తోమతలేకనే ఇప్పట్లో మానుకోవల్సివచ్చింది.

ఈ విషయమై వీరేశలింగంగారిపై పరిశోధనచేసి డాక్టరేట్ పట్టా పొందివున్న అమెరికన్ యువకుడు లియొనార్డ్ గారికి జాబు వ్రాసినపుడు ఆయన వ్రాసిన ప్రత్యుత్తరంలోనుండి కొన్ని భాగాలను పేరొక్కనలేకుండా వుండలేకపోతున్నాను:

"Your letter. Sri V. R. Narla also came by yesterday and mentioned your work. He brought up this question of inter-caste marriages' We recalled that Veeresalingam had, indeed, performed inter-caste marriages, but usually between different subsects, like the Niyogi and Vaidiki. Around 1897-1900 in Madras inter-caste marriages were promoted by social reformers there like K. Natarajan and B. Varada Rao. They initiated these because at that time Veeresalingam wanted to begin widow marriages in Madras, and they did not want to have their Madras Social Reform Association sponsor them. So, they began to promote inter-caste marraiges, but only among different subsects. They did not promote real inter-caste marraiges like the one of Sarojini Naidu. My own belief is that Veeresalingam did not emphasize that particular

match because his diaries for that period are missing. I found that he was very hazy about dates in his autobiography unless he actually had before him something written at a particular time and bearing a date.

"To some extent Bharati was correct in thinking that Veeresalingam was a Brahmanical reformer. But this has more to do with the times than with his own inclinations. After all, widow marraiges were carried out by Western-educated people, and Brahmans had 71% of the B. A.'s then. Also, the belief that social change occured through imitating examples of higher status people, that the elite in society first innovated and their changes then filtered down to the masses, was very powerful. At the end of the 19th century non-Brahman leaders were interested in jobs, not social reform.

"But Veeresalingam actually did change once he returned to Rajahmundry in 1904 and came under the influence of D. Pedabapayya. He shucked his sacred thread, promoted inter dining by inviting individuals of different religions, and also performed widow marriages for Telagas and Kammas. I discovered this by looking at his correspondence for the period 1910-1919 in the new Veeresalingam museum at Rajahmundry. So, even though his ideas of change through an elite, whether Brahman or Western educated, probably remained the same, he was forced to adopt to new patterns in order to retain his leadership of social reform in the early twentieth century. Actually, this is the main theme of my thesis.

"Veeresalingam was often criticized because he neglected the welfare of the married couples. True enough. He was concerned with the performance of the marriage ceremonies because they represented symbolic acts of defiance against orthodoxy and re-affirmed his reputation as the principal leader of reform. This was a constant pre-occupation of his-the need of recognition for his work and his leadership. Much of his manueuvering consisted of trying to provide for a successor to himself, one who would carry on the work. (Basavaraju Gavar-

razu, Mritanjaya Rao in 1893, and D. Pedabapayya in 1906; ultimately, he came to rely on Raghupati Venkataratnam Naidu):

"I found that he seemed to be a very self-contained person who often disregarded the adivce of friends. This is evident from the autobiography. But what he omits to say is how much his friends changed from decade to decade. For instance, his trustees for the Town Hall are completely different from his selections for trustees of the Hithakarini Samaj. He doesn't seem to have been very much attached to people if they happened to cross him. In Gogulapati's case, his love and expectations for the boy were equally great, but the latter won out when the boy refused to do what Veeresalingam demanded. A very prickly sort of person, and a very ambitious one....."

లియొనార్డ్ భావాలు కొన్నిటితో మనం ఏకీభవించలేకపోయినా, ఈ లేఖాంశాలనుబట్టిచూస్తే వీరేశలింగంగార్నిగూర్చి ఎంత లోతుకువెళ్ళి నిశితంగా వొక విదేశీకోణంనుండి పరిశీలించి పరిశోధించారో తెలుగుపాఠకులకు తెలివిడిచేద్దామనే వుద్దేశ్యంతోనే ఈ వ్యాఖ్యాలను వుదహరించాను. లియొనార్డ్ పరిశోధనాగ్రంథం త్వరలో ప్రచురణవుతుందనే ఆశిద్దాం.

వీరేశలింగం-భారతి :
కొన్ని సామ్యాలు

ఈ సందర్భంలో ఈ చంద్రికకథ నవలాకర్త అయిన సుబ్రహ్మణ్యభారతి కూడా జంధ్యాన్ని తీసిపారేసి వర్ణభేదాన్ని పాటించనివ్యక్తేనని గమనించాల్సి వుంది. భారతి వూరకే జంధ్యాన్ని తీసిపారేయడమేకాదు-పాండుచ్చేరిలోవుండగా నాగరత్నం అనే హరిజనబ్బాయికి గాయత్రీమంత్రం వుపదేశించి జంధ్యం గింధ్యం తగిల్చి ఆ జంధ్యంయొక్క పవిత్రతను ఛిన్నాభిన్నం చేస్తాడు. ఈ సంఘటన తర్వాతనే భారతిగారు తన జంధ్యాన్ని తీసిపారేసినట్లు కె. ఎస్. రామస్వామి శాస్త్రిగారు Subrahmanyam Bharati : His mind and art (1951) అనే గ్రంథంలో పేర్కొన్నారు. భారతిగారిసోదరులు శ్రీ సి. విశ్వనాథన్ వ్రాసిన Bharati and his works (1929) అనే గ్రంథంలోకూడా భారతి ఇట్లా పేర్కొన్నట్లుగా చెప్తారు : "Well, brother, if I wear this thread, you

brand me as Brahmin for ever; But I am as much a Christain, a Mussalman or a jew as I am a Brahmin. Humanity is my community and love is my creed." అని భారతిగారు అన్నారట. అంతే కాదు, కేవలం అనడమేగాకుండా - ఇతర మతస్తులతో, కులస్తులతో కలిమిడిగాకల్సి భోంచేస్తూ తిరుగుతూ వర్ణభేదాల్ను దగ్గరికి రానియ్యకుండా వుండినందువల్ల భారతి గారు ఎన్నో సమకాలిక విమర్శలకు గురికావల్సి వచ్చారని ప్రేమానందకుమార్ కూడా పేర్కొన్నారు. కులవ్యవస్థతో కలుషితమైపోయిన భారతీయసమాజం బాగుపడి వొకవిధమైన సర్వజనసౌదర్యం ఏర్పడాలంటే వర్ణాంతరవివాహాలు విరివిగా జరగాలని భారతి పలువ్యాసాల్లో వెలిబుచ్చినట్లుకూడా చెప్తారు. తమిళ వ్యాసాల్లో ఏమి ప్రాసారో ఏమెగా కానీ సి. ఆర్. రెడ్డి, కె. ఎస్. వెంకటరమణి గారలు సంకలనంచేసిన భారతి ఆంగ్లరచనల్లో The crime of caste, Love and marriage అని రెండు వుదాత్తమైన వ్యాసాల్లోనుండి మచ్చుకకొన్నివాక్యాలు వుదహరిస్తున్నాను :

".....The sole remedy is in inter-dining and inter-marrying. The others are mere quack remedies of an anaesthetic character.....Sometimes people who seem half inclined to admit the injustice and inutility of caste suddenly turn round and shout : "But they have similar prejudices in south Africa, north America and oceania... If other people are fools that is no reason why we should be such....."

(The crime of caste.)

"My youthful brothers and sisters of the Motherland, my appeal is to you : Defer marriage as long as possible, even after reaching adolscence. And when you feel sure that you have found out your soul's true companion, love, claim and win—and praise the Gods ! If any self constituted guardians of effete forms and conventions stand in your way ask them to mind their own business-away !

".....We live because we love ; not because we make compromises. Love is life. Custom is nothing."

(Love and marriage.)

ఈ వొకటిరెండు వ్యాసాలనుండి భారతి నవ్యదృక్పథాన్ని కొంతైనా ఆర్థం చేసుకోవచ్చు.

సాహిత్యపరంగాకూడా వీరిద్దరిమధ్యా కొన్నిసామ్యాలున్నాయి. వీరేశలింగంగారు కవులచరిత్రను వ్రాసినట్లే, భారతిగారు కాంగ్రెసుచరిత్రను 50 అధ్యాయాల్లో వ్రాసారు. ఇద్దరూ సరళమైన వ్యవహారిక భాషనే అనుసరించారు. తెలుగులో వీరేశలింగంగారు సైన్సువిషయాలనుగూర్చి గ్రంథాలు వ్రాసినట్లే భారతికూడా 'మొక్కల్లో జీవం' గూర్చి జె. సి. బోస్ సిద్ధాంతాలనుగూర్చి తమిళంలో వ్రాసారు. వీరేశలింగంగారు 'వివేకవర్ధని'వంటి వైర్‌బ్రాండ్ పత్రికనునడిపి ఆ పత్రిక వ్రాతలమూలంగా కోర్టుకు లాగబడినట్లే, భారతికూడా తమిళంలో 'ఇండియా' అనే వైర్‌బ్రాండ్ పత్రికను నడిపారు, ఇందుమూలంగా ప్రభుత్వ నిషేధాలకు భారతి గురికావల్సి వచ్చిందికూడా—తమిళంలో మొదటిసారిగా కార్టూన్‌లు ప్రవేశపెట్టింది ఈ పత్రికద్వారా భారతిగారేనని అంటారు. కవిత్వం సాహిత్యంతోబాటు భారతి రాజకీయాల్లో, అతివాదరాజకీయాల్లో తలమున్కలైనాడు. వీరేశలింగంగారు సారస్వతమూర్తి, రాజకీయాలకు దూరంగా వుండినా సంఘసంస్కరణరంగంలో తలమున్కలై గురుతరమైనస్థానాన్ని ఆక్రమించారు.

జి. సుబ్రహ్మణ్యయ్యర్

వీరేశలింగంగారితోబాటు ఈనవలలో జి. సుబ్రహ్మణ్యయ్యర్ గారుకూడా మరొకపాత్రగా ప్రవేశపెట్టబడినారు. వీరినిగూర్చి రమణారెడ్డిగారు కొంత చెప్పి వున్నారు, మరికొంతకూడా సంక్షిప్తంగా తెల్సుకోవల్సి వుంది. 1878 సెప్టెంబరు 20 తేదిన వారపత్రికగా తర్వాత కొంతకాలం పైచి వారపత్రికగా, ఆతర్వాత 1889 నుండి దినపత్రికగా ఆవిర్భవించి నేటివరకు దాక్షిణాత్యుల అత్యంత ఆదరాన్ని పొందుతూవస్తున్న ఇంగ్లీషు 'హిందూ' పత్రిక సంస్థాపకుల్లో వొకరుగా దాని తొలి సంపాదకుడుగా రెండు దశాబ్దాలపాటు పనిచేసి ప్రఖ్యాతిబడసిన వ్యక్తి. జననం 1855, మరణం 1916. 1882 లో 'హిందూ' పనిచూస్తూనే తమిళంలో 'స్వదేశమిత్రన్' పత్రికను ప్రారంభించి, 1889 లో దాన్ని దినపత్రికగాకూడా రూపొందించిన ప్రఖ్యాత పురుషుడు. 1898 లో 'హిందూ'తో సంబంధాన్ని వదులుకోవల్సి వచ్చింది. పత్రికా సంపాదకుడుగావుండి 'సంఘ సంస్కార' భావాలకు వేదిక కల్పించిన ఆధునికుడు. ఫైనాన్స్, ఎకనమిక్స్, వ్యవసాయార్థిక విషయాలపై సర్వంకషమైన పరిజ్ఞానమున్న పత్రికారచయితగా కీర్తిబడసిన వ్యక్తి. 1885 లో అఖిలభారత కాంగ్రెస్ ఆవిర్భవించినపుడు సుబ్రహ్మణ్యయ్యర్ గారు దాని సంస్థాపకసభ్యుల్లో వొకరు. బొంబాయిలో జరిగిన దాని మొట్టమొదటి సమావేశంలో మొట్టమొదటి తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఆద్యుడు అయ్యర్ గారు. ఇంగ్లీ

ళులో Some economic aspects of British rule in India (1903) అనే పుస్తకంకూడా వ్రాసారు. 1897 లో లండన్ వెళ్ళివచ్చారుకూడా. తన స్వదేశ మిత్రిన్ పత్రికలో భారతిగార్ని మొదట నియామకం చేసుకుని జర్నలిస్టుగా తీర్చి దిద్దింది సుబ్రహ్మణ్యయ్యర్ గారే.

కల్పనా సాహిత్య ప్రక్రియల్లో పాత్రగా వీరేశలింగం

కథావాఙ్మయంలో కందుకూరివారికి స్థానం కల్పించిన కథకులలో, తెలుగు తమిళభాషలలో సుబ్రహ్మణ్యభారతియే ఆద్యుడనడం సాహసం కాదనుకుంటాను— అన్నారు డా॥ చల్లా రాధాకృష్ణశర్మగారు తన పరిచయవ్యాసంలో.

అరవకవి సుబ్రహ్మణ్యభారతి తన ఈ అసంపూర్ణరచనలో వీరేశలింగంగారిని పిలచి పెద్దపీట వెయ్యకముందే, తెలుగుకవి గురజాడ అప్పారావు అంతపనీచేసి కూర్చున్నాడు. 'కన్యాశుల్కం' నాటకం తొలికూర్పుపాఠాన్ని ఒళ్లు దగ్గర బెట్టుకునిచూస్తే, ఆ నాటకకథకు నాయకస్థానంలో ఉండిన సంస్థాకల్పుడైనవ్యక్తి వీరేశలింగమేనని బోధపడుతుంది. 'వీరయ్యపంతులు' అనే నాటకపాత్రకు ఆ రచనలోవున్న కీలకస్థానాన్ని తెలుగు సాహిత్యవిమర్శకులు సరిగా గుర్తించేందుకు మరికొన్నేళ్లయినా అవసరమయ్యేట్లుంది. అయినా అది ఇంకా వివాదంలోపడి నలుగుతూంది కాబట్టి ప్రస్తుతానికి దాన్ని విడిచేద్దాం—అన్నారు కె. వి. రమణారెడ్డిగారు తన పీఠికలో. నేనూ దీనికి 'డిటో' అంటున్నాను.

మొట్టమొదటి కన్యాశుల్కనాటకంలో నేరుగా 'వీరేశలింగం పంతులుగారు' అని వొక సంభాషణలో ప్రయోగింపబడి వున్నదికూడా. ప్రథమాంకం 2 స్థలంలో గిరీశం—"వీరేశలింగం పంతులుగారు కన్యాశుల్కము విషయమై వ్రాసిన పాంప్లెంట్ ట్రంకులోనుంచి తియ్యి మామగారికి లెక్చరు ఇవ్వడానికి కత్తి ఖటారూన్నారాలి"—అనే సంభాషణక్రింద నా 'స్కాలర్స్ ఎడిషన్' (1969) లో ఫుట్‌నోట్సు వ్రాస్తూ—"మొత్తం 'కన్యాశుల్కం' నాటకంలో వీరేశలింగంపేరు పూర్తిగా పేర్కొనబడింది యీ వొక్కచోటనే. ముందుముందు అనేకచోట్ల వీరయపంతులనీ, రాజమండ్రి ఆనీ, విడో మేరేజి హోము అనీ ప్రస్తావనలు కనపడ్తాయి. వీరేశలింగంగారు లేవనెత్తిన సంఘసంస్కరణ బావుటాకు వొక సమగ్రసుందరమైన కళారూపమైన జోహారే కన్యాశుల్కమని తోస్తుంది. బహుశా ఇందువల్లనేమో-నన్నడిగితే కన్యాశుల్క నాటక నాయకుడు కందుకూరి

వీరేశలింగం పంతులంటాను-అంటూరు రమణారెడ్డిగారు(చూ. వారి గురజాడ వెలుగుజాడ)''-అని వ్రాసాను.

దీన్ని పట్టుకొని శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు-'ఈ మాటలు దాదాపు ప్రతి ఒక్కరినీ దిగ్భ్రమలో ముంచజాలి వున్నాయి...ఇలా అనడానికి ఏమాత్రమూ ఆధారం కనపడదు...' అంటూ__ఆయన యోధుడు, కార్యవాది, ఈయన కళాకారుడు, శిల్పి (ఎవరు కాదన్నారు?-బంగోరె.)-అని చెప్తూ చాలా సుదీర్ఘమైన చర్చ చేసారు. కడకు 'అటువంటి అప్పారావు రచించిన నాటకానికి వీరేశలింగం గారు నాయకుడనడం, మృదువుగా చెప్పాలంటే, హాస్యాస్పదం.' అని నిష్కర్షగా తేల్చిపారేశారు కుటుంబరావుగారు. ('సృజన' పత్రికలోపడిన సమీక్షా వ్యాసం.)

ఒక్కసారి కుటుంబరావుగార్ని ఆ నా ఫుట్‌నోట్సులోని వాక్యాల నిజార్థాలకు పెడార్థాలు తీయకుండా పునరాలోచించమని సవినయంగా కోరుకుంటూ వొకమాటంటున్నాను: వీరేశలింగంగారు లేకపోతే అప్పారావుగారి కన్యాశుల్కమే లేదు. ఆయన నడిపిన సంఘసంస్కరణ వుద్యమాలన్నిటికీ-సవిమర్శకమైన కళారూపమైన దర్పణం కన్యాశుల్కం. ఆ నాటకంలో రెండు ఎడిషన్లలోనూ, నేరుగానూ పరోక్షంగానూ వీరేశలింగంగారి ప్రస్తావనలున్నాయి. వైకి గిరీశమో, రామప్పంతులో, సౌజన్యారావుగారో నాయకుడనిపించేటట్లున్నా ఇంకోవిధంగా పరోక్షనాయకుడు వీరేశలింగమే ననిపిస్తుంది. కుటుంబరావుగారు తన సమీక్షావ్యాసంలో లేవదీసినట్లుగా-వారిద్దరి కార్యక్షేత్రాలు వేరైనపుడు వీరేశలింగంగారు గొప్పా, గురజాడవారు గొప్పా అనేప్రశ్న వుత్పన్నం కానవసరమే లేదు. వీరేశలింగంగారు నడిపిన బహుముఖమైన సంస్కరణోద్యమాల భూమికయే కన్యాశుల్కానికి వొకవిధంగా సంకీర్ణ కథావస్తువై అప్పారావుగారి కళాచక్షుల్లోకి పరివర్తనపొంది ఆ వుద్యమపరిధులను రసాత్మకంగా సాహిత్యపరంగా చర్చించడం జరిగిందనుకోవడంలో విడ్డూరం ఏమీ కనపడదు.

నవలనుగూర్చి నాలుగు మాటలు

ఈ నవలను ఎన్ని కోణాలనుండైనా పరిశీలించవచ్చు. కె. ఎస్. రామస్వామి శాస్త్రిగారు తన గ్రంథంలో ఈ నవలనుగూర్చి ఇట్లా వేరొక్కన్నారు:

"*Chandrikain Kathai* is a full-dress novel but is incomplete. Though it is longish, it is amorphous and unim-

pressive. The story is supposed to be that of a child named Chandrika but what we have of it is that of its aunt Visalakshi, a young widow who is eager for remarriage but fails to secure a mate and whom a married man tries to secure but fails. Social reform is much to the foré in the work but the story moves along slowly and haltingly. Bharati has introduced into it one of charming lyrics-that on *Nanda Lala*."

["Subrahmanya Bharati :
His mind and art" (1951)]

రామస్వామిశాస్త్రిగారికి ఈ నవలలో పేరొక్కనతగింది ముఖ్యంగా 'నంద లాలా' పాటగానే కనపడ్డది. భారతిగారిపాటల్లో దానికి వొక ప్రత్యేకమైన స్థాన మున్నట్లు చాలామంది పేరొక్కనివున్నారు. తెలుగువాళ్లమైన మనకు అందులోని తియ్యదనం అంత సులభంగా బోధపడకపోవచ్చు. అందువల్లనే నేను నవలా భాగంలో క్రింద ఫుట్‌నోట్సుగా పూతలపట్టు శ్రీరాములురెడ్డిగారి తెలుగు అనువాదంకూడా ఇచ్చాను. తెలుగు అనువాదంలో ఆ పాట తియ్యదనం చచ్చిందనే అనుకోవాలి! ఏమైనా రామస్వామిశాస్త్రిగారిదృష్టి ఆవైపుకే సాగింది.

ఇక శ్రీమతి ప్రేమానందకుమార్ ఈ నవలను మరి కాస్త వుదారమైన దృష్టి నుండి పరిశీలించింది, ఆమె వాక్యాలను కొన్నిటిని పరిశీలిద్దాం:

Chandrikai's Story, his second attempt at writing a novel was also left incomplete at his death. The first nine chapters only remain, but these are enough to illustrate the raciness of Bharati's narrative art. The novel begins in 1901 with an earth quake in a Village. A young widow, Visalakshi, survives along with her niece, a new-born babe, Chandrikai ...Three years later, tired of the ceaseless struggle to survive with honour in the Hindu society... Two social reformers help her, and she marries an ex-sanyasin...suddenly he becomes mad, and there the story breaks off ..

But, then, this is merely the prologue. As Bharati's title indicates, the central character is to be Chandrikai, who is still a child. It is possible that, in chandrikai, Bharati wanted to depict his idea of the modern girl that India needs—educated, bold, strong, fearless, and yet

womanly. No doubt he wanted to describe in terms of fiction his ideas on women's emancipation and independence. But speculations apart, *Chandrikai's Story* has many points of interest. There is, for example, the introduction of real-life characters (like the social reformers G. Subramanya Iyer and Veeresalingam Pantulu) in a fictional narrative-something not attempted before in Tamil fiction. There is, then, Bharati posing the question: family life or asceticism? Bharati did not like the 'refusal of ascetic' at all...

We have the character of Nityananda (Viswanatha Sarma), a young sanyasi. Bharati seizes this chance to debunk the wrong notion of renunciation that has long prevailed in India...when he marries Visalakshi ..(and) becomes insane some years later, Bharati hints at a Freudian cause—the result of years of suppressing Nature, followed by the sudden joys of a husband and a father.

Bharati had evidently lost his heart to Chandrikai. Her childhood is presented with poetic feeling and colourful imagery ...A song that Chandrikai sings at Pantulu's house (Nanda Lala) also deserves mention here. It is a lyric on Krishna, one of the best that Bharati wrote.....

Like unheard melodies, the little we see of the child
Chandrikai fills with visions of the future."

—[Subrahmanya Bharati
by Premanandakumar,
(Rao & Raghavan, Mysore, 1964]

ప్రేమానందకుమార్ గారు కొంత ఉదారంగానే ఈ నవలనుగూర్చి చర్చించారు, సమగ్రంగాకూడా. ఇక ఆమె నార్ల గారి 'వివేశలింగం' ఆంగ్లగ్రంథంపై మొదటనే పేర్కొన్న 'స్వరాజ్య' పత్రిక సమీక్షావ్యాసంలో ఆమె ఈ నవలనుగూర్చి వ్రాసిన వాక్యాలనుకూడా దిగువ ఇస్తున్నాను:

"In his unfinished novel *Chandrikayin Kathai*, Subrahmanya Bharati introduces Veeresalingam Panthulu and his wife as two benevolent characters with an important mission. There are charming passages which bring out the domestic felicity of this aged couple and the warm

hearts they posseessed towards the weak and the dountradden in Hindu society. That was no mere fictionalised tribute given to Veeresalingam by the great poet of Tamilnadu. Here was a living truth. For in real life, Veeresalingam was a tremendous personality and the Father of the Modern Andhra Renaissance ..

" ...In his (Veeresalingam's) social reform activities he was ably assisted by his wife, Rajyalakshmi. The domestic life of Veeresalingam and Rajyalakshmi has been brilliantly portrayed by Bharati in the pages (of this novel). The silent heroism of Rajyalakshmi deserves a book by itself."

(" Swarajya ", Nov. 2, 1968)

పైదాంట్లో ఆఖరువాక్యంలో, రాజ్యలక్ష్మమ్మనుగూర్చిన చెప్పినవాక్యంలో, ప్రేమానందకుమార్ గారు తెలుగుమహిళ గాకపోయినా-ఎంత చక్కగా అంచనా కట్టింది! వీరేశలింగంగారు తన స్వీయచరిత్రలో తన భార్య రాజ్యలక్ష్మమ్మ చనిపోయినప్పుడు వ్రాసినవ్యాసం చదివినప్పుడు ఆమె వుదాత్తమైన వ్యక్తిత్వం తెల్సివస్తుంది. అందుకే సి. ఆర్. రెడ్డిగారు The lives of Veeresalingam and Rajyalakshmamma are a splendid chapter in the history of Indian liberalism—అని అంటూడు వీరేశలింగం పైన వ్రాసిన వ్యాసంలో (చూ: Speeches and Essays of Dr. C. R. Reddy, Progressive Union, Nellore, 1970.)

ఈ నవలనుగూర్చి ఈ వుల్లేఖనల్ని పక్కనపెట్టి నేను దీనికి ఎందుకు దాసుణ్ణయ్యానో చెప్పుకోవాల-వొక ఆంధ్రేతరుడు వ్రాసిన నవలలో వీరేశలింగం గారు, ఆయనభార్య రాజ్యలక్ష్మమ్మ పాత్రలుగా వుండబట్టే దీనికి ప్రత్యేకతవుంది అనే ధోరణికి తెలుగువాణ్ణిగా నేను దాసుణ్ణయ్యాను. నేటి నవీన ధోరణులనుబట్టి నేడు అనంతంగా వచ్చిపడ్తున్న నవలాశిల్ప రీతుల్నిబట్టిచూస్తే ఈ నవలలో చాలా 'వీక్ స్పాట్స్' కానరావచ్చు. కాని పూర్తికాకుండా అసంపూర్ణంగా మధ్యలో చిత్తుగా వొక ముసాయిదాలా నివేదికలా వుండిపోయిన వొక రచనాళికల్ని బట్టుకుని రసచర్చకు శిల్పచర్చకు పూనుకొనడం న్యాయంకాదేమో.

1901 లో వొక మారుమూల కుగ్రామంలోవచ్చిన భూకంపంతో నవల ఎత్తుగడ, ప్రారంభం-పెద్ద సంకేతంగానే వుంది. కథ కొనసాగినతీరునుబట్టిచూస్తే పెద్ద ప్రణాళిక వేసుకుని పెద్ద 'కాన్వాస్'మీద నవలను రచించాలనుకొన్నాడా

అన్వించకపోదు. నవల పేరునుబట్టిచూస్తే ఇంతవరకూ సాగిన ఎనభై పేజీలకథ కేవలం 'నాందీ ప్రస్తావనలు'గానే కనపడ్తుంది. పేరునుబట్టిచూస్తే నవలలో ప్రధాన పాత్ర 'చంద్రిక' కథ గాబట్టి యింతవరకూ జరిగినభాగంలో చంద్రిక బాల్యం మాత్రమే ప్రస్తావనకొచ్చి ఆగిపోయింది కాబట్టి నవల పూర్తంటూ అయివుంటే విస్తృతిలో చాలా పెద్దదిగా వుండేదనిమాత్రం చెప్పవచ్చు-రచనాధోరణీ, రచనా ప్రణాళికా చూస్తే. 68 పేజిలో ఆఖరున 'వైద్యుల్నిగూర్చి ఇంకా చెప్పదల్చిన సంగతులు మున్ముందు చెప్తాను.' అనేమాటచూస్తే ఈ నవలారూపంలో భారతి గారు చాలాచాలా విషయాలు చెప్పాలనుకున్నట్లే వుంది. ఉత్తరోత్తరా భారతి గారు 'చంద్రిక'లో వొక భారతీయ 'మాడ్రన్ గర్ల్' కుండాల్సిన లక్షణాలన్నిటిని పొందుపర్చి చిత్రించదల్చినట్లూ స్త్రీ జన పునరుద్ధరణగూర్చీ, స్త్రీ స్వాతంత్ర్యాన్ని గూర్చి ఈనవలలో చర్చించదల్చినట్లూ స్ఫురించకపోదు.

మొత్తంమీద ఇదొక పెద్ద literary piece గాకపోవచ్చు, వున్నంతలో వీరేశలింగంగార్నిగూర్చి వచ్చిన వొక చిన్న historical curiosityగా మాత్రం దీనికి విలువ లేకపోలేదు, ఎంత కనీసపక్షంగా చూచినా. ఎంత సుప్రసిద్ధులయినా సమకాలికవ్యక్తులు అచ్చంగా కావ్యనాయకులు, కథానాయకులు కావడమనే సంప్రదాయం మన అలంకారశాస్త్రరీత్యా కాస్త విరుద్ధమైనవిషయమే. కేవలం సమకాలిక వ్యక్తులేగాదు, సమకాలిక సమస్యలకుకూడా మన సాహిత్యం దూరంగా వుంటూవచ్చింది. (ఈ గొడవల్లోకిపోతే పెద్ద మీమాంసే అవుతుందిగనుక వదిలేస్తాము.) అట్లాంటిదశలో కందుకూరి వీరేశలింగంవంటి తెలుగు మహాపురుషుడు-తమిళ జాతీయకవిగా ప్రఖ్యాతుడయిన సుబ్రహ్మణ్యభారతిగారి నవలకు కథావస్తువు గావడమే వొక విచిత్రమైన సంగతిగదా. ఈ వొక్క-గుణంవల్లనే 'చంద్రికకథ'కు మన 'దేశవాళీ' నవలల్లో వొక ప్రత్యేకస్థానం వుంది.

అవీ-యివీ

1. లెనిన్‌పై మొత్తం భారతీయభాషల్లో వచ్చిన సారస్వతాన్ని సమగ్రంగా కాకపోయినా వొకవిధమైన 'ఏరియల్ వ్యూ'లో పరిశీలనచేసి ఎల్. వి. మిట్రోఖిన్ అనే రష్యన్ రచయిత Everest Among Men (1969) అనే గ్రంథంలో సుబ్రహ్మణ్య భారతిగారికి ప్రత్యేకస్థానాన్నే ఇచ్చారు:

> Bharati was one of the first in India to have mentioned the name of V. I. Lenin as the leader of the working people of Soviet Russia, under whose guidance

tremendous changes were taking place in that country... Already in 1917, on Nov. 28 he had written in one of the Tamil newspapers that in Russia private property had been abolished and had become the possession of the entire nation. He pointed out that 'the socialist party in Russia' 'under the leadership of Sriman Lenin' had achieved its goal.

2. సమకాలికవ్యక్తుల్ని పాత్రలుగాచేసి రచనచేసే సంప్రదాయాన్ని భారతి గారు మరోదాంట్లోకూడా కొనసాగించినట్లున్నారు. Fox with the golden tail (1914) అనే ఆంగ్లకథలో అనిబిసెంట్ యొక్క రాజకీయం, జిడ్డు కృష్ణమూర్తినీ ఆయన సోదరుణ్ణీ ఆమె పెంచి పెద్దజేసిన విధంగూర్చి వొక పరిహాసకథగాకూడా వ్రాసినట్లున్నారు. (ఆర్. ఎ. పద్మనాభన్ గారి చిత్రభారతి అనే అనర్ఘమయిన తమిళగ్రంథంలో దీన్ని చేర్చారు.)

3. సుబ్రహ్మణ్యభారతిగూర్చి వొక్క ఇంగ్లీషులోనే నేను 8 గ్రంథాలు దాకా చూడగలిగాను. వీటితో పోల్చిచూచుకున్నప్పుడు వీరేశలింగంగారిపై ఇంగ్లీషుగ్రంథాలు ఎన్ని వచ్చివుండాలి? ఇంతదాకా ఎన్ని వచ్చివున్నాయి? తెలుగువాళ్ళ నిరాసక్తతకు ఇంతకంటే నిదర్శనమేముంది? 1949 లో కాబోలు మద్రాసు రాష్ట్రప్రభుత్వం భారతి రచనలపై కాపీరైట్‌ను కొనివేసి భారతీ సాహిత్యాన్ని ప్రజల ఆస్తిగాచేసి ఆయన కుటుంబసభ్యులకు కొంత పైకమిచ్చి ఆదుకుని, ఆయన రచనలకు ప్రచారవిరివిని కల్గచేయుకల్గింది. మన ఆంధ్రప్రభుత్వం ఇట్లాంటి పని జన్మలో చేయకల్గుతుందా? భారతినిగూర్చి తెలుగులో సైతం రెండు గ్రంథాలు వచ్చాయి. మరి వీరేశలింగంగార్నిగూర్చి తమిళంలో?

4 నేషనల్ ఇంటెగ్రేషన్ అనీ, భారతీయభాషలు వేరయినా సాహిత్యమంతా వొకటే అనీ పైకి అంటుంటాంగానీ నిజానికి మనదేశంలోని వొకభాషకూ ఇంకొకభాషకూ మధ్య వొక పెద్ద అగాధమేదో వుంది. ఇరుగుపొరుగురాష్ట్రాల్లోని భాషల్లో ఏమేమి జరుగుతున్నదో పక్కనున్న ఇతరభాషలవారికైనా ఆట్టే తెలియడం లేదు. ఎక్కడో అమెరికాలో, రష్యాలో, బ్రిటన్‌లో, ఫ్రాన్సులో వచ్చిన రచనల్ను పట్టించుకోనిదే నిద్రపట్టని మనకు_తమిళంలో, బెంగాలీలో, గుజరాతీలో, మలయాళంలో సమకాలికరచన లేమేమి వస్తున్నాయో పట్టించుకుంటున్నామా? 007, క్లియోపాత్రా, మెకన్నాస్ గోల్డ్ సినిమాలను ఈ దేశంలో ప్రదర్శించేందుకు బోలెడుఖర్చాలూ, వాటిని ఎగబడిచూచేజనమూ బోలెడంతమందివున్నారు

గానీ; అంతర్జాతీయంగా ఖ్యాతిపొందిన సత్యజిత్ రాయ్, మృణాళినీ సేన్, రుత్విక్ ఘటక్ చిత్రాలు, అట్లనే కన్నడ, మలయాళీచిత్రాలు మనదేశంలోని ఇరుగు పొరుగు రాష్ట్రాల్లోనయినా ప్రదర్శించే అవకాశాలున్నాయా? ఒకవేళ తప్పి దారీ ప్రదర్శిస్తే ఎంతమందిమి చూస్తున్నాం? భారతీయ సాంస్కృతిక జీవనవిధానం లోని ఈ అగాధా లేమిటి?

5. ఈ నవల తొమ్మిదో అధ్యాయంలో వాక్యమైనా సరిగా పూర్తిచేయ బడకుండా మధ్యలో ఆగిపోవడం దురదృష్టకరం. 'లైఫ్' పత్రిక 1969 జనవరి 20 తేది సంచికలో మార్క్ ట్వైన్ 'ఇండియన్స్' అనే అసంపూర్ణనవలను బయ టపడలాగి అచ్చువేసారు. తీరాచూస్తే ఆదీ తొమ్మిదో అధ్యాయంలో ఒకవాక్యం మధ్యలో ఆగిపోయింది. ఆతర్వాతవిషయమేమిటి అనేదానిపై పెద్దచర్చ జరిగింది. ముగిసిన రచనలకంటే, ముగియకుండా మధ్యలో ఆగిపోయిన రచనలే సారస్యంగా వుంటాయా అన్పిస్తుంది. కీట్స్ కవిచెప్పిన 'అన్‌హార్డ్ మెలోడీస్' మాదిరిగా!

6. నార్లగారు వీరేశలింగంగారిపై వ్రాసిన ఆంగ్లగ్రంథంలో 'ముంపు మాట్లల్లో' ఒకబాధను వ్యక్తం చేసారు. భారతదేశంలో అగ్రస్థాన మలంకరించ దగిన మొదటి అరడజనుమంది సంఘసంస్కర్తలలో వీరేశలింగంగారు నిస్సందే హంగా ఒకరయినపుడు, ప్రత్యేకించి దక్షిణభారతంలో ఆయన మహిమాన్వితమైన వ్యక్తిగా శక్తిగా ప్రకాశించినపుడు-నేటి దేశచరిత్రల్లో వీరేశలింగంగారు దాదాపు అనామకమైపోయి, ఆయనకు రావల్సినంత సముచితమైన స్థానం రావడం లేదేమో నంటూ-ఎస్. నటరాజన్ వ్రాసిన 'A century of Social Reform in India' అనే ఆంగ్లగ్రంథంలో వీరేశలింగంగార్నిగూర్చి చాలా అప్రముఖమయిన ప్రస్తా వనలు రెండే రెండుచోట్లమాత్రం దొర్లాయనీ, అవీ ఏదో మామూలు ధోరణిలో పేర్కొనడం జరిగిందనీ; Charles H. Heimsath వ్రాసిన 'Indian Nationalism and Hindu social reform' అనే గ్రంథంలో వీరేశలింగంగూర్చి ఒకే ఒక వాక్యంమాత్రమే వున్నదనీ బాధను వ్యక్తం చేసారు.

ఈ కొరత కొంతకు కొంతైనా మున్ముందు తీరగలదనే ఆశించేవాళ్లల్లో నేనొకణ్ణి. వీరేశలింగంగారు నిర్వహించి నేతృత్వం వహించిన వుద్యమ విస్తార వైభవంగూర్చి మున్ముందు ఇంగ్లీషులోనూ తెలుగులోనూ మరిన్ని రచనలు రాగలవని ఆశిస్తున్నాను. డి. ఆంజనేయులుగారు నేషనల్ బుక్ ట్రస్ట్‌వారికి వీరేశలింగం గార్నిగూర్చి అంగ్లంలో గ్రంథాన్ని వ్రాసిచ్చారనీ అది అచ్చవుతున్నదనీ అనుకుం టున్నాను. అమెరికన్ యువకుడు జాన్ జి. లియొనార్డ్‌గారి వీరేశలింగంపై పరి

శోధనగ్రంథాన్ని ఇప్పుడు హైద్రాబాద్‌లో రివైజ్ చేస్తున్నారు. బహుశా త్వరలో అదీ వెలుగు చూడగలదని ఆశిస్తున్నాను. ఇవి రెండూ వీరేశలింగంగారిపై కొంత కొత్తవెలుగును ప్రసరింపజేయగలవని ఆశిస్తాం. కొడవటిగంటి కుటుంబరావు గారిచేత సంక్షిప్తంచేయబడిన 'వీరేశలింగంగారి స్వీయచరిత్ర'ను నేషనల్ బుక్ ట్రస్ట్‌వారు అన్ని భారతీయభాషల్లోకి అనువాదం చేయించి ప్రకటిస్తున్నారు. ఇక తెలుగులో ఏమయినా గ్రంథాలు వస్తాయా అంటే మన తెలుగువాళ్ళ తెగులును ఆ భగవంతుడే చెప్పగలగాలి. ఏమయినా వీరేశలింగంగారిపై తెలుగునాట ఇప్పుడు కొత్త 'ఇంట్రస్ట్' కనపడుతున్నది. "వీరేశలింగయుగం ఆయన చని పోయాక ఇప్పుడిప్పుడే ప్రారంభమైనట్లు తోస్తుంది." అని దేవులపల్లి కృష్ణశాస్త్రి కవివాక్యం వూరకనే పోదుఅనిపిస్తున్నది. (చూ: విశ్వోదయ స్టూడెంట్సు మేగజైన్, కావలి-'సంఘసంస్కర్త: వీరేశలింగం పంతులు' శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి వ్యాసం.)

7. తెలుగులో బహుశా మొదటిసారిగా అనుకొంటాను, వొక నెల్లూరీయుడు కొమాండూరు పార్థసారథి అయ్యంగార్ గారు భారతిగారి తమిళ జాతీయ గీతాలను ఏడింటిని తెలుగులోకి తర్జుమాచేసి 1947 లో 'కాంగ్రెస్ ప్రచారపాటలు' అని వొక పుస్తకంగా అచ్చొత్తించారు. మళ్ళీ 25 సంవత్సరాలతర్వాత మరో నెల్లూరీయుడు ఈ బంగారె భారతిగారి ఈ నవలను ఈ రూపంలో వెలువరిస్తున్నాడు. నెల్లూరు మాండలికాలను అక్కడక్కడా పనిగట్టుకుని ప్రయోగించాడు. తర్జుమాలో, ఇవి ఇతరప్రాంతాలవారికి తికమక కల్గించవనే ఆశిస్తున్నాను. తర్జుమా దోషాతీతమని చెప్పే సాహసంలేదు. తెలుగుపాఠకులు సహృదయంతో భరిస్తారనే ఆశిస్తున్నాను. ఉదాహరణకు మొదటివాక్యంలోనే విరామచిహ్నాలు-హైఫన్‌లు, సెమికోలన్‌లు, కామాలు అన్నీ క్రిక్కిరిసి వొకవాక్యంలో తప్పుగా పడ్డాయి.

కృతజ్ఞతలు

In the Telugu country an author has generally to be his own publisher and book seller—అని గురజాడ 1909 లో అన్నవాక్యం నా విషయంలో నిజమై కూర్చున్నది. 'మొట్ట మొదటి కన్యాశుల్కం స్కాలర్స్ ఎడిషన్, (1969) కు లాగానే దీనిముద్రణకూ అప్పు మంజూరుచేసిన కెనరా బ్యాంకింగ్ కార్పొరేషన్ వారికి మొదట కృతజ్ఞతలుచెప్పుకోవాల. రచనవిషయంలో నాకుకల్గిన సందేహాలను తీర్చడంలో యథాశక్తి తోడ్పడిన నార్ల, కె. వి. రమణారెడ్డి, చల్లా రాధాకృష్ణశర్మ, శ్రీమతి ప్రేమానందకుమార్, లియొనార్డ్, మద్రాసు యు. ఎస్.

ఐ. ఎస్. లోని బి. ఎస్. ఆర్. కృష్ణ, వి. ఒ. సి. సుబ్రహ్మణ్యన్ గార్లకూ; తొలుత ఈ నవల తర్జుమాకు కారకులైన శ్రీ వి. ఎస్. రాఘవన్, ఎన్. ఎస్. కృష్ణమూర్తి గార్లకూ, ఇది తొలుత సీరియల్ గా వెలువడినప్పుడు తగిన ప్రోత్సాహమిచ్చిన సెట్టి ఈశ్వరరావు, డి. ఆంజనేయులు, టి. కృష్ణాబాయి, సి. వి. రామచంద్రరావు గార్లకూ; తర్జుమాలోని లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ నిశితంగా విమర్శిస్తూ, మమ్మల్ని అలనాటి నెల్లూరు 'ముగ్గురు రసికులు'గా 'సాహిత్యగేలి' పట్టిస్తూ వచ్చిన మరుపూరు కోదండరామరెడ్డిగారికీ; తర్జుమా తొలిరూపాన్ని చదివి మార్పులు చేర్పులు సూచించిన వేదం వెంకటరామన్, కాళిదాసు పురుషోత్తం గార్లకూ, నా ఈ ప్రయత్నంపట్ల సౌజన్యపూరితమైన సహాయధోరణిని ప్రదర్శిస్తూ, తంచన్ గా ప్రత్యుత్తరాలు వ్రాస్తూవచ్చిన ఆచార్య జి. ఎన్. రెడ్డిగారికీ; కాలేజీ సెలవుల్లో, ఎన్. జి. వో.ల స్ట్రైయిక్ సమయంలో సతమతమవుతూకూడా అడిగిన వెంటనే తమ లైబ్రరీనుండి సరోజినీదేవి జీవితచరిత్రగ్రంథాన్ని అరువిచ్చిన నెల్లూరు దొడ్ల కాసల్యమ్మ మహిళా కాలేజి ప్రిన్సిపాల్ అహ్మద్ బీబి గారికీ; నా ఈ కృషిని మెచ్చి సుబ్రహ్మణ్యభారతిగూర్చి ఇంగ్లీషులోవచ్చిన లేటెస్టు పుస్తకం 'ది ఫింగర్ ఆన్ ది ఫ్లూట్' ప్రచురణకర్తలయిన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసర్చి అండ్ ట్రయినింగ్ వారినుండి వొక కాపీని తెప్పించేందుకు విఫలప్రయత్నం చేసిన నెల్లూరు బి. ఇడి. కాలేజి ప్రిన్సిపాల్ దీనదయాళ్ గారికీ, భారతిపై పి. మహాదేవన్ గారి ఇంగ్లీషుపుస్తకాన్ని మద్రాసులో సేకరించిపంపిన ఫ్రీడమ్ ప్రెస్ యజమాని ఎం. బాలసుందరంగారికీ; నా లొల్లాయ్ని మన్నించి పత్రికలో 'న్యూస్' కివ్వాల్సిన 'స్పేస్'ను కొంత ఈ నవలకు కేటాయించి తొలుత సీరియల్ గా ప్రకటించిన జమీన్ రైతు నిర్వాహకులకూ-ఇట్లా అందరికీ కృతజ్ఞతలు చెప్పుకోవడం నా విధి.

ఆఖరుగా నెల్లూరు ప్రోగ్రసివ్ యూనియన్ లైబ్రరీలోని అపురూపమయిన గ్రంథసంచయానికీ; అప్పుడప్పుడూ ఎందుకీ దండగమాలిన శ్రమంతా అని నిష్ఠురంగా మాట్లాడినా, వ్రాతలో ఏకాగ్రపఠనంలో ఆసరా ఇచ్చి ఆదుకుంటూ తోడ్పడిన నా శ్రీమతి సుమిత్రకూ; ముద్రణ వ్యవహారాన్ని సానుభూతితో శ్రద్ధతో నిర్వహించిన మద్రాసు ఫ్రీడం ప్రెస్ వారికీ కృతజ్ఞతలు.

28_4_71
నెల్లూరు.

—బంగోరె.

చంద్రిక కథ

1

పొడియ కొండలసానువుల్లో 'వేలాంగుడి' అనే సుందరమైన గ్రామం - దగ్గర్లోనే చిన్న నది; చుట్టూ నీలికొండలు, తిప్పలు; వూరినిండా తోటలు; వేకువజాము మొదలు సాయంత్రందాకా ఎల్లవేళలా వీనుల విందుచేసే పక్షుల కిలాకిలారావాలు-ప్రకృతిసౌందర్యం వుట్టిపడ్తున్నట్లుంటుంది ఆ గ్రామం.

ఊరికి పడమటగా అల్లంతదూరంలో నదీతీరం. అక్కడ వొక బ్రాహ్మణ అగ్రహారం. ఆ అగ్రహారం వీధుల్లో పక్షులవలెనే పిల్లలు కిలకిలమంటుంటారు. పక్షులమధ్యన పెరగడంవల్లనేమో ఆ బాల బాలికలకూ మధురమైన స్వరాలే వచ్చాయి - కోకిలస్వరాలవలె, చిలుకపలుకులవలె కర్ణపేయంగా ముద్దు గొల్పుతుంటాయి.

ఆ అగ్రహారం పడమటవైపున తూర్పుముఖంగా శ్రీ కృష్ణుని కోవెల వుంది. ఎదురుగా పచ్చికబయళ్లు - అక్కడ ఆవులు, గాడిదలు యథేచ్ఛగా మేస్తూవుంటాయి. ఆవులు శ్రీ కృష్ణుని సమ్ముఖంగా పడుకొని, స్వామిపై దృష్టినిల్పి జపం చేస్తున్నట్లు మౌనంగా నెమరు వేస్తుంటాయి. వాటిపై కాకులు కూర్చుని ముక్కులతో పొడుస్తుంటాయి. ఒకొక్కప్పుడు కాకులు ఆవులకళ్లను పొడుస్తున్నట్లభినయిస్తూ పొద్దుపుస్తుంటే చెట్లపైనుండి ఇతర పక్షిజాలం ఆశ్చర్యంతో వీక్షిస్తుంటుంది.

ఆ అగ్రహారంస్త్రీలు లోకసుందరులు, పురుషులు సద్గుణరాసులు కానీ నిరుపేదలు. పిత్రార్జితంగా వచ్చిన కొద్దిపాటి చేలు, తోటలే వారి ఆస్తిపాస్తులు. ఈ ఆస్తులమీద వచ్చే వరుమానం నిత్యభోజనాదులకే చాలదు. ధోవతులు, చీరలు, రవికలు, పావళ్లు

కొనేందుకు; చోళ-వుపనయన-వివాహ-ఋతుస్నాన-ఋతుశాంతి-సీమంతాలు, పండగలు-పబ్బాలు, వుత్సవాలు-జాతర్లకు డబ్బు దండ గాతుండేది. ఆవూరి గృహస్థులు-తమ భూవసతులు క్రమంగా కరిగి పోయి వరుమానం తగ్గిపోతూ, దారిద్ర్యం పెరిగిపోతున్నందువల్ల-దిగులుతో జీవనం జరుపుతుండేవారు. అయితే వారి పిల్లలకుమాత్రం పెద్దల్లోవుండే భీతీ మనోవ్యాకులతలు తెలిసేవికావు; అట్లనే అక్కడి పట్టిజాలానికికూడా; ఆకృష్ణాలయం ఎదుట మేసే ఆవులకూ గాడిద లకూ యీ చీకూ చింతా వుండేదికాదు. వాళ్లంతా ఎప్పుడూ ఆ దట్ట మైన గడ్డిబయళ్లలో తిరుగాడుతూ ఆనందంగా పాటలతో ఆటలతో అల్లారుముద్దుగా వుండేవారు.

ఆ అగ్రహారంలో అందరికన్నా నిరుపేద మహాలింగయ్య. కుటుంబం పెద్దది. ఇల్లు ఇరుకైనది. ముసలి తల్లిదండ్రులు, వితంతువైన చెల్లెలు, ముప్పయిసంవత్సరాల వయసుగల భార్య, అయిదుగురు కూతుళ్లు-యిదీ వారి కుటుంబ జనాభా. పైగా ఆ ఇల్లాలుకు ఆరో పుగుడుకూడా సమీపిస్తున్నది.

వీళ్ళందరకీ భోజనం కావాలి. మహాలింగయ్యకు ఆస్తి నాస్తి. యవ్వనోత్సాహమూ, ఎట్లయినా ధనం ఆర్జిస్తామనే నమ్మకమూ ఆయన్నువదిలి చాలాకాలమైంది. ఇంతలో బిడ్డల బరువు బాధ్యతలు, భార్యపటుత్వం తగ్గుదల, ముసలివాళ్ల వ్యాధిబాధలు, అనాథైన యవ్వనవతి చెల్లెలికష్టమూ-వీటితో మహాలింగయ్య మనసు సత మతమై శిరోజాలు హంసవర్ణమైనాయి. శరీరం డసిలిపోయింది. బల హీనుడై వంగిపోయ్యాడు. కండ్లు గుంటలుపడ్డాయి. ముఖం పీల్చుక పోయింది. తన చిన్ననాట అనుభవించిన శృంగారరసంచేత మేహ వ్యాధి ఎక్కువై, వళ్లంతా పొడలు వ్యాపించాయి.

ఈదశలో వొక మార్గశిరరాత్రినాడు ఆకాశమంతా మబ్బులు గమ్మాయి, నక్షత్రాలు అదృశ్యమయ్యాయి. భోరుమని వాన, రివ్వు మని సుడిగాలి వుగ్రరూపందాల్చి ఆవూరును హోరుమనిపించాయి.

రెండు నిమిషాల కొకసారి ప్రపంచం పగిలేటట్లు మేఘగర్జనలు, చెట్లు విరిగి కిందపడ్తున్న భీకరశబ్దాలు. తోటలన్నీ సర్వనాశనమైనాయి. వీధుల ఎలపానా రాళ్లగుట్టలు.

ఇంతటితో ఆగక భూమి కంపించడం మొదలుపెట్టింది. ఆ అగ్రహారం ఇళ్లు పాతవి. ఒక్కపెట్టున అన్నీ చిందరవందరై పోయాయి. ప్రజలు నిరాశ్రయులై పోయారు.

మహాలింగయ్య ఇంటి వసారామాత్రం ఎట్లనో నిల్చింది. ఇంటి నడవలోవున్న ముసలిదంపతులు, మహాలింగయ్య, వారి ఐదుగురు ఆడకూతళ్లపై ఇల్లు అమాంతం కూలబడింది. ఆక్షణాన్నే వారంతా చచ్చి పచ్చడై పొయ్యారు. వాకిట వసారాలో ఆసన్నప్రసవయైన అయ్యగారి భార్య, ఆమెకు తోడుగా బాల వితంతువుమాత్రం వుండి పొయ్యారు.

రాత్రి ఏడుగంటలకు ప్రారంభమైన గాలివాన వేకువజామున నాలుగ్గంటలదాకా వీరవిహారం చేసింది. చివర భూకంపంతో పరి సమాప్తమైంది. తర్వాత అరగంటలో అంతా శాంతించింది. తెల్ల వారింది. అనాథ అయిన విశాలాక్షి వీధిలోకిపోయి చూసింది-ఇండ్లేమీ లేవు, నుగ్గునుగ్గయిపోయి భూపతనమై వున్నాయి. అంతటా మానవ కళేబరాలు, పశు మృగప్రేతాలు పడివున్నాయి శ్మశానవాటికలో మాదిరి. వీధి నిర్మానుష్యమై బావురుమంటున్నది.

ఆమె ఆ దృశ్యాన్ని చూడలేకపోయింది. గాలివానలో బయ టకు విసరివేయబడిన శవాలనుమాత్రమే కళ్లతో చూడకలిగింది, కానీ ఇళ్లలోపల కూరుకునిపోయివున్న శవాలో? ఇతరుల ఇళ్లగతి అట్లావుంచి తన ఇంట్లోసంగతో?

ఒక్కసారిగా ఆ రాత్రంతా జరిగిన భయోత్పాతాలు ఆమెను కలవరపెట్టినై. భూకంపం ప్రారంభమైన తడవునే-ముసలితండ్రి లబో దిబోమంటూ-"అయ్యో అయ్యో, భూమికదిలాడుతున్నదే, మనమంతా

వాకిటి వసారాలోకి పోదాం, అదే బటువైన స్థలం, వసారాలోకి తీసుకపోండి''-అని అరిచాడు. ఆ అరుపులుమాత్రం విశాలాక్షి చెవులబడ్డాయి. ఆ తర్వాత మరేమాటా వినబళ్లేదు.

వాకిట్లోని వసారాలోకి రావాలంటే మధ్యవున్న అరుగెక్కి-దాటిరావాలి. ఇంట్లోనుండి వసారాలోకి మరో దారిలేదు. గోడ గూళ్లలోనుంచి ముసలాయన ఆకేకలుమాత్రం గాలివాన భీకర ధ్వనుల్ని మించి విశాలాక్షి చెవుల్లో పడ్డాయి. కానీ వాళ్లు వసారా చేరుకోవడమనేది దుష్కరమైన పనే అని ఆమె వ్యూహించుకొంది. వాకిలి తీసుకొని, అరుగెక్కి-ఆ హోరుమనే గాలివానలో వసారా లోకి రావడమే! అసలు తలుపులు తెరవడం సాధ్యమా?

ఒకటి రెండు ఘణాల్లో పెళపెళమంటూ ఇల్లు కూలిపడ్డం, లోపలి వాళ్లు చావు అరుపులు అరవడం ఆమె చెవిన బడ్డాయి. అంతా గతించారని అర్థమైంది. తానుండే వసారాకూడా కూలిపోతుందని భయపడ్డది...క్రమంగా భూకంపం ఆగిపోయింది, గాలివానకూడా వెలిసింది.

ఈ సంగతులన్నీ తలపోస్తూ - తనచుట్టూ కూలిపోయున్న ఇళ్ళను, చెట్లను, చచ్చిపడివున్న శవాలనూ దీనంగా చూస్తూవుంటే వసారాలోనుండి 'కువకువ' మనే శిశురోదనం వినబడ్డది. వసారాలో కొచ్చి కుతూహలంగా చూచింది. వదినెకు ఆడపిల్ల పుట్టింది.

పడకమీద వదినె గోమతి ఆసన్నమరణమై పడివుంది. విశాలాక్షే ఆ బిడ్డకు నూతన శైశవ శుశ్రూష చేసింది.

గోమతి విశాలాక్షిని దీనంగా దగ్గరకుపిల్చి - ''విశాలాక్షీ, నా కిక రెండునిమషాలే గడువుంది. నీతో రెండుమాటలే చెప్తాను. బ్రతికిందాకా ఆ మాటల్ను మర్చిపోవద్దు—

''మొదట్టి-నీవు రెండోపెళ్లి చేసుకో. విధవావివాహం నిషేధమేమీ కాదు. స్త్రీ పురుషు లిద్దరూ యమునికి లోబడ్డవారే. స్త్రీలు

పురుషులకు బానిసలు కారు. వారికి భయపడ్తూ బాధ లనుభవించి, దుఃఖించి, క్షీణించి నశించిపోవాల్సిన అవసరం లేదు. పురుషులు స్వార్థపరులుగా ప్రవాసినశాస్త్రాల్ని చించి పొయిలో పారెయ్. ధైర్యంగా చెన్నపగరానికి పో. అక్కడ వితంతువివాహాలు జరిపే సభవార్ని చేరి వారిసాయంతో చక్కని వరుణ్ణి పెండ్లాడి సుఖంగా వుండు.

"రెండోమాట—నీవు ప్రతికి ఈబిడ్డను పోషించు. దానికి 'చంద్రిక' అని పేరుపెట్టు"-అన్నది.

విశాలాక్షి 'సరే' అన్నది.

గోమతి పరలోకం చేరుకున్నది.

★

ఆ బీభత్సమైన భూకంపతాండవం సమసిపోయి మూడేళ్ళయింది.

1904 సంవత్సరం కడపటిభాగంలో, చెన్నపట్నంలోని 'స్వదేశ మిత్రన్' పత్రికాధిపతి సుబ్రహ్మణ్యయ్యర్ బొంబాయిలో జరుగనున్న భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు* ప్రతినిధిగా పోదలచి, ప్రయాణానికి కావల్సిన దుస్తులు, తినుబండారాలు సిద్ధపరచుకుంటుండినాడు.

ఆ రోజుల్లో తిరువళ్ళిక్కేణిలోని వీరరాఘవ మొదలి వీధిలో జి. సుబ్రహ్మణ్యయ్యర్ గొప్ప కీర్తిప్రతిష్టలతో విరాజిల్లుతుండేవాడు. అయితే వారి నప్పుడేదో ఘోరమైనవ్యాధి ఆవరించి, శరీరమంతా ముఖమంతా జర్జరితమై ముండ్లకురుపులతో బాధపడ్తుండేవాడు. అయినా ఆయన అసాధారణమైన ధైర్యంతో దేశసేవాకార్యకలాపాలను నిర్వహిస్తుండేవాడు.

అవి 1904 డిసంబరునెల మధ్యరోజులు. ఒకనాడు పొద్దున్నే ఆయన తన ఇంటిమిద్దెమీద స్వంత గ్రంథాలయంలో వాలుకుర్చీలో కూర్చొని పత్రిక చదువుతున్నాడు. ఒక ముత్తైదు – ఆయన రెండో కుమార్తె పెద్ద వూరగాయజాడీ వొకటి తెచ్చి వారిముందు పెట్టింది.

సుబ్రహ్మణ్యయ్యర్ :–ఏమిటమ్మా అది, ఏముంది అందులో?

కుమార్తె:–నేతో తయారైన నిమ్మకాయ వూరగాయ నాన్నా. బలే ఘాటైన కారం.

సుబ్ర:–వీటన్నిటినీ ఎట్లా మోసుకపోవడం? మన పనివాడు వొట్టి మూర్ఖుడు–అని సణుక్కున్నాడు.

ఇంతలో మిద్దెదిగి కిందకుపోయి వచ్చినకుమార్తె "నాయినా, ఎవరో వొక బ్రాహ్మణవితంతువు బిడ్డనెత్తుకుని వచ్చుంది. అవసరమైన పనట. మిమ్మల్ని చూడాలట"–అన్నది.

---

* బొంబాయిలో కాంగ్రెసుసభలు జరిగింది 26-12-1904 లో.

సుబ్ర:-ఆమె కెంత వయస్సుంటుంది ?

కుమా ర్తె:-ఇరవై ఏళ్లుంటాయేమో ?

సుబ్ర:-సరే, వొక కుర్చీ తెచ్చి నా ఎదుట వేసి, ఆ అమ్మాయిని రమ్మను.

కూతురు వెంటనే కుర్చీ తెచ్చి ఆయనముందర వేసి కిందకు దిగి పోయింది. కొద్ది నిమషాల్లోనే - మన విశాలాక్షి, బిడ్డ 'చంద్రిక'తో మేడమీదికొచ్చి, సుబ్రహ్మణ్యయ్యర్ శిరఃకంపంతో సూచించిన ఎదుటికుర్చీలో కూర్చున్నది.

సుబ్ర:-ఏ వూరమ్మా ?

విశా:-పొదియ పర్వతలోయల్లోని కుర్తాళం సమీపంలో వేలాంగుడి గ్రామమండీ మాది.

సుబ్ర:-ఓహో ! మూడేళ్లముందు, ఇదే నెల్లో వొకవూళ్లో శూద్రాదుల వీధులన్నీ నిలవగా, అగ్రహారంమాత్రం భూకంపంలో నాశనమై పోయిందని విన్నాం. ఆ వేలాంగుడేనా మీవూరు ?

విశా:-అవునండీ.

సుబ్ర:-ఇంత చిన్నప్రాయంలో, ముఖం వర్చస్సులో వుండగానే, నీ కీ వైధవ్యం ప్రాప్తించి ఎంతకాలమైందమ్మా ?

విశా:-పదిహేను సంవత్సరాలైందండీ.

సుబ్ర:-నీ వయసూ ?

విశా:-ఇరవై ఐదు సంవత్సరాలండీ.

సుబ్ర:-పదిసంవత్సరాల బాల్యంలోనే నీ కీ దుస్థితి ప్రాప్తించిందా !

విశాలాక్షి మౌనదీనంగా వుండింది.

ఇదంతా వినగానే, తన కూతురుసైతం బాల్యంలో వితంతువైన సంఘటన గుర్తుకొచ్చింది సుబ్రహ్మణ్యయ్యర్ గారికి...తర్వాత

తను బొంబాయిలో వొకదాక్షిణాత్య బ్రాహ్మణునికిచ్చి పెండ్లి చేయడం, ఆమె తనభర్తతో సుఖంచేభాగ్యం లేకుండానే కొంత కాలానికే మరణించడం, తనధర్మపత్ని పరలోకగమనం... మొదలైన విషయాలన్నీ అయ్యర్ గారి స్మృతిపథంలో మెదిలాయి. సింహానికి కూడా భయపడని వీరహృదయులు సుబ్రహ్మణ్యయ్యర్ పసిబిడ్డవలె ఎక్కి-ఎక్కి ఏడ్చాడు. మరు నిమషంలోనే తన్ను తాను సమాళించుకుని విశాలాక్షినిచూచి - నీ వికృడకువచ్చిన వుద్దేశ మేమిటమ్మా ఇంతకూ?-అనడిగాడు.

విశా:-ననొక యోగ్యుడైన వరునికిచ్చి పెండ్లి చేయమని మిమ్మల్ని వేడుకోడాని కొచ్చాను. నావద్ద వొక సింహళ కాసు (చిల్లి గవ్వ)కూడా లేదు. నాకు భర్త కాబోయేవారు ధనికుడు గాక పోయినా, విద్య-సంపాదనశక్తి వుంటే చాలు. ఈ బిడ్డకూడా నాతోనే వుంటుంది.

సుబ్ర.-ఈ బిడ్డెక్కడిది?

విశా:-మా అన్నకూతురండీ. వేలాంగుడి అగ్రహారమంతా భూకంపంలో ధ్వంసమైపోగా నేనూ యీ బిడ్డ తల్లిమాత్రమే ఆగాలి వానకూ, భూకంపానికీ బలిగాకుండా బతికాం. ఆ బీభత్సం తగ్గగానే కొన్ని నిమషాలకీబిడ్డ పుట్టింది. దీన్ని కనవల్సిన బాధ్యత తీరిపోగానే ఆతల్లి పరలోకం పోయింది. దీని రక్షణభారం నాపై మోపివెళ్ళింది.

సుబ్ర:-ఈ మూడుసంవత్సరాలుగా జీవనం ఎట్లా గడిపావమ్మా మరి?

విశా:-ఉపాదానమెత్తి కడుపు నింపుకున్నాను, ఈ బిడ్డను రక్షించుకున్నాను.

వెంటనే సుబ్రహ్మణ్యయ్యర్ వొక నూరురూపాయల నోటు తీసి విశాలాక్షి చేతిలో బెట్టాడు. విశాలాక్షి లేచినిలబడి వినమ్రయై రెండుచేతులతో దాన్ని తీసుకుని కళ్లకద్దుకుని చీరకొంగుకు ముడివేసి దాచుకున్నది.

సుబ్ర:-సరేమ్మా, నీవు పొయిరా.

విశా:-తమర్ని నేను మాతండ్రిగా భావించాను, మీదగ్గరకు డబ్బుకోసం రాలేదు. తగిన వరునికోసం వచ్చాను. మరిచిపోకుండా కాస్త...

సుబ్ర:-ఆపని నాచేత కాదే ఎట్లా?

విశా:-తమరుతప్ప నాకు రక్షకులు మరెవరూ లేరు.

సుబ్ర:-నాచేతకాదే, నేనేం చెయ్యను?

విశా:-మీరు దయపెడ్తే సాధ్యమౌతుంది.

సుబ్ర:-నీమీద సదభిప్రాయం కల్గేకదా నీకు పైకమిచ్చాను.

విశా:-అంతమాత్రం దయ చాలదండీ, మరి కాస్త నాయెడ కరుణచూపాలి - అని వేడుకుంది.

సుబ్రహ్మణ్యయ్యర్ తల గీరుకున్నాడు. కాసేపు సాలోచనగా చూచి ఆమెతో-''రాజమహేంద్రవరంలో నామిత్రు లొకరున్నారు. వారిపేరు వీరేశలింగం పంతులు. వారు వితంతువులకు పునర్వివాహాలు చేయడం వంటి స్త్రీజనోద్ధరణ కార్యక్రమాలలో అత్యంత శ్రద్ధాళువులై కృషి చేస్తున్నారు. నీకొక జాబిస్తాను. వారివద్దకెళ్ళి చూపించు. ఆయన నీకు కావల్సిన సౌకర్యాలు సమకూరుస్తారు''-అన్నారు.

విశాలాక్షి 'సరే'నని తలవూపింది.

సుబ్రహ్మణ్యయ్యర్ తన మేజాపైవున్న గంటను మ్రోగించాడు. క్రిందనుండి ఆయన కుమార్తెవచ్చి - ఏంకావాలి నాయినా - అంది.

సుబ్ర:-పనివాడింకా రాలేదు కదూ?

కూతురు:-వాడు స్మిత్ షాపులో మందులు కొనుక్కోరావడానికెళ్లాడు. మధ్యాహ్నంమీదట కానీ రాడేమో. మీకేం కావాలి?

సుబ్ర:-నా మేజావిూద సీరాబుడ్డి పేనా వున్నాయి. డ్రాయ తులో కుడివైపుగా జాబులువ్రాసే కాగితాలు, కవర్లూ వున్నాయి. ఒక్కాగితం, కవరూ, వొత్తుకు వొక లావుపుస్తకం తీసుకరామ్మా.

ఆయనకుమార్తె వాటిని తెచ్చిపెట్టింది. సుబ్రహ్మణ్యయ్యర్ వొకజాబువ్రాసి కవర్లోపెట్టి దాన్ని కుమార్తెకిచ్చి - యీకవర్ను అంటించుకరామ్మా-అన్నాడు. ఆమె కవర్ను అతికించుకోనొచ్చి, సీరాబుడ్డి ఇతర సరంజామాను తీసుకెళ్ళింది. ఆ జాబును చేతబట్టుకుని విశాలాక్షినిచూచి—

సుబ్ర:-నీకు తెలుగు తెల్సునా?

విశా:- తెల్సండీ.

సుబ్ర:-ఎక్కడ చదివావు?

విశా:-మావూర్లో పక్కింట్లో వొక తెలుగు బ్రాహ్మణ కుటుంబముండేది. చిన్నప్పట్నుండీ వాళ్లతో స్నేహంగావుంటూ వాళ్ళింట్లో పెరగడంచేత తెలుగు మాట్లాడ్డం నేర్చుకున్నానండీ.

సుబ్ర:-సరే. నీకు త్వరలోనే మంచి వరుడితో వివాహ మవు తుంది, మీ దంపతులిద్దరూ ఆచంద్రార్కం సుఖంగా భోగభాగ్యా లతో జీవిస్తారమ్మా...

సుబ్రహ్మణ్యయ్యర్ గారు కవరును విశాలాక్షి కిచ్చారు. విశా లాక్షి లేచినిలబడి రెండుచేతుల్తో దాన్ని తీసుకుని కళ్లకద్దుకుని వొడిలో కట్టుకున్నతర్వాత అయ్యరుగారికి సాష్టాంగనమస్కారం చేసి శలవుపుచ్చుకుని బిడ్డను తీసుకుని బయలుదేరింది. సుబ్రహ్మణ్య య్యరుగార్నిచూచి బిడ్డ చిరునవ్వు నవ్వింది.

*

3

విశాలాక్షి ఆ జాబుతీసుకుని మద్రాసునుండి రాజమహేంద్రవరం వెళ్లి, వీరేశలింగంగారిల్లు ఎక్కడుండేదీ అడిగి తెల్సుకొనిపోగా పాపం, గుమ్మందగ్గరే కబురందింది– వీరేశలింగంగారు రప్పుడు రాజమండ్రిలో లేరనీ, ఆముందురోజే మద్రాసుకు వెళ్లారనీ, ఆయన పట్నంలో ఎళుంబూరు (ఎగ్మూరు)లో వొక భవనంలో కుటుంబ సమేతంగా బసచేసివుంటారనీ చెప్పారు.

విశాలాక్షి మళ్ళీ యీసురోమంటూ చెన్నపట్నం వచ్చింది. మర్రోజే ఎళుంబూరులోని పంతులుగారిల్లు చేరింది. ఇంట్లో పంతులుగారు మేజాముందు కుర్చీపై కూర్చుని వీదో గ్రంథం వ్రాసుకుంటున్నారు. విశాలాక్షి లోపలికిపోయి వారికి నమస్కారం చేసింది. సుబ్రహ్మణ్యయ్యర్ గా రిచ్చినజాబు వారికి వినమ్రంగా అందించింది. విశాలాక్షిని కుర్చీలో కూర్చోమని పంతులుగారు సంజ్ఞ చేసారు. చంద్రికను వొడిలో కూర్చుండబెట్టుకుని విశాలాక్షి కూర్చున్నది. పంతులుగారు ఆమిచ్చిన జాబునంతా చదివి—

పంతులు:–ఈదినం వీమివారం–అని అరవంలో అడిగాడు.

విశా:–బుధవారం–అని తెలుగులో జవాబు చెప్పింది.

పంతులు:–మీకు తెలుగువచ్చునా?

విశా:–అవును బాగనే వచ్చునండీ.

పంతులు:–మీ తల్లిదండ్రు లున్నారా?

విశా:–లేరండీ.

పంతులు:–తోబుట్టువులు, అక్కచెల్లెళ్లెవరైనా వున్నారా?

విశా:–నా కెవరూ లేరండీ. నా వ్యవహారంలో శ్రద్ధతీసుకుని మేలుచేసే బంధువు లెవరూ లేరు. అధవా వున్నా యిప్పుడు నేను

నిర్ణయించుకుని చేసుకోదల్చిన వివాహవార్త విని నన్ను జాతిభ్రష్టగా ఎంచుతారు.

పంతులు:-సరే నీకు ఏయేభాషలు వచ్చు?

విశా:-అరవం తెల్సు, తెలుగువచ్చు. ఈ రెండుభాషలూ వ్రాయను, చదువను, మాట్లాడనుకూడా వచ్చండీ.

పంతులు:-ఇంగ్లీషు?

విశా:-తెలీదండీ.

పంతులు:-కొద్దిగానైనా?

విశా:-బొత్తిగా రాదండీ.

పంతులు:-సంగీతం వచ్చునా?

విశా:-నాది మంచి కంఠమనీ, ఇంపుగా పాడ్తాననీ మా బంధువులు చెప్పేవారు.

పంతులు:-వీణ, ఫిడేలు, హార్మోనియం-మరేదైనా వాయిద్యమొచ్చునా?

విశా:-ఏ వాద్యమూ నేను అభ్యసించలేదండీ.

పంతులు:-తాళం తప్పకుండా పాట పాడగలవా?

విశా:-లయ కొంచెంకూడా తప్పదండీ.

పంతులు:-ఏదీ నీకిష్టమైన పాటొకటి పాడ్తావా మరి?

ఆ సమయంలో వంటింట్లో పని చేసుకుంటున్న పంతులుగారి భార్య-ముసలి ముత్తైదువ-వీళ్ళుండే చోటికివచ్చి, అక్కడుండే మరో కుర్చీలో కూర్చుంది. ఆమెను చూడగానే విశాలాక్షి లేచి నమస్కారం చేసింది. ఆమె ఆశీర్వాదపూర్వకంగా కూర్చోమనిచెప్పి విశాలాక్షి వొడిలోవున్న బిడ్డను తన వొడిలోకి తీసుకుంది.

బిడ్డ 'క్యావ్' మని ఏడుపు మొదలెట్టింది.

పంతులు:-బిడ్డను నాకివ్వు. నేను ఏడవకుండా చూస్తాను.

ఆమె బిడ్డను పంతులుగారి కిచ్చింది. బిడ్డ వారి వొడిలోకి పోగానే ఏడుపు నిలపడమేగాకుండా ముచ్చటగా చిరునవ్వు నవ్వింది.

పంతులుగారి భార్య:-ముసలాయన ఇంకేమీ చేయలేక పోయినా, బిడ్డల్ని ఏడవకుండా లాలించడంలోమాత్రం బహు సమర్థులు.

పంతులు:-అవును, నాకేం తెల్సు? చదువా చట్టుబండలా? నీవున్నావుగా సకలశాస్త్ర కళాప్రవీణురాలవు-అని నవ్వి సుబ్రహ్మణ్యయ్యర్ వ్రాసిన విశాలాక్షి వృత్తాంతాన్ని ఆమెకు వివరించి చెప్పాడు.

పం. భార్య:-పోయినవారం మిమ్మల్ని చూడ్డానికి తంజావూరు డెప్యూటీ కలెక్టరు అయ్యంగారు వచ్చారే, ఆయన తనకొక వితంతువైన యువతిని పెండ్లిచేసుకోవాలని వుందన్నారుగా. ఈమె భర్త చిన్నతనంలోనే పోయారన్నారు గదా. ఆయనకు ఈమెనిచ్చి పెండ్లి చేస్తే...

పంతులు:-అవును, అది చెప్పడానికి మర్చిపోయ్యాను. ఈమెకు పదో ఏటనే ఆ ఘోరం జరిగిందట. అతనుపోయి ఇప్పటికి పదిహేను సంవత్సరాలైందట.

పం. భార్య:-సరే, అట్లయితే డిప్యూటీ కలెక్టరుగారు ఏ ఆక్షేపణ లేకుండా ఈమెను పెండ్లి చేసుకుంటాడు.

పంతులు:-నీవు చెప్పకముందే ఈ జాబు చదవంగానే డిప్యూటీ కలెక్టరు గోపాలయ్యంగార్ నా మనసుకు తట్టాడు. కానీ ఈమె ఆయన్ను వొప్పుకుంటుందా?

పం. భార్య:-ఏం? ఆయనలో ఏమిదోషం కనిపెట్టారు? నిమ్మపండువంటి రంగు, రాజఠీవి, మంచి భారీమనిషి, తలలో నెరుపు చూపలేదు, మంచి వయసు, డిప్యూటీ కలెక్టరుద్యోగం - పూర్వ జన్మలో ఎంతో పూజచేసివుంటేగాని అట్లాంటిభర్త లభించడం కష్టం.

పంతులు:-ఆ గోపాలయ్యంగారిలో నీవు చెప్పిన సలక్షణాలన్నీ వుండొచ్చు, కాదనడం లేదు. కానీ సారాయి త్రాగుతాడు, మాంసం తింటాడు. త్రాగుబోతులో ఎన్ని మంచిగుణాలున్నా అవన్నీ త్వరలోనే నాశనమౌతాయి. వారి భోగభాగ్యాలు సిరిసంపదలు క్షణంలో క్షీణించిపోతాయి.

విశా:-సరేనండీ, వారు నన్ను ఇష్టపడి పెండ్లాడేటట్లు చేయండి. వారి దుర్గుణాల్ని మాన్పించగలననే ధైర్యం నాకుంది.

పంతులు:-త్రాగుడు మాన్పించడానికి బ్రహ్మదేవుడికూడా వశం కాదమ్మా.

విశా:-నాచేత నవుతుందనే అనుకుంటానండీ. సావిత్రి తన భర్తను యమపాశంనుండి విడిపించుకోలేదా? స్త్రీలప్రేమకు సాధ్యం కాంది ఏమీలేదు! నేను వారి మాంసభోజనాన్ని త్వరలోనే మాన్పిస్తాను. మధుసేవను ఒకటి రెండు సంవత్సరాల్లో తప్పించగలను. వారిలో మిగిలినవన్నీ సుగుణాలే నన్నారుగదా. ఈ రెండూ పెద్ద తప్పులుగావు. నేను వార్ని పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా వున్నానండీ.

పంతులు:-అది సరే. పాట వచ్చునంటివే. ఒక కీర్తన పాడు మరి.

విశా:-శ్రుతికి తంబుర వుందాండీ?

పం. భార్య:-హార్మోనియం వుంది-అని అంటూ లోపలకు పోయి మంచి 'మోహన్' పెట్టె తెచ్చింది.

ఆ పెట్టెను ఒడిలో పెట్టుకుని, విశాలాక్షి మొదటిశ్రుతి పెట్టుకుని-'మారుబల్కకున్నా వేమిరా' అనే త్యాగరాజు కీర్తనను పాడడం ప్రారంభించింది, కాలివేళ్లతో తాళం వేసుకుంటూ. సన్నని మధురమైన కంఠం.

అంతట్లోనే ఆ ఇంటివాకిట ఒక మోటారుబండి నిలబడిన శబ్దం వినబడింది. బంట్రోతు ఒక చిటీ తెచ్చి పంతులుగారి కిచ్చాడు.

దాన్నిచూచి పంతులుగారు లేచి తన వొడిలోవున్న చంద్రికను విశాలాక్షి కివ్వబోయారు. అప్పుడే ఆమె ఆ కీర్తనను అనేక స్వర ప్రస్తారాలతో అనుపల్లవి పాడి, మళ్లీ 'మారుబల్క' అనే పల్లవితో పాట ఎత్తుకోబోతుణ్ణింది.

పంతులుగారు బిడ్డను ఇవ్వబోగానే విశాలాక్షి తన వొడిలో వున్న హార్మోనియం పెట్టెను క్రిందబెట్టి చంద్రికను దగ్గరకు తీసుకుంది.

పం. భార్య:-ఏమిటి విశేషం? ఎవరొచ్చారు?

పంతులు:-గోపాలయ్యంగారే వచ్చారు. పండుజారి పాలలోనే పడింది-అని చెప్పి వుత్తరీయం పైన వేసుకుని వాకిట్లోకి వెళ్లారు.

వారు వెళ్ళినతర్వాత—

పం. భార్య:-వాళ్ళిద్దరొస్తే ఏవేవో మాట్లాడుకుంటారు. మనం వంటింట్లోకి పోదాంపద. ఈపూట గోపాలయ్యంగారు ఇక్కడే భోంచేస్తారు. ఆయన పంతులుగార్ని చూడ్డానికివస్తే వొకపూటైనా వారితో భోజనం చేయకుండాపోరు సాధారణంగా. పైగా ఇప్పుడు వారికి శెలవులుకూడా. అందువల్ల మనం భోజనానికి పిలిస్తే కాదంటానికి హేతువేలేదు. నీవుకూడా భోజనానికి ఇక్కడే వుండు. రేప్పోదువుగాని. మేమిద్దరమేగనక వొక పచ్చడి, రసం, అప్పడాలు చేద్దామనుకున్నా. ఇప్పుడు విందు వచ్చింది. నిన్న తెచ్చిన ఎర్రగడ్డలు (వుల్లిపాయలు), పొట్లకాయలు మిగిలున్నాయి. ఎర్రగడ్డల సాంబారు, కొబ్బరి చట్నీ, మైసూరు రసం, పొట్లకాయ వేపుడు, వడలు, పాయసం – ఇవి చాలు యీపూటకు. అప్పడాలు కాస్త జాస్తిగా వేయించాలి. అయ్యంగారికి అప్పడాలంటే అతి వ్యామోహం. సరే, నీవు పొద్దున స్నానం చేసావా? బిడ్డను పనిక్తె దగ్గరివ్వు. ఆడిస్తూ వుంటుంది. కాళ్లు చేతులు కడుక్కుని నాతో వంటకు వస్తావా...

విశా:-అట్లనేనండీ.

ఇద్దరూ వంటింట్లోకి పొయ్యారు. పనిమనిషి బిడ్డను తీసుకొని దొడ్లో చెట్టుదగ్గరికి పోయింది. పెరట్లోని పక్షుల ఆటపాటలుచూస్తూ ఆనందంతో పరవశమై వున్నారు దాసీ, బిడ్డ.

చంద్రికకు ఇప్పుడు మూడేళ్లు. కొంచెంకూడా తడుపుకోకుండా చక్కగా ముద్దుగా మాట్లాడుతుంది. ఆ బిడ్డగొంతు చిన్న బంగారు పిల్లనగ్రోవి సంగీతంలా వుంటుంది.

తోటలోని పక్షులు ఆ బిడ్డ సౌందర్యాన్నిచూచి మోహపడి చుట్టిచుట్టి తిరుగుతున్నాయి. కోకిలలు, పిచ్చికలు, చిలకలు వాటికి తెల్సిన మధురమైన ధ్వనుల్ని ఎన్నుకుని బిడ్డదగ్గరకుచేరి కిలకిల మంటున్నాయి. కోతులు తమకు తెల్సిన గంతుల్ని ఆటల్ని ఆడి ఆ బిడ్డను ఆనందపరుస్తున్నాయి.

చంద్రిక నవ్వడం మొదలుపెట్టి ఆపలేదు. ఆకాశం, సూర్యుడు, మేఘాలు, కాంతులు, చెట్లు చేమలు, లతలు, పూలు, అందమైన పక్షులు– ప్రాతఃకాలంలో వొనగూడిన ఆ మనోజ్ఞమైన దృశ్యంలో, పక్షుల కిలకిలారావాల్లో ఆ బిడ్డ తన్మాయత్వం చెందింది.

ఒక్కొకప్పుడు తన్ను తాను మరచిపోయి ఆకాశంకేసి చూస్తూ చప్పట్లుకొడ్తూ పరవశమై పోతున్నది. ఇంకొకప్పుడు పక్షుల శబ్దాల్ని అనుకరిస్తూ కిలకిలమంటున్నది. పనిమనిషి చంద్రికను గోముగా 'ఒకపాట పాడమ్మా' అంది.

బిడ్డ:–అత్త చెప్పిన 'నందలాల్' పాట పాడనా?

పనిమనిషి:–ఆమె మీ అమ్మకాదా? అత్తా?

బిడ్డ:–అమ్మా నాన్నా నేను పుట్టంగానే పొయ్యారంట. అత్త చెప్పింది–ఆ రాత్రట భూమి వణికిపోయిందంట, పెద్ద గాలంట, జాస్తి వానంట. మా వూళ్లో ఇళ్లన్నీ పడిపొయ్యాయంట, అందరూ చచ్చి పొయ్యారంట. మా ఇల్లుకూడా పడిపొయ్యిందంట. తాత, అవ్వ, అక్కయ్యలు, నాయన అందరూకూడా పొయ్యారంట. అమ్మా–

అత్తవున్న చోటు మాత్తర మే బాగుండిందంట. అప్పుడు నేను మా అమ్మలో వున్నానంట. అవతల నేను పుట్టానంట. ఇదంతా అత్తయ్య చెప్పింది. అత్తయ్యే నాకు ఆవుపాలు, అన్నం పెడ్తుంది.

ఆ బిడ్డ ముద్దుమాటలతో ఐదునిమషాల్లో తన కథంతా చెప్పేసింది. ఆ పలుకుల్లో విరిగినమాట ఒకటికూడా లేదు. నిలిపి నిలిపి మెల్లమెల్లగా ఆలోచించి ఆలోచించి తన జీవితకథ చెప్పింది. అస్పష్టత ఏమీ లేదు. అర్థంగాని పలుకు లేమీలేవు.

ఇట్లా ఆ బిడ్డ ముద్దుగా మాట్లాడుతుంటే ఆ చూపుల్లోను, పెదవుల కదలికల్లోను బుద్ధిసూక్ష్మతను తదేకదృష్టితో చూస్తున్న పనిమనిషి ఆబిడ్డ సౌందర్యంలో అంగాభినయంలో తన్మయత్వంచెంది గాఢాలింగనం చేసుకొని ఆప్యాయంగా చంద్రికను ముద్దుపెట్టుకుంది.

అప్పటికి వుదయం పదకొండు గంటలైంది. గాలి మందంగా వీస్తున్నది. ఆ పనికత్తె చంద్రికను ముద్దుపెట్టుకోవడం ఇద్దరు చూచారు. అందులో ఒకరు ఆమెను ప్రేమించారు.

★

2

4

మోటార్లోనుండి దిగివచ్చిన డిప్యూటీ కలెక్టరుగారికి చేయూతనిచ్చి కుశలప్రశ్న లేస్తూ తనగదిలోకి సాదరంగా పిల్చుకొచ్చి వార్ని కూర్చుండ జేసారు పంతులుగారు. కాఫీ ఫలహారం అందించారు. నేతి చక్కిలాలు షుమారు పది పన్నెండుదాకా శుభ్రంగా ఆరగించి వొక పెద్ద వెండిలోటాతో కాఫీ త్రాగి, అయ్యంగారు 'బ్రేవ్'మంటూ తేపుతూ ఈజీచేర్ లోకి వాలారు. పంతులుగారు వొక పళ్లెంనిండా తాంబూలం, సుగంధద్రవ్యాలు తెచ్చిపెట్టారు. ముక్కాలుగంటలో అయ్యంగారు వాటన్నిట్నీ హూతంచేసి పళ్లెం కాళీచేసారు.

పంతులుగారు వారికొక తెలుగుపత్రిక తెచ్చిచ్చారు. దాన్ని ఆదినుండి ఆఖరుదాకా ప్రకటనలతో సహా వొక్క అక్షరంకూడా త్రోసిపుచ్చకుండా చదివి పూర్తిజేసారు. అయ్యంగారు-సంస్కృతం, ఇంగ్లీషు, తమిళం, తెలుగుభాషల్లో చక్కని పరిచయమున్నవారు. తెలుగుజిల్లాల్లో కొన్నేళ్లు వుద్యోగం చేసినప్పుడు తెలుగును తన మాతృభాషతో సమానంగా అలవర్చుకోగలిగారు.

పత్రిక సాంతం చదివినతర్వాత యిద్దరూ ఇంటిపెరట్లోని తోటలోకివెళ్లి కాసేపు తిరిగివచ్చారు. స్నానాదులు ముగించుకుని భోజనానికి కూర్చున్నారు.

దేవలోకంలోని విందులాగా వంటలపాకం కుదిరింది. పంతులు గారు ఆనందంలో మునకలు వేసారు. ఇంత రుచికరమైన భోజనాన్ని ఆనాటివరకు చవిచూచినట్లు లేదు. పంతులుగారు అయ్యంగారి వైపొకసారి చూసారు, అయ్యంగారు పంతులుగారివైపు చూసారు. ఇద్దరిచూపులు కలిసాయి.

పంతులుగారి భార్య వడ్డిస్తూ వుంది.

పం. భార్య:-ఎవరివంటో తెలుసా?

పంతులు:-పొద్దున వచ్చిన అమ్మాయిచేతి పాక మేనా?

పం. భార్య:-అవును.

పంతులు:-ఆ అమ్మాయి నొకసారి ఇటు రమ్మను. మన అయ్యంగారు ఆమె ముఖలావణ్యాన్నీ, మధురభాషణనూ, బుద్ధి సూక్ష్మతనూ చూడాలి. వంట మాధుర్యం మాత్రమే అనుభవిస్తే చాలదు.

పం. భార్య:-పాపం అమ్మాయికి చాలా తలనొప్పిగా వుంది. చాలాదూరం ప్రయాణంచేసి రావడం, వంటచేయడంవల్ల ఆమెకు శిరోవేదన కల్గినట్లుంది. రాత్రికిగాని ఆమెకు ఆరోగ్యం చేకూరేట్లు లేదు. అప్పుడు చూడవచ్చు వారు.

వాళ్ళిద్దరూ చాలాసేపు భోజనంచేసి చేతులు కడుక్కొని పంతులుగారి గదిలోకివచ్చి కుర్చీల్లో విశ్రమించారు. పంతులుగారి భార్య తాంబూలపళ్లాన్ని మేజాపై పెట్టింది. తాంబూలం వేసుకొంటూ—

పంతులు:-ఇదే స్వర్గం.

పం. భార్య:-ఏది?

పంతులు:-ఇప్పుడు చేసిన భోజనం.

పం. భార్య:-వంటలు రుచిగా వున్నాయా? (గోపాలయ్యంగార్ని చూచి అడిగింది.)

అయ్యంగారు:-అద్భుతంగా వున్నాయి.

ఆ సమయంలో గోపాలయ్యంగారి మనస్సు అంత చక్కగా రుచిగా వంటచేసిన ఆ యువతి సౌందర్యాన్నీ, బుద్ధిసూక్ష్మతనూ, వాజ్మాధుర్యాన్నీ గూర్చి పంతులుగారు చేసిన వర్ణనలమీదికి వెళ్ళింది. నిజంగా అంతటి రూపవతా ఆమె? లేక పంతులుగారు కవీశ్వరులు గనుక తన కల్పనచేతేమైనా అతిగా వర్ణించారా?-అని అనుకున్నాడు.

పంతులుగారు భార్యనుచూచి ఆ అమ్మాయితోకూడా వచ్చిన బిడ్డను యిక్కడకు తీసుక రా-అన్నాడు.

పంతులుగారిభార్య 'అట్లాగే' అంటూ వంటింట్లోకి వెళ్ళింది.

అయ్యంగారు:-ఆ అమ్మాయికీ, ఈ బిడ్డకూ చుట్టరిక మేమిటి?

పంతులు:-ఆ పాప ఆ అమ్మాయి అన్నకూతరవుతుంది. వారి కథ వొక రసవత్తరమైన విషాదగాథ. తర్వాత వివరంగా చెప్తా న్నేండి. ఇప్పుడు ఆ పాపతో మాట్లాడండి. ఆ బిడ్డ నేర్పులు చూస్తుంటే, ఆమె పెద్దదైతే సాక్షాత్తు సరస్వతీస్వరూపంగా ప్రకా శించగలదనే నాకు తోస్తుంది.

ఇంతలో పంతులుగారిభార్య ఆ బిడ్డ నక్కడికి తీసుకో నొచ్చింది.

ఎర్రపట్టు పావడా, అదేరంగు చొక్కా, ఎర్ర రిబ్బను, ఎర్రని తిలకం. లక్ష్మీదేవి విగ్రహంలా వుంది. ఈబిడ్డ విశాలాక్షివయస్సు రాగానే అపరసరస్వతే అవుతుందని పంతులుగారు వర్ణించారు. నవ్వితే రోజాపుష్పం వికసించినట్లున్నది. కాళ్లు చేతులు బంగా రంతో చేసినట్లు సుందరంగా మెరుస్తున్నాయి. ముఖం నిండుచంద్రుడే. పలుకులు గంధర్వులు తమ బంగారువీణలతో వాయించే నాదమని భ్రమ కలుగుతుంది. కదలికలు అప్సరాంగనల అంగాభినయాన్ని స్ఫురింపజేస్తున్నాయి.

ఆ బిడ్డను చూడంగానే-పొద్దున యీ పాపముఖంలో తన ముఖంచేర్చి ముద్దాడి ఆనంద తన్మయత్వంలో వుండిన పనికత్తె సౌందర్యం అయ్యంగారి మనోనేత్రంలో ప్రత్యక్షమైంది.

అయ్యం:-పాపా, నీకు పాటలొచ్చా?

చంద్రిక:-ఊఁ.

అయ్యం:-ఏదీ అయితే వొక పాట పాడు, విందాం.

చంద్రిక:-అత్త నాకు నేర్పించిన 'నందలాల్' పాట పాడేదా?

అయ్యం:-ఆఁ, అదే పాడు.

చంద్రిక పాడ్డం మొదలుపెట్టింది.

నందలాల్ పాట-యదుకుల కాంభోజి రాగం-ఆదితాళం.

సస్ సాసా-సమ్మాపదా-పదదపపమపా-పాపాపనీసదపా-మాగా-

సరిమగరీ-గగరిససా-

పార్క్-మరత్తి లెల్లాం,
నందలాలా నిన్రన్
పచ్చైనిరం తోన్డ్రిదడా
నందలాలా;

కాక్కై శిరగినిలే,
నందలాలా నిన్రన్
కరియవిళి తోన్రిదడా
నందలాలా;

కేట్క్ మొలియిలెల్లాం,
నందలాలా నిన్రన్
గీద మిశైక్కుదడా
నందలాలా;

తీక్క్ విరలై వెత్తాల్,
నందలాలా-నినైన్ద తీన్డు
మిన్బం తోన్డ్రిదడా
నందలాలా. *

---

* పై పాట తాత్పర్యం: చూచే వృక్షాలన్నిట్లో నీ పచ్చదనమే కనపడుతూవుంది. కాకుల రెక్కలలో నీ చూపులోని నల్లదనం వుంది. వినబడే నాదాలన్నిట్లో నీ గీతమే వినవస్తున్నది. విప్పులో వేలుంచినా నిన్నుతాకిన ఆనందానుభవమే కలుగుతున్నది - ఓ నందుని ముద్దు కుమారా!

[ఈ నందలాల్ పాటకు పూతలపట్టు శ్రీరాములరెడ్డిగారు "భారతివారి మధుర కవితా సంహిత"లో చేసిన అనువాదం వక్క-పేజీలో చూడండి.]

చంద్రిక ఈ కీర్తనను మెల్లగా వొక్కొక్క చరణాన్ని రెండేసి సార్లు పాడి, నెరవల్ చేసి, స్వరం తప్పకుండా, లయ చెడకుండా గంధర్వశిశువు గానంచేసినట్లుగా పాడింది. గోపాలయ్యంగారు తన్మయులై పొయ్యారు. వారిజీవితంలో ఇంతటి మధురాతిమధుర మైన సంగీతాన్ని వినలేదు, కల్లోకూడా.

అయ్యం:-ఇదేనండీ స్వర్గం.

పం. భార్య:-ఏ దంటారు?

అయ్యం:-ఈ పాప చేసినగానం.

పం. భార్య:-సంగీతమా? కవిత్వమా? ఈ చిన్నదాని కంఠ మాధుర్యమా? వీటిల్లో ఏది స్వర్గం?

అయ్యం:-అవన్నీ కలిసి స్వర్గంలావుంది. పాప కంఠం దివ్యంగా వుంది. కంఠం మాత్రమేకాదు, ఆ పాడిన బాణీకూడా ఆశ్చర్యంగా వుంది.

పంతు:-ఆ బిడ్డ రూపం, పాటపాడేటప్పుడు చూపినసేర్పు కలిపే చెప్పండి స్వర్గతుల్యమని.

నందబాలా

"కాకి ఎఱక కన్నంతనె నందబాలా
నీకటీవన్నియ కానఁబడును నందబాలా
పచ్చనైన మ్రాకులందు నందబాలా
నీ పచ్చవన్నె కానిపించె నందబాలా
వినుచుండు పలుకులందు నందబాలా
నీ-వేణుగీతి వినఁగవచ్చె నందబాలా
కాఁకయందు కరమునిడఁగ నందబాలా
నిన్ను-తాఁకు ముదము తాఁకుచుండు నందబాలా"

(చూడు- సాహిత్య అకాడమీపక్షంగా విశాలాంధ్ర ప్రచురణాలయంవారు 1961 లో వెలువరించిన "భారతివారి మధుర కవితాసంహిత"—పూతలపట్టు శ్రీరాములరెడ్డి అనువాదం.)

అయ్యం:-అవును అవన్నీ కలిపే.

వీరిట్లా మాట్లాడుతూవుండగా చంద్రిక అక్కణ్ణుంచి తుర్రున ఆడుకోడానికి వెళ్ళిపోయింది. ఆ పాపవెంట పంతులుగారి భార్యా నిష్క్రమించింది.

అయ్యం:-ఈ బిడ్డనుగూర్చి, ఆమె అత్తనుగూర్చి రసవత్తరమైన కథ చెప్తానన్నారే, చెప్తారా?

పంతులుగారు భూకంపంనాటి మొదలు నేటివరకు తనకు తెల్సిన అన్నివిషయాలూ సాంగోపాంగంగా వివరించి చెప్పారు.

అయ్యం:-నాజన్మ సార్థకమైంది.

పంతు:-అదెట్లా అంటారు?

అయ్యం:-ఇట్లాంటి అమ్మాయిని వివాహం చేసుకునేందుకే చాలాకాలంగా ఎదురుచూస్తున్నాను. ఇప్పటికి నా మనోరథం ఈడేరింది.

పంతులుగారు:-ఆహాహా-అని పెద్దగా నవ్వారు.

అయ్యం:-ఏమండీ ఎందుకు నవ్వుతున్నారు?

పంతులు:-అప్పుడే వివాహమైపోయినట్లు మీరు మాట్లాడేస్తున్నారే. అందుకనే నవ్వాను. ఇంతకూ ఆమె మిమ్మల్ని పెండ్లాడేందుకు వొప్పుకుంటుందో లేదో? ఈరాత్రి ఆ అమ్మాయి మనతోనే కల్సి భోంచేస్తుంది. సాధారణంగా మన భారతీయస్త్రీలల్లో కనపడే తెచ్చిపెట్టుకున్న సిగ్గు ఆమెలో కనపడదు. అప్పుడు మీరిద్దరూ పరస్పరం చూచుకుని మాట్లాడుకోవచ్చు. రేపు వుదయం నా భార్య ద్వారా ఆమె మనసు తెల్సుకుంటాను. ఆ అమ్మాయి వొప్పుకుంటే వివాహానికి కావల్సిన సన్నాహాలు చేద్దాం.

అయ్యం:-అట్లయితే ఇవాళ, రేపూ మీ ఇంట్లోనే అతిథిగా వుంటాను. సరేనా. నాకింకేమీ పన్లేదు.

పంతులు:-ఆలాగే కానివ్వండి.

ఆతర్వాత పంతులుగారు సిరాబుడ్డి పేనా తీసుకుని ఏదో గ్రంథ రచనలో నిమగ్నమయ్యారు. గోపాలయ్యంగారు వాలు కుర్చీలో వ్రాలి సుఖంగా సుషుప్తిలో మునిగిపోయారు.

గోపాలయ్యంగారు నిద్రపోతూవున్నారు, వంటింట్లో వనిత లిద్దరూ రాత్రి భోజనాలకు కావల్సిన ఏర్పాట్లనుగూర్చి ప్రస్తావించు కుంటున్నారు. షడ్రసోపేతమైన పెద్ద విందుకు ఏర్పాట్లు జరుగు తున్నాయి. పంతులుగారి భార్య పాకశాస్త్ర ప్రవీణురాలు. విశా లాక్షి ఆమెకన్నా మించిన ప్రతిభావంతురాలు.

గోపాలయ్యంగారు తన వంశమర్యాదల్ని, సంప్రదాయాల్ని వదిలేసిన 'పాషండుడే' అయినా 'బ్రాహ్మణా భోజన ప్రియాః' అనే సూక్తికి వుదాహరణగా వుంటారు.

బ్రాహ్మణుల్ని దూషించేందుకు ఈ సూక్తిని అనేకులు వుప యోగిస్తుంటారు. బ్రాహ్మణులకు భోజనంపై మక్కువ ఎక్కువని యితరులు అంటుంటారు. ఒకొకప్పుడు బ్రాహ్మణులే యీ వాక్యాన్ని తమకు నైజంగా ఏర్పడిన లోపమని చెప్పుకుంటారు. ఇంకొకప్పుడు తమ్ము తామే మెచ్చుకునేందుకు గొప్పగా యీ సామెతను వుపయో గిస్తుంటారు. మరింకొకప్పుడు యితరులనుండి ధనం లాగేందుకు యీ మాటను ప్రస్తావించి ఆర్జన సాగిస్తుంటారు. అయితే 'బ్రాహ్మణా భోజనప్రియాః' అనడం నే నొప్పుకోను. 'సర్వేజనాః భోజనప్రియాః' అనడమే బాగుంటుంది. అందరికీ భోజనంపై ఆశ మెండే. ఆహారం యొక్క పరిమాణం బట్టిచూస్తే-సాధారణబ్రాహ్మణులకన్నా-ఇతరవర్ణస్తులు-క్షత్రియులు, వైశ్యులు తదితరులు అధమపక్షం ప్రతి దినం రెండు మూడింతలు ఎక్కువ భోంచేస్తారనవచ్చు. ఇంగ్లీషువాళ్లు తొమ్మిదింతలు భుజిస్తారు. జర్మన్లు ఇరవై ఏడింతలు.

ఇక ఆహార పాక భేదాలను పరిగణిస్తే బ్రాహ్మణులు ఇత రులు అనే వ్యత్యాసమే లేదు. ధనికులు పక్వంగా చేసి భుజిస్తారు.

పేదలు కొన్నిరకాల పాకాలకే అలవాటుపడి వుంటారు. ఒక్కపూట గంజి త్రాగేందుకుకూడా నోచుకోని పరమ నిరుపేదలున్నారు. మనదేశంలో లక్షలాదిప్రజలు దరిద్రులు. వీళ్లు సంగటి, అంబలి, వొక మిరపకాయ తప్పనిచ్చి ఇంకే ఇతరమైన పక్వపదార్థాల్నీ ఎరుగరు.

హరిజనులు, గిరిజనులు, శూద్రుల్లో అనేకులు ఘోరమైన పరిస్థితిలో వున్నారు. మిగతావారిలోకూడా చాలామంది ఈ బీద స్థితికి దగ్గర్లోనే వున్నారు. బ్రాహ్మణుల్లోకూడా చాలామంది దరిద్ర స్థితిలో మలమల మాడుతున్నారు. పేదబ్రాహ్మణులకు ముఖ్యంగా వైదికులకు వీదో అప్పుడప్పుడూ ఇనాం భోజనాలు లభించే మార్గాలున్నాయి.

...ధనికుల ఇళ్లల్లో కూరలు, పచ్చళ్లు తదితర సాధకాలెన్నో వండుతారు. ఈ సూత్రానికికూడా విధినిషేధాలు చాలావున్నాయి. ఎందుకంటే లోభులైన ధనికుల ఇళ్లల్లో కూరలు కొద్దిగానే వండుతారు. ఇంకా పనేమీలేక సోమరితనంగా జీవించే ధనికులకూ; ధనార్జన-ధనరక్షణలోనే ఆసక్తిచూపే ధనికులకూ జీర్ణశక్తి చాలా మోసంగా వుంటుంది. అందువల్ల ఇట్లాంటి యిళ్లల్లో ఎన్ని పదార్థాలు చేసినా వొకదాన్లోనూ రుచి వుండదు. ఇట్లాంటివాళ్ళను భోజన ప్రియులని చెప్పలేము. అన్నద్వేషులను భోజనప్రియులని ఎట్లా చెప్పడం?

...కానీ ఈయుగంలో విద్యావంతులకు భోజనవిషయాలను గూర్చి అంతగా ఆసక్తిలేదు గనుక సంగ్రహంగా చెప్పుకోవడం మంచిది...ఎట్లా చూచినా బ్రాహ్మణులు భోజనప్రియులని చెప్పి, వారిని సామాన్య మానవజాతినుండి భిన్నమైనగుణం కలవారని చెప్పడం వుచితమైందిగా న్యాయమైందిగా తోచదు. ఇదే నా అభిప్రాయం.

ఇంతకూ అసలు విషయానికొస్తాం. గోపాలయ్యంగారికి జీర్ణ శక్తి ఎక్కువ-భోజనం విషయంలో భీమసేనుణ్ణి తలపుకు తెస్తాడు. భీమసేనుణ్ణి-వృకోదరుడు-అంటే తోడేలుపొట్ట గలవాడు-అంటారు. తోడేలుకు ఆకలెక్కువ. ఎంత తిన్నా దాని ఆకలి అణగదు.

పని చేసేటప్పుడు - ఎక్కువ ఆసక్తితో, వుత్సాహంతో, శాంతంగా సోమరితనం లేకుండా పనిచేస్తే మానవుడు తోడేలు ఆకల్నే పొందగలడు. పని చేయడంలో శ్రద్ధాసక్తుల్ని చూపాలి. ఒకడు తన శక్తినంతా చూపి చేసేపనే పనినిపించుకుంటుంది. కానీ ఏ పని చేసినప్పటికీ ఎంత బలంగా చేసినా దానివల్ల శరీరానికి బడలిక కలగకూడదు. ఊరకే కాసేపు కసరత్ చేయంగానే వళ్ళంతా చెమటలు పట్టేవాడు సమర్థుడు కాడు, ఎంత కసరత్ చేసినా చమట పట్టకుండా లాఘవంగా చేసేవాడే సమర్థు డన్పించుకొంటాడు. సాధారణ మల్లులు చాలామంది దీన్ని అంగీకరించకపోవచ్చు. కానీ నూరు కసరత్లు చేయంగానే దేహమంతా చమటలు పట్టేవాడికన్నా వెయ్యి కసరత్లు చేసినతర్వాత చమటపట్టేవాడు సమర్థుడూ, బలవంతుడూ అని వొప్పుకోవల్సి వుంటుంది.

కసరత్ అయినా, కలం పనైనా, కథలు వ్రాసేదైనా-అన్ని రకాల పనులకీ సిద్ధాంతం వొకటే. ఏమంటే మనస్సు అలిసినతర్వాత శరీరంకూడా అలసిపోతుంది. ప్రశాంతితో పని చేసినప్పుడు శ్రమ అన్పించదు. ఈవిధంగా పనిచేస్తే శరీరంలో నూతన రక్తప్రవాహం ఏర్పడి తేజస్సు, బలం, వుత్సాహం వృద్ధవుతాయి...ఇందులో భీమసేనుడికి వెయ్యిసవర్లు బహుమతిగా యివ్వొచ్చునంటే గోపాలయ్యంగారికి పదిసవర్లివ్వొచ్చు. ఆయన అంతటి ఘటికులు. అందువల్ల పంతులుగా రనుకొన్నట్లు మధుమాంసాదులవల్ల గోపాలయ్యంగారు త్వరగా మరణిస్తారనుకోడానికి వీల్లేదు.

అయ్యంగారు భోజనప్రియుల్లో అగ్రగణ్యులని పంతులుగారి భార్యకు బాగా తెల్సు గనుకనే విశాలాక్షిచూపులనే వలలో గోపా

లయ్యంగారి హృదయమనే జింకను బంధించడానికి అయ్యంగారికి మాంచి షడ్రసోపేతమైన భారీ విందు చేయడమే తగిన సాధనమని భావించి, కోలాహలంగా వంట ప్రారంభించింది.

ముప్పైరకాల కూరలు, పచ్చళ్లు, ముప్పైరీతుల్లో వేయించిన 'వరువల్' అంతా ఆవునేతితో తయారయ్యాయి. నాలుగు విస్తళ్లు వేసి నీళ్లు చల్లిపెట్టారు-చంద్రికకు ఒకటి, విశాలాక్షికి, పంతులుగారికి, అయ్యంగారికి. పంతులుగారి భార్య వడ్డన తీసుకుంది. మొదట పంతులుగారు, అయ్యంగారు వచ్చి కూర్చున్నారు. ఆతర్వాత విశాలాక్షి, చంద్రిక వచ్చారు. వడ్డన ప్రారంభమైంది. కొంతసేపటికి గోపాలయ్యంగారు విశాలాక్షిని చూచి-విశాలాక్షి ఎక్కడ?-అనే వింతప్రశ్న వేసాడు.

ఈమే విశాలాక్షిని ఆయనకు తెలియదు. పనిమనిషిని, బిడ్డను ఒక్కసారిగా తోటలో చూచింది మొదలుగా ఆమే విశాలాక్షినే భ్రాంతిలో వున్నాడు.

విశాలాక్షి:-నేనే విశాలాక్షిని.

అయ్యంగారు:-నీవా విశాలాక్షివి!

విశా:-అవును.

అయ్యం:-మరి పొద్దున తోటలో ఈ పాపతో ఆడుకుంటున్న అమ్మాయెవరు?

విశా:-ఆడుకుంటూ కాదు, పాపను ఆడిస్తూ వుండినమ్మాయి పంతులుగారింట్లో దాసి.

గోపాలయ్యంగారికి పిడుగుపడ్డట్లయింది! పొద్దున తోటలో పనిమనిషి చంద్రికను ముద్దుపెట్టుకున్నప్పుడు ఆ సంవిధానాన్ని ఇద్దరు చూచారనీ అందులో ఒకరు ఆ స్త్రీని ప్రేమించారనీ గడిచిన అధ్యాయంలో చెప్పుకున్నాం. ఆ చూచినవారు పంతులుగారు, గోపాలయ్యంగారు మాత్రమే. ప్రేమించినవారు అయ్యంగారు.

ఆ పనిమనిషి వయస్సు 20 సంవత్సరా లుంటుంది. అందక త్తే. విశాలాక్షి విజ్ఞానం నేర్పూ కలిగిన రూపవతి. పనిమనిషి సౌందర్య మేమో పల్లెటూరు తరహాది. ఇప్పుడు విశాలాక్షిని చూడగా యీమె యెక్కువ సుందరాంగా, లేక దాసీయే అందగత్తా అనే సంశయం కల్గింది డిప్యూటీ కలెక్టరుగారికి.

కండ్లు మూసుకొని మనోనేత్రంలో దాసీ రూపాన్ని తలపుకు తెచ్చుకున్నాడు. తర్వాత కళ్లువిప్పి ప్రత్యక్షంగావున్న విశాలాక్షిని చూచాడు. ఇట్లా రెండు మూడుసార్లు కళ్లు మూసి, తెరచి, పరీక్ష చేసి చూడగా ఆయన మనస్సులో ఎవరు సుందరాంగి అనే నిర్ణ యానికి రాలేకపోయారు. అయినా విశాలాక్షిని పెండ్లాడ్డమే న్యాయ మనే సిద్ధాంతం ఒక్కటీ క్షణం స్ఫురించింది. కానీ ప్రేమబంధమే బలీయంకదా.

ప్రేమ కెదురుగా ఏ శక్తి, ఏ సిద్ధాంతం నిలవగలదు? 'ఓ అయ్యంగార్ ఈ నిర్ణయం స్థిరమైంది. నీ అదృష్టం యింతే. విశా లాక్షిని పెండ్లాడేభాగ్యం నీది కాదు! ప్రేమకు ఎదురుగా ఎవ్వరూ ఏమీ చేయలేరు. దానివేగం చలనం కారుచిచ్చువంటిది. అది మండి భగ్గున చల్లారిపోవాలి. లేదా దైవసంకల్పంచేత పెద్దవానకురిసి చల్లారి పోవాలి. మానవుడు నిళ్లుపోసి చల్లార్చలేడు. అది దుర్ఘటమైన పని.'

భోజనంలో చాలాసేపు గడిచిపోయింది. అనేకవిషయాలపై చర్చలు సాగాయి. కానీ అయ్యంగారి జిహ్వాలో రసగ్రహణశక్తి నశించిపోయింది. ఆ అమృతపాకాన్ని ఆయన రుచిచూడకుండానే మ్రింగేసారు. పంతులుగారి భార్య అనుకొన్నట్లు అయ్యంగారు తన భోజనపాండిత్యాన్ని చూపనేలేదు. సంభాషణలోకూడా ఆయన అంతగా వుత్సాహం చూపలేదు.

చివరకు ఎట్లాగో భోజనం పూర్తయింది. అనంతరం పడుకో బోయేముందు పంతులుగారి గదిలో యిద్దరూ తాంబూలం సేవిం చారు. అప్పుడు అయ్యంగారు పంతులుగారితో:

అయ్యం:-పంతులుగారూ నేను విశాలాక్షిని పెండ్లాడలేను.

పంతులు:-ఏం? ఆమెలో ఏదోషం కనిపెట్టారు?

అయ్యం:-అబ్బే అదేం కాదు, ఆమెలో నేను ఏదోషాన్ని కల్పించగలను? విశాలాక్షి సర్వ శుభలక్షణ శోభితంగానే వుంది. కానీ నా మనస్సులో మరొకరికి స్థానమిచ్చాను. ఆమెకే నా మన స్సర్పించాను.

పంతులు:-అయితే పొద్దున మీరీ విషయం నాతో అనలేదే. అప్పుడు మీరు విశాలాక్షిని స్వీకరించేందుకు సంసిద్ధులన్నారే! మరిప్పుడు హఠాత్తుగా మీ మనస్సు మారిపోయ్యేందుకు కారణ మేమి?

అయ్యం:-ప్రొద్దున నాకు తెలియదు. నా మనస్సును నేను మరొకరికి ధారపోశానన్న విషయం యిప్పుడే తెల్సింది.

పంతులు:-అదెట్లా?

అయ్యం:-పొద్దున పాపచంద్రిక తోటలో ఒకామెతో ఆడుకుంటూ వుండడం చూసాను. ఆ అమ్మాయినే నేను ప్రేమిం చాను. తర్వాత మాటలమధ్యలో, ఆ బిడ్డ అత్తన్నప్పుడు, తోటలో వుండినమ్మాయే ఆమె అని భావించాను. భోజనాలప్పుడు పొరపాటు తెల్సింది. భ్రమ తొలగింది.

పంతులుగారు పెద్దగా నవ్వారు.

పంతులు:-ప్రేమా, పిండాకూడా? అయ్యంగారుస్వామీ, పనిమనిషెక్కడ, పెళ్లెక్కడ? జరిగేపనేనాయిది? మీరు పని మనిషిని ఎట్లా పెండ్లాడ్తారు?

గోపా:-ఆపని అంత కష్టమైనదని నాకు తోచడంలేదు. రేపు వుదయం ఆ అమ్మాయిని పిలిపించి ఆమె అభిప్రాయం తెల్సుకుందాం. ఆ అమ్మాయి యిష్టపడితే వారి బంధువులతో కల్సి మాట్లాడి,

వివాహప్రయత్నం చేస్తే ఒకవారంలో పెండ్లి చేసుకోవచ్చు. ఇందులో శ్రమే లేదు.

పంతులు:-మీవంటి గొప్పవార్ని, గౌరవమైన వున్నతస్థానం గలవార్ని ఆమె పెండ్లాడేందుకు సమ్మతించవచ్చు. వారి బంధువులు కూడా విన్నంతనే సరే అనవచ్చు. కానీ మీరా పనిమనిషిని పెండ్లి చేసుకుంటే ప్రజలేమనుకుంటారు? మీకు చిత్తచాంచల్య మేర్పడిందని అనుకోరూ? మీ గౌరవం చాలా తగ్గిపోదూ?

అయ్యం:-సర్కారువుద్యోగం పోదుగదా? దానికే హానీ రాదుగదా? ఇది ఇంగ్లీషువాళ్ళరాజ్యం. తంజావూరి శరభోజీ* పాలనకాదు. ఒకజాతివారు ఇంకోజాతివార్ని పెండ్లాడేందుకు తెల్లవారి పాలనలో నిషేధంకానీ దండనగానీ లేదు.

పంతులు:-ఆ విషయం నాకు తెలీందికాదు. తమరు పనిమనిషిని పెండ్లాడినంతమాత్రంచేత ప్రభుత్వానికి మీపై అసంతృప్తి ఏర్పడదు. మీ పదవికి ఏమీ భంగంరాదు. కానీ మీ మిత్రులు, మీ సమానోద్యోగులు మిమ్మల్ని నిచంగాచూస్తారు. గొప్పగా బ్రతికినవారికి అప్రతిష్ట మరణంకంటే హీనమైంది - అని శ్రీకృష్ణ భగవానుడి గీతావాక్యం. ఆ అపకీర్తిని తలచి నేను భయపడ్తున్నా.

అయ్యం:-విధవావివాహం చేసుకున్నా బంధుమిత్రులు నన్ను అపకీర్తిపాలు చేస్తారు. దానికి సాహసించిన నేను దీనికి సాహసించడం గొప్పకాదు. చుట్టాలు, మిత్రులు కొంతకాలందాకా దూషిస్తూనే

---

* నాయక రాజుల తర్వాత తంజావూరునేలిన మహారాష్ట్రిరాజుల్లో ఇద్దరు శరభోజీలున్నారు - (శరఫోజీ అనికూడా అంటారు). మొదటి శరభోజీ పరపాలనకాలం: 1712-1728: రెండో శరభోజీది 1798-1833. దేశప్రఖ్యాతమైన తంజావూరు లైబ్రరీకి "తంజావూరు మహారాజ శరభోజీ సరస్వతీ మహల్ పుస్తకభాండాగారం" అని అపరు పేరు. ఆ లైబ్రరీ ముందున్న చలువరాతి విగ్రహం రెండో శరభోజీదని చెప్తారు. శహాజీకాలం (1684-1712) నుండి భద్రపర్చబడిన తెలుగు మొదలైన భాషల్లో లేఖక గ్రంథాలెన్నో ఈ 'కార్థానా'లో దొరుకుతాయి. వాగ్గేయకారులు త్యాగరాజు (1767-1847) ఈ రెండో శరభోజీ కాలంవాడు. మరి వర్ణాంతర వివాహాలపట్ల ఈ శరభోజీల పాలన అంత 'సంప్రదాయబద్ధం'గా వుండేదేమో.

వుంటారు. తర్వాత వారికే విసుగుపుడ్తుంది. ఒకే విషయాన్ని గూర్చి ఎన్నాళ్లు మాట్లాడ్తారు? ఒకేమనిషిని ఎన్నాళ్లు దూషిస్తారు? కాలక్రమాన అన్నీ చక్కబడ్తాయి. నిజమే, జాతిభ్రష్టుణ్ణిగాచేస్తారు. బ్రతికినన్నాళ్లూ బంధువులతో పంక్తిభోజనం చేయలేను. కానీ ఈ పరిస్థితి విశాలాక్షిని పెండ్లాడినా వీర్పడుతుంది. కనుక నేను దాన్ని లెక్కపెట్టడంలేదు. ''లోకోవిశాలః'' మనవారు మనల్ని విడిచి పెట్టినా మిగతావారు మనల్ని వదలరు. ఈ దేశంలో మనవారి జనాభా తక్కువ, మిగతావారే జాస్తి. అందువల్ల ఒకడికి జాతి భ్రష్టతమూలంగా కలిగేనష్టం కొద్దే. ఈ విషయంలో కొత్తదనం పోయి పాతబడంగానే స్నేహితులు యథాపూర్వంగా రాకపోకలు సాగిస్తారు. ఊరివారినోరు మూయడానికి ఒక మూతవుంది. దాని పేరే కాలం. పాతస్నేహితులు కాదన్నా కొత్తస్నేహితులు వస్తారు. ధనమున్నంతదాకా ఒకడికి స్నేహితులు లేరనేలోపం వుండదు. ఇక సర్కారు నౌకరిలో వున్నవారికి స్నేహితులు లేరనేమాటే లేదు.

పంతులు:-అయినా మీరు పనిమనిషిని వివాహమాడడం నాకిష్టంలేదు. జనంలోని అపవాదును లెక్కచేయక మన మనస్సాక్షికి తోచినట్లు నడవడమే ధర్మమని నేనూ ఆమోదిస్తాను. కానీ మీరను కొన్నట్లు యీ వివాహం యుక్తమైంది కాదనేదానికి వేరే కారణాలు చాలావున్నాయి.

అయ్యం:-ఆ కారణాలేమిటో కొంచెం వివరంగా చెప్తారా పంతులుగారూ?

పంతులు:-ఆ పనిమనిషికి ఈషత్ కూడా విద్యాగంధంలేదు. విద్య లేకపోవడమేగాక వుత్తమ కులజులైన కన్యలకుండే సంప్రదాయం, నాగరికత, ఆచారవ్యవహారాలు, ధర్మజ్ఞానం వీళ్లకుండవు. వీటన్నిట్నీ పరిశీలిస్తే ఆ అమ్మాయిని మీరు చేపట్టడం తగనిపనే అని తోస్తున్నది.

అయ్యం:-మంచి విద్యాజ్ఞానం, సదభ్యాసం, చక్కని శీలం, సంగీతజ్ఞానం మొదలైన సలక్షణశోభితురాలైన కన్యనే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాను, కలలుగన్నాను. కానీ అదంతా నిజమైన ప్రేమ నా హృదయంలో పుట్టించకముందు చేసుకున్న నిర్ణయం. ఇప్పుడు మన్మథుడు నా హృదయంలో సింహాసనాసీనుడై వేరేతీరుగా ఆజ్ఞాపిస్తున్నాడు. విద్య ఒక్కటే గొప్పదేంకాదు, శీలం ఒక్కటే వున్నతమైందేంకాదు. ప్రేమ అనేది తనంతతానుమధురమైంది. ప్రేమ ఒక్కటే వీటన్నిటికంటే అత్యంత వున్నతమైంది. మిగిలినవన్నీ తరకలు. అయినా ఇంకాకూడా తక్కువజాతి కన్యలు ధర్మజ్ఞానశూన్యులని అనుకోవడం మంచిదికాదు. అన్ని జాతుల్లోనూ ధర్మాభినివేశమున్న స్త్రీపురుషులుంటారు, దాన్ని వుల్లంఘించేవారూ వుంటారు. కులీనుల నాగరికమూర్ఖాలను తక్కువ కులంలోనివారు త్వరలోనే నేర్చుకోగలరు. ఈ నాగరికతాభ్యాసాలనేవి ధనంచేత, స్థానంచేత కలిగేవి. అవి పరంపరానుగతంగా వుండాలనే నియమంలేదు. అభ్యాసంచేత ఏర్పడేవి. నాతో ఒక సంవత్సరముంటే చాలు ఆ పనిమనిషికి నాగరిక నడతలన్నీ సహజంగా వచ్చేస్తాయి. విద్యకూడా త్వరలోనే అబ్బేటట్లు అన్ని ఏర్పాట్లూ చేస్తాను.

పంతులు:-ప్రపంచపరిజ్ఞానంలేని 14 సంవత్సరాల బాలుడు చెప్పేమాట లివన్నీ. 30 సంవత్సరాలై వున్నతమైన సర్కారు వుద్యోగంలోవుంటూ సకలవిధ లౌకికానుభవాలుండే మీవంటివారు యీరీతిగా వాదించడం నాకు వింతగావుంది. ప్రేమ అనేది మూణ్ణాళ్ల ముచ్చట. కొత్తదనం మాసిపోగానే ప్రేమకూడా మాయమవుతుంది. ఉన్నతమైన విద్యాబుద్ధులచేత సచ్ఛీలంచేత దంపతులమధ్య వీర్పడే అన్యోన్యానురాగమే చిరస్థాయిగా వుంటుంది.

అయ్యం:-మూణ్ణాళ్ళల్లో మారిపోయే ఆవేశాన్ని ప్రేమ అనడం సరిగాదు. అది కేవలం భ్రాంతి. ఆ భ్రాంతికి నా హృదయంలో తావులేదు. ఈ ఆవేశాలూ భ్రాంతులూ కలక్కుండా నా మనస్సును

చక్కదిద్దుకునే వున్నాను. ప్రేమ అనేది దేవలోకంలోని దివ్య వస్తువు. ఇహలోక జీవితం మారినా అది మారదు. సావిత్రి-సత్యవంతులు, లైలా-మజ్ను, రోమియో-జులియెట్‌లు పాటించిన అనురాగాన్నే ప్రేమ అంటారు. అది నశించని నిత్యవస్తువు. హిమాలయా పర్వతం సముద్రంమీద తేలినా ప్రేమ నిష్ఫలమయ్యేదికాదు. ఆ పనిమనిషిపై నాకు అట్లాంటి పవిత్రమైన ప్రేమే కల్గింది.

చెవిటివాని చెవులో శంఖూదినట్లు-అనేకరీతుల్నీ నీతుల్నీ వివరించి, ఆ పనిమనిషిపై అయ్యంగారికి కల్గిన వ్యామోహాన్ని పోగొట్టేందుకు పంతులుగారు సకలవిధాలా ప్రయత్నించారు. పంతులుగారు మాట్లాడుతుండగానే అయ్యంగారు గురకలుపెట్టడం ప్రారంభించాడు. పంతులుగారి ప్రబోధం ఆయనకు రుచించినట్లే లేదు. పంతులుగా రది గ్రహించి-రేపుదయం దీన్నిగూర్చి మరింతగా చర్చించుకుందాం, ఇప్పటికి నిద్రపోదాం-అన్నాడు.

అయ్యం:-అలాగే చేదాం. కానీ మనం నిద్రపోకముందే దయచేసి నాకుకల్గిన సందేహాలను తీర్చండి-ఇంతకూ ఆ పనిమనిషి ఎవరు? ఆమె పేరేమిటి? ఏజాతి? ఆమె తలిదండ్రులు, బంధువులు ఎక్కడున్నారు?

పంతులు:-ఆ అమ్మాయిపేరు మీనాక్షి. వాళ్లు యాదవులు. బంధువులసంగతి నాకంతగా తెలియదు. అరెరే! అసలు మన మొక ముఖ్యవిషయాన్ని పరిశీలించలేదే. ఒకవేళ ఆ అమ్మాయికి యిప్పటికే వివాహమైందేమో?

అయ్యం:-దాన్నిగూర్చిన సంశయం మీ కెక్కల్లేదు. పొద్దున ఆమె కంఠాన్ని పరిశీలించి చూసాను. మెళ్లో మంగళసూత్రం లేదు.

పంతులు:-మాంగళ్యం ఎొకవేళ రవికచాటున వుండివుండవచ్చు. మీ చూపుల కది కనపడివుండక పోవచ్చుగదా.

అయ్యం:-ఆ విషయంలోకూడా మీకు యోచన పట్లేదు. కామానికి కళ్లు లేవని కొందరు తప్పుడు సామెత సృష్టించారు.

ప్రేమకు వాడిగలిగిన చూపులున్నాయి. నేను జాగ్రత్తగానే పరిశీలించాను. పుస్తి లేదనేది నిశ్చయం. ఆ అమ్మాయి నిస్సందేహంగా అవివాహిత. ఆమె ముఖం చూడంగానే పెళ్లి కాలేదనేవిషయం స్పష్టమైంది. ఈ విషయంలో నాకు అనుభవం జాస్తి. ఒక స్త్రీ ముఖాన్ని చూడంగానే ఆమె కన్యయిందీ, వివాహితైందీ తెల్సిపోతుంది. అది అట్లా వుండనీండి. ఆమె బంధువు లెక్కడున్నారో తెలియకపోయినా ఆమె యితరవృత్తాంతాలు మీ కింకేమి తెల్సో నాకొంచెం చెప్పండి.

పంతులు:-ఆమె పూర్వోత్తరా లేమీ నాకు తెలీవు. పైగా నా సొంత పనిమనిషికూడా కాదు. ఈ వీధిలోనే నాలుగైదిళ్ళ తర్వాత నా మిత్రుడు వెంకటాచలనాయుడుగా రున్నారు. వారు బ్రహ్మసమాజికులు. ఈ యింటి యజమానికూడా వారే. ఈ పని మనిషి వారింట్లో పని చేస్తుణ్ణింది మొదట. ఇక్కడ మేము బస కుదుర్చుకున్నాక, నా భార్యకు కాస్త సహాయంగా ఇంటిపన్లు చేస్తూ చేదోడువాదోడుగా వుండేందుకు నాయుడుగారు యీ అమ్మాయి నిక్కడికి పంపిచ్చారు. మేము రాజమహేంద్రవరం పోయ్యేటప్పుడు యీ అమ్మాయి మళ్ళీ నాయుడుగారింటికి పోతుంది.

అయ్యం:-రేపుదయం నేను నాయుడుగార్ని కల్సుకోవాలి. ఆయన యిక్కడికి వస్తారా లేక మనమే అక్కడికి పోదామా?

పంతులు:-మనం పోనక్కర్లేదు. వార్నే యిక్కడకు పిలిపిస్తాను. ఏమైనాసరే ఈ పనిమనిషిని మీరు పెళ్ళిచేసుకునే వుద్దేశం మార్చుకోవడం బాగుంటుంది.

అయ్యం:-ఏదెట్లయినా రేప్పొద్దున్నే నాయుడుగార్ని పిలిపించండి. మిగతావిషయాలు తర్వాత మాట్లాడుకుందాం.

పడుకునేముందు పంతులుగారు-తనకు, అయ్యంగారికీ మధ్య జరిగిన సంభాషణంతా తనభార్యకు వివరించి చెప్పారు.

మర్నాడుదయం పంతులుగారిభార్య విశాలాక్షికి అంతా చెప్పింది. విశాలాక్షి పంతులుగారిభార్యకు సాష్టాంగ నమస్కారం చేసి-'ఇది పోతే పోనియ్యండి. వేరే తగిన వరుణ్ణిచూచి మీరే నాకు వివాహం చెయ్యాలి. అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ'-అన్నది.

పంతులు భార్య:-దిగులు పడబాకమ్మా. నీకేవమ్మా చక్కని వరుడు లభిస్తాడు. నీ గుణానికి శీలానికి రూపానికి రాజులాంటి భర్త లభిస్తాడు. నీ పెళ్లి నేను జరిపిస్తాను.

★

5

వుర్నాడుదయం పంతులుగా రొక మనిషిని పంపి వెంకటాచల నాయుడుగార్ని యింటికి పిలిపించారు. నాయుడు, పంతులు, అయ్యంగారూ-ముగ్గురూ వొక చోట చేరి చర్చించుకున్నారు. పంతులు గారి మాదిరే నాయుడుగారుకూడా-అయ్యంగారు పనిమనిషి మీనాక్షిని పెండ్లి చేసుకోవడం వుచితంకాదనీ, విశాలాక్షిని వివాహం చేసుకోవడమే మంచిదనీ సలహాయిచ్చారు. అయ్యంగారి మనస్సు లోకి అవేమీ ఎక్కనేలేదు.

స్వలాభానికి అనుకూలంగా వుండే హేతువాదాల్నే అంగీకరించడం, వాటినే యితరులకుకూడా వివరించి చెప్పడం మానవ సహజలక్షణం. తమ సుఖానికి అడ్డుగావుండే న్యాయాలను ధర్మాలనూ సాధారణంగా త్రోసిపుచ్చి తమ కనుకూలమైన న్యాయ సూత్రాలకోసం అన్వేషించ ప్రయత్నించడం మానవస్వభావం.

న్యాయశాస్త్రమనేది-వాది, ప్రతివాదుల వాదాలకు అవకాశ మిస్తూ వుంటుంది. తిరువాన్మూర్‌లో మునుపు ధర్మసంకటం శంకరయ్యర్ అనే న్యాయాధిపతి వుండేవారు. ఆయన విచారణచేసే దావాల్లో ఏపార్టీ చెప్పేది న్యాయమని తెలుసుకోలేక మనసులో సంకటపడ్తూ వుండేవారట. న్యాయం ధర్మం ఏ వేట్లోనైనా కల్సి పోయినా ఏదో తనయిష్టం వచ్చినట్లు తీర్పు చెప్పేవాడుకూడా కాదట. ఎట్లాగైనా నిజాన్ని కనుక్కొని, ధర్మోద్ధరణ చెయ్యాలనేది వారి సిద్ధాంతం. వాది చెప్పేదివింటే వాదిపక్షమే నిజమని తోస్తుండేది వారికి; ప్రతివాది పక్షాన్నికూడా వింటే అతనివైపూ సత్యం వుందని తోచేదట. నేనిప్పుడు ఎవరికి న్యాయం చేకూర్చాలీ-అని తనమిత్రులతో చెప్పుకుని బాధపడ్తూ వుండేవాడట. అందువల్ల మిత్రులు ఆయనకు 'ధర్మసంకటం' శంకరయ్యర్ అని పేరుపెట్టి పిల్చేవారట.

ఈ ప్రపంచంలో న్యాయస్థానాల్లోకి వచ్చే కేసుల్లో నేగాకుండా మామూలు సాంఘిక మతవ్యవహారాల్లోనూ మధ్యవర్తిగా నిలబడి నిజాన్ని ధర్మాన్ని వుద్ధరించడం అనేది దుస్సాధ్యమైనపని. తపోజ్ఞాన పరిపాకం గలిగిన పెద్దలే సత్యాన్నీ ధర్మాన్నీ పక్షపాతం లేకుండా నిస్సంశయాత్మకంగా నిర్ణయించగలరు. ఇక మిగిలిన నిర్ణయాలన్నీ సంపన్నులకూ బలంగలిగిన వర్గాలకూ అనుకూల మవుతుంటాయి.

పాయ్యాడె యొరువన్ సొల్వణ్ మైయినాల్
మెయ్‌పోలుమ్మే మెయ్‌పోలుమ్మే
మెయ్యాడె యొరువన్ సొల్లమాట్టా మైయాల్
పాయ్‌పోలుంమ్మే పాయ్‌పోలుంమ్మే.*

ఈవిధమైన మాటల చాతుర్యమేగాక సంఘబలం, భుజబలం, ధనబలం మొదలైన బలాలన్నీ న్యాయమనే త్రాసును తమవైపుకు మళ్లించుకోగల్గుతున్నాయి మన సమాజంలో.

అయ్యంగారు – తనకున్న విద్యావాదపటిమచేత, తన మనస్సులోవున్న ప్రేమబలంచేత నాయుడుగార్నీ పంతులుగార్నీ తనవైపుకు సులభంగానే మళ్లించుకోగల్గాడు.

అయ్యంగారు నాయుడుగారిద్వారా మీనాక్షి కులగోత్రాదులను తెలుసుకున్నాడు. ఆ అమ్మాయి యాదవపడుచనీ, ఆమెతండ్రి ఆ వూళ్లోనే పక్క-వీధిలో కాపురముంటూ పాలమ్ముకుని జీవించేవాడనీ, ఇద్దరు అన్నలున్నారనీ, వా రేదో కర్మాగారంలో పనిచేస్తూ చెరి 15 రూపాయలు నెలజీతాలు తెచ్చుకుంటారనీ, ఆమెకు తల్లి లేదనీ, వదినలిద్దరూ వంటపనులు చేస్తుండడంవల్ల మీనాక్షికి స్వంత ఇంట్లో పెద్దపనులేమీలేవనీ, తమ ఇంట్లోకూడా బిడ్డల్ను చూచుకోవడం సామాన్లుతేవడం మొదలైనపనులే చేస్తుంటుందనీ, ఇల్లు చిమ్మడం అంట్లుతోమడం ఆమెచేయదనీ, కైస్తవబల్లో చదివి

---

* తనమాటల నేర్పుచేత అసత్యాన్ని సత్యంగా నిరూపిస్తాడు మాటకారి. వాగ్నైపుణ్యం లేనివాడుమాత్రం సత్యాన్ని అబద్ధంగా చేస్తున్నాడు-అని ఈ చరణాలకు అర్థం.

అరవం నేర్చుకున్నదనీ, ఇంపుగామాట్లాడ్డం వినయవిధేయతలతో మెలగడం ఇంగితమెరిగి నడుచుకోవడం మొదలైన సద్గుణాలన్నీ వున్నాయనీ, ఆమెకు నెలజీతం 12 రూపాయలనీ, ఆ ధనాన్ని తండ్రి కివ్వకుండా మాసి మాణిక్యం శెట్టిగారంగట్లో వడ్డికిస్తుందనీ, ఆమె వయస్సు 20 సంవత్సరాలనీ, యింకా పెళ్ళికాలేదనీ, వివాహం చేసుకోవాలనే ఆసక్తితోవుందనీ నాయుడుగారు చెప్పారు.

గోపాల:-ఇంతకూ ఆ అమ్మాయి తండ్రిపేరేమిటంటారు? ఆయన ఇప్పుడింట్లో వుంటూడంటారా?

నాయుడు:-సుబ్బుసామి కోనార్.* ఇప్పుడెత్తే బహుశా యింట్లోనే వుండొచ్చు.

గోపాలయ్యంగారి ప్రార్థన నంగీకరించి నాయుడుగారితోబాటు వీరేశలింగంగారుకూడా బయలుదేరి పక్క-వీధిలోవున్న సుబ్బుసామి కోనార్ ఇల్లు చేరారు. కోనార్ అప్పుడే చద్దన్నంతిని తాంబూలం వేసుకొని పొగాకు నములుతున్నాడు.

నాయుడుగార్నీ, వారిమిత్రుల్నీ చూడగానే లేచినమస్కారం చేసి లోపలనుండి వొకబెంచి తెచ్చేసాడు. ముగ్గురూ కూర్చున్నారు. నాయుడుగారు తాము వచ్చిన విషయంగూర్చి వివరంగా చెప్పాడు.

మంచి ఎర్రనైన సుందరమైనముఖం, నల్లనైన వుంగరాలు తిరిగినజుట్టు, విశాలమైన స్ఫురద్రూపమైన చూపులు, అందమైన మీసపుకట్టు, బలసిన భుజాలు, రవ్వలబొత్తాసులున్న షర్టు, బంగారు గడియారం ధరించివున్న డిప్యూటీ కలెక్టరు గోపాలయ్యంగారు తన అల్లుడు కాగోరి వచ్చినందుకు కోనార్ ఆశ్చర్యపరవశుడైనాడు: హృదయంలో ఆనందం వుప్పొంగింది. అయినా బ్రాహ్మణునికి తన కూతుర్నిస్తే పాపం వస్తుందనే భయం అతన్లో ఆవహించింది.

---

* కోనార్ అనేది యాదవ పౌరుషనామం. శ్రీకృష్ణుణ్ణి పెంచిన నందుణ్ణి ద్రవిడంలో-పెరియకోనార్ అంటారు-అంటే పెద్దయాదవుడు.

కోనార్:-నేనేం చెయ్యగల్ను? ముసలివాణ్ణి, ఈ వయసులో నాకాఁవల్సిందేముంది? నాకిప్పుడిక మిగిలుండేది పరలోకచింత వొకటే. శ్రీమన్నారాయణమూర్తినీ, ఎంబెరుమానార్నీ, ఆళ్వారుల్నీ, శ్రీవైష్ణవ భాగవతోత్తముల్నీ శరణాగతి చేసివున్నాను. వారి నామస్మరణచేసుకుంటూ నాచేతనైనంత సేవలో జీవితశేషాన్ని గడుపుతున్నా, శాస్త్రాలపైన నాకు విశ్వాసంవుంది. శూద్రుణ్ణయిన నేను బ్రాహ్మలకు పిల్లనిస్తే నాకు పాపంరాదా? కాబట్టి నేనీ సంబంధానికి అయిష్టం చూపక తప్పడంలేదు.

గోపాల:-కోనార్ గారూ నేను బ్రాహ్మణుణ్ణికాను. బ్రాహ్మణులకు విహితమైన ఆచార అనుష్ఠానాదులను నేనాఁడో పరిత్యజించి శూద్రుణ్ణయ్యాను. అందుచేత నన్ను మీవాణ్ణిగానే భావించి మీ అమ్మాయినిచ్చి పెండ్లిచేయమని కోరుకుంటున్నాను. పైగా సదాచారపరుడైన బ్రాహ్మణుడు తన కులంలోనివారిని మాత్రమేగాక ఇతర వర్ణాల కన్యలనుసైతం పెండ్లాడవచ్చునని శాస్త్రం చెప్తున్నది. ఈ విషయంలో మీకేమైనా సందేహముంటే అరవంలో అర్థం బ్రాసున్న మనుస్మృతి వుంది తీసుకుని మీరే చదవండి. మీకు అరవం చదవను వస్తుందోరాదో, వస్తే నేనుచెప్పింది నిజమని ప్రత్యక్షంగా మీరే కనుగొనగలరు. ఇందులో పాపపు పననేదే లేదు.

నాయుడు:-అవును, శాస్త్రం అట్లాగే వుంది.

పంతులు:-అవునవును, మనుస్మృతి సిద్ధాంతం అంతే.

కోనార్:-అయితే మరి లోకంలో యీ పద్ధతి ఆచారంగా లేదెందువల్ల?

గోపాల:-మనదేశంలో ప్రాచీన శాస్త్రాలకు సంప్రదాయాలకు విరుద్ధమైన ఆచారవ్యవహారాలు సంఘంలో కొన్ని నిల్చివున్నాయి.

అందులో ఇట్లాంటిపెండ్లి ఒకటి. కాబట్టి నేటి ఆచారవ్యవహారాలు ప్రమాణాలుకావు. అతి ప్రాచీన ఆచారాలే ప్రమాణాలూ, ఆచరణ యోగ్యాలు.

నాయుడు:-కోనార్, విను. ఈ పాపం గీపం అనేవి వట్టి బూటకాలు-ఈ వివాహం అక్షరాలా శాస్త్రోక్తమైందే. ఇందులో పాప మనే మాటేలేదు. అధవా వున్నదనుకుంటే అది వధూవరులకు చెందుతుంది, తండ్రివిగాబట్టి నీకేమీ అంటదు. అట్లాగాక మీకూ పాపం వస్తుందనేవుంటే, దాన్ని పోగొట్టే ప్రాయశ్చిత్తాలు బోలెడున్నాయి. పెరుమాళ్ కోవిలలో ఒక వుభయంచేస్తే అంతా పోతుంది. ఆ వుభయంలో పెరుమాళ్లు ఆరగించిన పప్పు పొంగల్‌తో పాపాలన్నీ పటాపంచలై పోతాయి. మీకు ఎంతధనం కావాలన్నా వీ రిస్తారు.

పణం అనగానే ఎంత పీనుగైనా లేచొస్తుందని సామెత. కోనార్ ఆవులించినట్లుగా నోరు తెరిచాడు.

కోనార్:-నాకు కొన్ని ఋణబాధలున్నాయి. అవి తీరిస్తే మంచిది.

గోపాల:-ఆ ఋణం ఎంత ?

కోనార్:-ఒక వెయ్యిరూపాయలు అప్పుంది.

గోపాల:-మూడువేల రూపాయలిస్తాను. చాలా ?

కోనార్:-ఓ, చాలు, చాలు. ఈ వారంలోనే పెండ్లిచేసేస్తాం.

గోపాల:-మీనాన్నగారినికూడా పిలిపించి ఆమె అభిప్రాయం కనుక్కోండి.

కోనార్:-అమ్మాయి ఇప్పుడు ఇంట్లోలేదు, నేను చెప్తాన్లేండి. చిన్నది దానికేం తెల్సు? చిన్ననాటినుండి నామాట కాదన్న

ఆడపడుచుకాదు. ఇప్పుడు ఇంత ఘనమైనసంబంధం వచ్చినప్పుడు నామాటను కాదననే కాదనదు.

గోపాల:-దేనికైనా మంచిది, ఆమెను పిలిపించి కనుక్కుంటే గానీ నా మనస్సు కుదుటపడదు. మే మిక్కడే కూర్చొని వుంటాము, మనిషినిపంపించి పిలిపించండి.

అట్లనే మనిషినిపంపి కోనార్ కూతుర్ని పిలిపించాడు. మీనాక్షి వచ్చింది. ఆమెను కాస్తదూరంగా పిలుచుకోపోయి విషయం చెప్పాడు. వరుడి విద్యను, సిరిసంపదల్ని, పదవుల్ని గూర్చి చాలా గొప్పగా పొగిడాడు. అతని సౌందర్యాన్ని చూడమని ఆమెకు అయ్యంగార్ని చూపాడు.

ఆమె పెండ్లికి వొప్పుకుంది.

కొంతసేపటికి కూతుర్ని పిల్చుకుని కోనార్ వాకిటి అరుగు దగ్గరకు వచ్చాడు.

ఆమె చూపుల్ని అయ్యంగారు చూచాడు. ఆమెకూడా చూచింది. కన్నుకన్ను కలిస్తే నోటిమాటల్తో పన్లేదన్నారు. ఆమెను చూడంగానే తన్ను పెండ్లాడేందుకు ఇష్టపడిందని అయ్యంగారికి అర్థమైపోయింది. అయినా వాచా తెల్సుకోవాలనే కోర్కెకల్గి కోనార్తో-మీనాక్షి ఏమిచెప్పింది-అన్నాడు.

కోనార్:-అమ్మాయిని మీరే అడిగి తెల్సుకోండి.

గోపాల:-ఏమి మీనాక్షీ ఏం చెప్తావ్, నన్ను పెండ్లి చేసుకోవడం నీ కిష్టమేనా?

మీనాక్షి ముంచుకొచ్చే సిగ్గుతో తలవంచుకునే 'ఆఁ' అని మెల్లగా అంది.

అయ్యంగారికి ప్రాణం వచ్చినట్లైంది. ఆయన ముఖంలో ఆనందం తొణికిసలాడింది.

ఆ వారంలోనే వా రిద్దరూ బ్రహ్మసమాజంలో చేరారు. చెన్న పట్నంలోని బ్రహ్మసమాజ మందిరంలో బ్రహ్మసమాజ శాస్త్రో క్తంగా వాళ్లిద్దరికీ పెళ్లి జరిగిపోయింది. గోపాలయ్యంగారు భార్యను పిల్చుకుని తంజావూరు వెళ్లి వుద్యోగంలో చేరాడు.

★

6

గోపాలయ్యంగారికి తనను పెండ్లాడ్డం యిష్టంలేదనే విషయం తెలియంగానే విశాలాక్షి పంతులుగారి భార్యతో తనగోడు వెళ్లబుచ్చుకుని వేరే మంచి సంబంధమొకటి చూడవల్సిందని అతి దీనంగా ప్రాధేయపడింది.

పం. భార్య:-నీవు మాతో ఇక్కడే 10-15 రోజులుండు. ఇంకొన్ని దినాలదాకా పంతులుగారు అయ్యంగారి పెండ్లిలో మునిగి పోయి వుంటారు. నీసంగతి పట్టించుకునేందుకు అవకాశముండదు. తర్వాత మేము రాజమహేంద్రవరం వెళ్తాం. నీవూ మాతోరా. నీ కెట్లయినా మంచి సంబంధమే చూస్తాంలేమ్మా. తొందరపడ్తే పనవుతుందా? కొంతకాలం ఓర్పుగా ప్రయత్నం చెయ్యాలగదా.

విశాలాక్షి:-మైలాపూర్‌లో మా మామగారి కూతురుంది. ఆమెభర్త హైకోర్టులో వకీలువుద్యోగం చేస్తున్నారు. పంతులుగారు అయ్యంగారి పెండ్లిపనులు చేస్తుంటే నేనిక్కడ వూరకే వుండేం చేస్తాను? ఈపదిరోజులూ నేను మైలాపూరులో వుండివస్తాను. ఆ తర్వాత కల్సుకుంటాను.

ఇద్దరూకల్సి పంతులుగారితో యీ విషయమే చెప్పారు. పంతులుగారు విశాలాక్షి కోర్కెను కాదనేందుకు నోరురాక మైలాపూరులో పదిరోజు లుండిరావచ్చునీ, ఇంతలో అవసరం యేర్పడితే మాత్రం మైలాపూరుకు జాబువ్రాసి పిలిపిస్తామనీ చెప్పాడు.

పంతులు:-మైలాపూర్‌లో మీ బంధువు లెవ్వరమ్మా?

విశా:-మా మామగారి కూతురు లజ్‌చర్చిరోడ్డులో వుంది. భర్తపేరు సోమనాథయ్యరు. అయితే మా మామకూతురు, ఆమె భర్త, వారితల్లి అంతా సనాతన సంప్రదాయపరులు. నేను మళ్లీ

వివాహం చేసుకోవడం వాళ్లకు సమ్మతం కాకపోవచ్చు. ముందుగా నేను పెళ్లి చేసుకోబోతున్నట్లు వాళ్లకు తెలియకపోవడమే మంచిది. అందువల్ల నేనున్నచోటికి మనిషినిగానీ జాబుగానీ పంపకండి దయచేసి. ఫలానా తేదికి ఇక్కడకు రావాలని ఇప్పుడేచెప్తే ఆనాటికి నేనే వస్తాను. ఇంతలో నన్ను మర్చిపోకుండా నా విషయంలో తమరు కాస్త శ్రద్ధవహించాల్సిందిగా కోరుకుంటున్నాను.

పంతులు:-నిన్ను మర్చిపోవడమనే మాటే వుండదమ్మా. నీ పెళ్లివిషయం నా బుర్రలో మెదుల్తూనే వుంటుంది. ఆ విషయమై దిగులుపడకు. జనవరి 25 తేది నేను రాజమహేంద్రవరం వెళ్తాను. నీవు జనవరి 18 కల్లా ఇక్కడకురా.

విశా:-తామిక్కడ వున్నప్పుడే ఓక మంచిసంబంధం చూడ్డం బాగుంటుందండీ. ఇది రాజధాని నగరం. ఇక్కడ లభించని మనువు దూరంగావుండే గోదావరి తీరంలో లభిస్తుందా ?

పంతులు:-అట్లాకాదమ్మా. నే నెక్కడున్నా - ఇక్కడున్నా, రాజమహేంద్రవరంలోవున్నా-ఓకటే. ఈ విషయంలో ఆసక్తితో పనిచేసేమిత్రులు చాలామంది వున్నారు. వాళ్లందరికీ జాబులు వ్రాస్తాను. వాళ్లా విషయాన్నాలోచించి ప్రయత్నించి నాకు కబురంపుతారు. పత్రికల్లోకూడా ప్రకటన చేస్తాను.

విశా:-పత్రికల్లో ప్రకటించేటప్పుడు దయచేసి నా పేరు వేయకండి.

పంతులు:-అట్లనేనమ్మా. నీ పేరులేకుండా సాధారణంగానే వేస్తాను. ఈ అయ్యంగారి వివాహం ఇంకో వారంరోజుల్లో అయిపోతుంది. ఆ తర్వాత నీపనికే ప్రాధాన్యతిచ్చి వేరే పనేదీ పెట్టుకోను. ఎంతకష్టమైనా నీ ఆశయం నెరవేరుస్తాను. ఏదిగులూ పెట్టుకోవద్దు.

విశా:-అట్లయితే నన్ను జనవరి 18 న రమ్మంటారు.

బంగళా బాడుకుకు తీసుకుని అందులోవుంటూ మద్రాసులో వకీలువుద్యోగం చేస్తూన్నాడు.

ఇప్పుడు చాలాకాలం తర్వాత విశాలాక్షి ముత్తమ్మలు కలుసుకోవడంతో ఆనందపరవశులైపోయారు. ముత్తమ్మకు ఇప్పుడు పాతికేళ్లు. ముగ్గురు మగబిడ్డలు. పెద్దపిల్లవాడికి తొమ్మిదేళ్లు – పేరు రామనాథం, రెండోకొడుకు రామకృష్ణన్‌కు ఆరేళ్లు, మూడోవాడు అనంతకృష్ణుడికి మూడేళ్లు.

ఇంట్లో ముత్తమ్మవాళ్ళతో అత్తగారొక్కతే వుంటున్నది. ఆమె వృద్ధవితంతువు. 60 ఏళ్ళ వయస్సు. పేరు రామవ్వ. ఆమెకు టియో లేక కాసో (దగ్గు) ఎప్పుడూ దగ్గుతూనేవుంటుంది. కానీ తొందరగా చంపే రోగంమాత్రం కాదు. రోగిని చాలాకాలం ప్రాణాలతోవుంచి బాధించి మృత్యువాత పడేస్తుంది. రాత్రి 7 గంట లైతేచాలు రామవ్వదగ్గు ఎక్కువౌతుంది. అర్ధరాత్రిదాటి వేకువ జాముదాకా మహాభయంకరంగా దగ్గుతూనే వుంటుంది. ఆ దగ్గు వింటేచాలు ప్రాణం తోడేస్తున్నట్లుంటుంది. కానీ రామవ్వ గడిచిన 30 ఏళ్లుగా ఇదేమాదిరి దగ్గుతూనే జీవించింది; ఆవగింజంతకూడా చలించినట్లులేదు.

***

విశాలాక్షి సోమనాథయ్యర్ గారింటికొచ్చి కొన్నాళ్ళయింది. ఆనాడు ఏకాదశి. రామవ్వ ఆరోజు భోంచెయ్యకుండా వుపవాసం వుణ్ణింది. అలవాటుప్రకారం ఆరాత్రి ఆమె దగ్గలేకపోయింది. అలసి సొలసి నిద్రపోయింది. ఆమిద్దె ఇంట్లో క్రిందవరండాలో వొక మూలగా పడుకొంది–దగ్గరే వొకదీపం, మంచంకింద వొక రాజేకుంపటి, మంచం రెండుప్రక్కలా రెండు కుర్చీల్లో దొర్లిపోకుండా వుండేటట్లు చెక్కలు ఆనించబడి వున్నాయి. అక్కడికి పడమటగా మూడు గదులుదాటి నాలుగోగదిలో వొక మంచంమీద విశాలాక్షి పడుకొంది.

ు మంచానికి దగ్గరగా, మంచంకంటే కాస్త ఎత్తుగావున్న వొక కుర్చీమీద దీపం వెలుగుతూవుంది. ఆమె చదువుతుండిన నవల చేతుల్లోంచి జారి పరుపుపైన పడివుంది. ఆమె నల్లని పొడవైనజుట్టు తెల్లని దిండుపై పడివుండడంచూస్తే హిమాలయంమీద నల్లనిమేఘం ఆవరించినట్లుంది. విశాలాక్షి వితంతువైనా కేశఖండనం చేసుకోలేదు. ఆమె వొదిన చనిపోయేటప్పుడు – ఒసే విశాలాక్షీ నువ్వెట్లయినా మళ్లీ పెళ్లిచేసుకో-అని చెప్పిపోయిన మాటల్లో దృఢ విశ్వాసం వుంచడంచేతా, ఆకస్మికంగా వచ్చిన భయంకరమైన భూకంప ప్రళయంలోకూడా తానుబ్రతికి బయట పడగల్గినందువల్ల యేర్పడిన మొండిధైర్యంతో ఆమెజుట్టును పెంచడం మొదలుపెట్టింది. పెరిగిన జుట్టుతో తన మరొక మేనమామగారింట్లో చంద్రికతోబాటుగా వొకటి రెండు సంవత్సరాలపాటు నాంగనోరులో వుండింది. ఆ వూళ్లోని బ్రాహ్మణశ్రేష్ఠులు ఆమెమీద ఘోరమైన అభాండాలు వేయడం ప్రారంభించారు. ఆ తిట్లు వినలేక ఆమె ఆ వూరువదిలి తీర్థ యాత్రలు చేస్తూ చెన్నపట్టణం చేరింది.

విశాలాక్షి చెన్నపట్టణం బయలుదేరేముందు మేనమామ గారితో ఇట్లా ప్రాధేయపడింది.

విశాలాక్షి:-ఈ వూళ్లో యీ అపవాద దూషణలను వినలేకున్నాను మామా. నేను కాశీకిపోయి గంగాస్నానంచేసి ఆ తీర్థంలో తపస్సు చేసుకుంటూ నా జీవితాన్ని వెళ్లబుచ్చుకుంటాను. దారి ఖర్చుకు కొంచెం డబ్బిప్పించండి చాలు. అక్కడ బిచ్చమెత్తుకుని యీ బాలచంద్రికను రక్షించుకుంటూ కాలం గడుపుకుంటాను.

మేనమామ:-ఈ పాప పెండ్లిచేసుకునే ఈడు కొచ్చినప్పుడేం చేస్తావు మరి ?

విశాలాక్షి:-అక్కడ మనదేశపు బ్రాహ్మణులు బోలెడంత మంది వుంటారు. యాత్రార్థం ప్రతి సంవత్సరం చాలామంది వచ్చి

పోతుంటారుగదా. అంతమందిలో నా చిట్టిచంద్రికకు వరుడే దొరకక పోతాడంటారా?

వెంటనే విశాలాక్షి చేతిలో 500 వెండినాణేలను ఎొక సంచిలో వేసి కట్టిస్తూ-

మామ:- దీంతోవెళ్ళి రైలుఖర్చులుపోను మిగిలింది అక్కడ ఎవరైనా షావుకారుదగ్గర వడ్డీకిచ్చి వచ్చేరాబడితో జీవిస్తూవుండు. అప్పుడప్పుడూ ఇక్కడికి వచ్చిపోతుంటావుగదా. నా చేతనైన సాయం చేస్తుంటానులే. భయపడబాక.

ఊళ్లో ప్రజలపోరు పడలేక ఎట్లయినా ఆమెను తరిమేస్తేనే మంచిదనుకున్నాడాయన. ఆమె అభిప్రాయానికి విరుద్ధంగా బోడి కొట్టించడం ఆయనకు సుతరాం ఇష్టంలేదు. ఒకవేళ ఆయన నిర్బంధంచేసినా ఆమె అందుకు వప్పుకునేది కాదేమో. అట్లాగాకుండా ఆమె అందుకొప్పుకుని గుండుకొట్టించుకున్నా దాన్నిచూచి సహించే శక్తి ఆయనకులేదు. విశాలాక్షిమీద ఆయన కంతటి వాత్సల్యాభిమానాలు, ఆమెను తన కూతురుగానే భావించాడు.

డబ్బు తీసుకుని విశాలాక్షి బయలుదేరి ఛేత్రాటనం చేస్తుండగా-ఆమె సౌందర్యాన్ని అనుభవించను, యవ్వనాన్ని రుచిచూడను; ఆమెదగ్గరుండే ధనాన్ని అపహరించను, ఆ రెండు మహాపాతకాల్నీ ఏకకాలంలో చేయను చాలారకాల మగధీరులు బయల్దేరారు, కానీ శాస్త్రోక్తంగా వివాహం చేసుకుని ఆమెను భార్యగా స్వీకరించి జీవనం చేయగల పురుషుడెవడూ ఆమెకు గోచరించలేదు. పూర్తిగా హతాశురాలై మొండిధైర్యంతో జి. సుబ్రహ్మణ్యయ్యర్, వీరేశలింగం గారలవద్దకు వచ్చి-నాకు వరుణ్ణి వెతికిపెట్టండని-స్పష్టంగా అడగగలిగే సాహసం చేయగల్గింది.

అసలుకథను ఎొదిలి కాసేపు శాఖాచంక్రమణం చేయువల్ని వచ్చింది. అసలు కథాఘట్టం-విశాలాక్షి సోమనాథయ్యర్ గారింట్లో నిద్రపోతున్న దృశ్యం...

ఆమె నల్లని శిరోజాలు ఆ దీపపుకాంతిలో తెల్లని దిండుమీద పడి అతి సుందరంగా వున్నాయి. ఆమెముఖం నిండు చంద్రుడి మాదిరిగావుంది. ఆమె వక్షోజాలు సన్నని పచ్చపట్టు రవికమాపున యౌవన సమృద్ధితో నిండుదనాన్ని పొంది బిగువుగా దృశ్యాదృశ్యంగా వున్నాయి. పైటచెరగు గాలికి జారిపోయింది. గంధర్వకన్యో, అప్సరస్త్రీయో అని మతిభ్రమించేటట్లు సుందరంగా నిద్రపోతూ వుంది.

గదితలుపు వెయ్యలేదు. ముసలి రామవ్వ దగ్గుధ్వని చెవిన బడకుండా వుండేటట్లుగా సోమనాథయ్యర్ భార్యతో మిద్దెపైన గదిలో-అంటే ముసలామె వుండేచోటికి ఎంతదూరంగా వుండాలో అంతదూరంగా పడుకోవడం అలవాటు. కానీ ఏకాదశి గాబట్టి ఆరాత్రి సోమనాథయ్యర్‌గారి భార్య ఆయనతో శయనించలేదు. కాగా ఆనాడు నెలవిడుపు గావడంతో వారచేరింది. వాకిట అరుగు పైన కట్టిన తడికలగదిలో మంచంపై పడుకొంది. ఆమెపక్కన మూడేళ్లబిడ్డ అనంతకృష్ణుడు నిద్రపోతున్నాడు. రామనాథ - రామకృష్ణు లిద్దరు సోమనాథయ్యర్ పడకగదిలో ఆయనపక్కకు ఇరుపైపులా చెరొక మంచంమీద నిద్రపోతున్నారు.

అర్ధరాత్రయింది. భోరున వర్షం కురుస్తున్నది. ఆ వానతల్లి జోలపాటలో మైమరచి నిద్రపోతూవున్న బిడ్డలమాదిరిగా రామవ్వ, తోటగుడిసెలోవుండే తోటమాలి, పైటచేరివున్న ముత్తమ్మ, అనంతకృష్ణుడు, లోపలగదిలో విశాలాక్షి, చంద్రిక, మిద్దెమీద రామనాథ రామకృష్ణులు- అంతా గాఢనిద్రలో వున్నారు. ఒక్కడు మాత్రం నిద్రపోలేదు, అతడే సోమనాథయ్యర్. ఆయనది 30 ఏళ్లు దాటిన వయస్సు. పురుషసుందరుడు. శౌండో. బరువైన ఇనప చక్రాలతో సాముచేయడంచేత భుజాలు బలిష్టంగా వున్నాయి. మెడమూపులు వున్నతంగా వున్నాయి. వక్షస్థలం విశాలంగావుంది. ఉదరంకూడా యథోచితంగానే వుంది.

అయితే తలలో కొంచం నెరపు ప్రారంభించింది. కొంచం బట్టతలకూడా ఏర్పడింది. కంటిచూపు కొంచం మధ్యస్థం. విదేశీ డాక్టర్లదగ్గర పరిక్షచేయించుకుని బంగారు కమ్మ్లులుకట్టిన వెలగల సులోచనాలు పెట్టుకున్నాడు. పట్నంమంగలి క్షవరం చేయడంచేత ముఖం తళతళలాడ్తూ మెరుస్తూవుంది. ఆయనమాత్రం ఆరాత్రి నిద్ర పోలేదు. ఎందుకని ?

మెల్లగా మిద్దెమీదనుండి క్రిందకుదిగాడు. విశాలాక్షి నిద్ర పోతున్న గదిదగ్గరకు పోయాడు. తలుపు మెల్లగా కదిలించాడు. విశాలాక్షి తన నిష్కపట ప్రవృత్తిచేత తలుపు వూరకే దగ్గరకువేసి పడుకుంది గనుక వెంటనే తెరుచుకుంది. లోపలకు ప్రవేశించాడు. విశాలాక్షిమంచం దగ్గరగావచ్చి నిలబడి ఆ దీపం వెలుతురులో ఆమె సుందరమైన విగ్రహాన్ని కళ్లారా చూసాడు. తన్ను తాను మరచి పోయిన మోహావేశంలో ఆమెపై చెయ్యివేసాడు. ఆమె వులిక్కిపడి కళ్లుతెరిచి చూచింది. భయపడిపోయి గుడ్డలు సర్దుకొని దుప్పటి పైకిలాక్కుని ఆయనవైపు కోపదృక్కులతో-ఇక్కడకు ఈవేళప్పుడు ఎందుకొచ్చారు ?-అని గద్దించింది.

ఆయన నీళ్లునములుతూ ఏదో గొణిగాడు. మాటలధోరణి, ముఖకవళికలు గమనించిన తర్వాత ఆయన హృదయం పరిశుద్ధంగా లేదని ఆమె అర్థంచేసుకోగల్గింది. తన వొడిలో ఇంతకాలం రహస్యంగా దాచిపెట్టుకునివున్న పదునైనకత్తినితీసి ఆయన ఎదురొమ్ముపై చూపింది. సోమనాథయ్యర్ భయపడిపోయి ఏమిచెయ్యాల్సిందీ తోచక కొయ్యబారిపొయ్యాడు. నిర్ఘాంతపోయి నిల్చున్నాడు.

మేఘగర్జనంవంటి గొంతుతో విశాలాక్షి- ఛీ, ఇక్కణ్ణుండి వెళ్లిపోండి-అని అరిచింది.

'బిడ్డను లేపవద్దు' - అని సోమనాథయ్యర్ సంజ్ఞచేసి ఏదో మాట్లాడబోతున్నట్లు పెదవులు కదిలించాడు. మునుపటికన్నా

బిగ్గరగా 33 మబ్బులు ఒక్కసారిగా గర్జించినట్లు – పోండి ఇక్కణ్ణుంచి–అని మళ్లీ అరిచింది.

సోమనాథయ్యర్ వెలవెలపోయి గదిదాటుకుని, తట్టుకుంటూ మిద్దె ఎక్కి, తన గదిలోకిపోయి తలుపేసుకుని దీపాన్నార్పేసి బూర్నీసు నిండుగా కప్పుకుని కళ్లు గట్టిగా మూసుకుని నిద్రపోడానికి ప్రయత్నించాడు. నిద్రరాలేదు, ఒళ్ళంతా చెమటలుపట్టింది. కప్పుకున్న బూర్నీసు తీసేసాడు. చలిపుట్టింది, మళ్ళీ కప్పుకున్నాడు. కాళ్లలో పోటు ప్రారంభమైంది. భరించలేకపొయ్యాడు. ఎముకలు తుంటలు తుంటలుగా నరికేసినట్లు బాధపడ్డాడు. ఆయన హృదయంలో వెయ్యిదయ్యాలు నృత్తనృత్యాలు చేస్తున్నట్లు కంపించిపొయ్యాడు. ఇంక ఆయనకు నిద్రెట్లాపడ్తుంది ?

ఆయన వెళ్లిపోగానే విశాలాక్షి తలుపువేసుకుని పడుకుంది. కొద్దిక్షణాల్లోనే గాఢనిద్రలో మునిగిపోయింది. వాన కురుస్తూనే వుంది:

★

7

ఒరుకాల్ విడుదలై యుట్రాన్
ఎప్పోదుం విడుదలై యుట్రాన్*

మర్నాడుదయం సోమనాథయ్యర్ ఇంట్లో శ్రాద్ధం, ఆయన తండ్రిగారికి. ముతమ్మ స్నానంచేసి ఇంటిపనుల్లోకి ప్రవేశించింది. ముత్తుసుబ్బాదీక్షితులు, కుప్పుసామిదీక్షితులు ఇద్దరూ బ్రాహ్మణార్థానికి వచ్చివున్నారు. వారిలో సుబ్బాదీక్షితులు పురోహితులు. ఈ ఇద్దరూ వుదయం పదిగంటలకల్లా వచ్చేసారు. అయితే మధ్యాహ్నం 3 గంటలదాకా సోమనాథయ్యర్ తలనొప్పితో బాధపడ్తూ వుండి కిందకు దిగి రాలేకపోయాడు.

దీక్షితులిద్దరూ వూరకే బొమ్మల్లాగ కూర్చోడం ఇష్టంలేక వేదాంత విచారంలో పడ్డారు. ఇద్దరూ వేదాంత వాదప్రతివాదాలు చేసుకుంటున్న సమయంలో సోమనాథయ్యర్ మిద్దె దిగివచ్చాడు - మీ తర్కానికి విషయమేమిటండోయ్-అంటూ.

కుప్పు.దీ:-ఒకతడవ జీవన్ముక్తి పొందినతర్వాత అది శాశ్వతంగా వుండిపోతుందా లేక మళ్లీ బంధప్రాప్తి ఏర్పడుతుందా-అనే విషయంగూర్చి చర్చిస్తున్నామండీ.

సు. దీ:-ఈవిషయంలో తమ అభిప్రాయమేమిటో సెలవివ్వండి.

సో. అయ్యర్:-వేదాంతవిషయాల్లో నాకాట్టే పరిచయం లేదు.

తటాలున విశాలాక్షి వాళ్ళ ఎదుటకొచ్చి - 'జీవన్ముక్తి ఈ లోకంలో సాధ్యమన్నదే అబద్ధం. మీలో ఎవరైనా దాన్ని పొంది వున్నారంటారా? లేక పొందినవారి నెవర్నయినా చూచున్నారా?' అని అన్నది.

---

* ఒకనాడు విముక్తి చెందినవాడు ఎల్లప్పుడూ విముక్తుడే-అని ఈ చరణానికి అర్థం.

సో. అయ్యర్ :-స్వామి రామకృష్ణ పరమహంస వున్నారు. ఆయన గొప్ప జీవన్ముక్తుడే గదా.

***

ఆ సాయంత్రం ముత్తమ్మదగ్గర సెలవుతీసుకుని విశాలాక్షి చంద్రికతో మైలాపూర్నుండి బయలుదేరి టంకసాలవీధిలో వున్న ఇంకో బంధువుల ఇల్లు చేరింది.

ఈ బంధువు విశాలాక్షి పెత్తల్లి కూతురే. ఆమె పేరు పిచ్చు (పిచ్చమ్మ), భర్తపేరు శంకరయ్యరు - ఆ టంకసాలవీధిలోనే మిఠాయంగడి పెట్టుకుని బాగా ప్రసిద్ధితో వ్యాపారం చేస్తున్నాడు.

అందులో ఆయనకు బాగా లాభంగానే వుంది. చేతికి బంగారు కడియాలు, రవ్వల వుంగరాలు, మెడలో బంగారు మైనర్ చైన్. వయస్సు 30 దాటదు. మంచి అందగాడు, బిడ్డల్లేరు.

విశాలాక్షి పోయిన మరుసటిరోజు బాలసన్యాసి ఒకరు వచ్చారు. వీరు పూర్వాశ్రమంలో దక్షిణదేశ బ్రాహ్మలు, కానీ చూసేందుకు ఉత్తరాదాయనవలె ఎర్రగా పుష్టిగా ఎత్తుగా ఆజాన బాహుడుగా వుంటాడు.

ఈయనకు నాలుగైదుభాషలు బాగా వచ్చు. సంగీతంలో కూడా మంచి విద్వాంసుడు. తాను జీవన్ముక్తుణని చెప్పుకుంటూ వుండేవాడు. కానీ ఎప్పుడూ ఆయన ముఖంలో శోకచిహ్నాలు కన పడ్తుండేవి. ప్రపంచంలోని సామాన్య మూఢభక్తు లన్నిట్నీ దాటి పోయిన మేధావి. కానీ విధివశాన తనకుతానే మానసికంగా అనేక నూతనమైన మూఢభక్తుల్ని భూతపిశాచాల్నీ సృష్టించుకుని ఎడతెగకుండా వాటితో పోరాడ్తుండేవాడు. అంటే ఆయన ఇంకా జీవన్ముక్తి పొందినవాడు కాదన్నమాట, బహుశా పొందేమార్గంలో వున్నాడేమో, అయితే ఆయనమాత్రం తాను జీవన్ముక్తి పొందినట్లుగా ఇతరులతో చెప్పుకోడమే గాక, తనలోతానుకూడా ఆ నిర్ణయానికే వచ్చాడు.

విశాలాక్షి ఆ ఇంటికి వచ్చిన మూడురోజుల తర్వాత ఒక సాయంత్రం చంద్రోదయమైంది. శంకరయ్యర్ మద్దెమీద మనోహరంగా పిండారబోసినట్లు వెన్నెల కాస్తున్నది. మధ్యలో ఒక మేజా, చుట్టూ నాలుగు కుర్చీలు, మేజామీద మంచి రుచికరమైన పిండివంటలు, తేనీరు, లేత తమలపాకులు, మంచి పీటీ వక్కలు, పూలగుత్తులు సుందరంగా అమర్చబడివున్నాయి. శంకరయ్యర్, కాశీవాసియైన బాలసన్యాసీ, శంకరయ్యర్ భార్య పిచ్చమ్మ, విశాలాక్షీ - నలుగురూ కుర్చీలపై కూర్చొని ఫలహారం చేస్తున్నారు. చంద్రిక క్రిందగదిలో నిద్రపోతున్నది. పాపకు తోడుగా పనిమనిషి వెళ్లాలమునలిది పడుకోనుంది.

మనోల్లాసకరంగా వున్న ఆ వెన్నెల్లో మేడమీద ఆ నల్గురూ ఫలహారం చేస్తుంటే అయ్యర్ గారూ బాలసన్యాసీ వేదాంతచర్చలో పడ్డారు. వేదాంతమంటే అయ్యర్ మహా చెవికోసుకుంటాడు. ఈ సన్యాసి కనపడంగానే వార్ని వుత్తమ గురువుగా స్వీకరించి తన ఇంట్లో భిక్షకుండాల్సిందిగా కోరాడు.

సన్యాసి పేరు నిత్యానందస్వామి. వయస్సు 28 సంవత్సరాలకు మించదు. రూపరి, మన్మథుడే సన్యసించాడా అన్పిస్తుంది. వార్ని చూడంగానే విశాలాక్షికి ఆపలేనంతగా అనురాగం కల్గింది. సన్యాసికి కూడా అంతకన్నా మించిన ప్రేమ వుదయించింది.

సన్యాసి ప్రేమించడం న్యాయమా అని మీరడగవచ్చు. అది సరైన ప్రశ్న కాదంటాను. రతికాంతుడి బాణాలు ఎవర్ని జయించవు? విశ్వామిత్ర పరాశరాది మహామునులు, సంసారాన్ని వదిలేసి ఆకులలాలు తింటూ నీళ్లు త్రాగుతూ అడవుల్లో వుండేమును లే సుందరాంగుల తామరపువ్వులవంటి ముఖాలుచూచి వాళ్ల వలల్లో పడ్డట్లు భర్తృహరి చెప్పాడు.

ఎట్టయాపురం ఘటికముత్తు పండితుడు* తన గ్రంథాల్లో ఎొక దాంట్లో మన్మథుడే దేవత లందరిలోనూ బలవంతుడని చెప్పాడు. పరమశివుడే కాముడి బాణాలకు ఎోడిపోయి జగన్మాతను పెండ్లి చేసుకొన్నాడుగదా.

బాలసన్యాసి నిత్యానందస్వామి ఋగ్వేదాన్ని సాయణ భాష్యంతో పూర్ణంగా అధ్యయనం చేసాడు. దశోపనిషత్తుల్ని శంకర భాష్యంతో నేర్చుకున్నాడు. ఇంకా అసంఖ్యాకాలైన అద్వైత విశిష్టాద్వైత తర్క మీమాంస యోగ సాంఖ్యాది శాస్త్ర దర్శనాలనూ, పురాణేతిహాస కావ్యాలనూ కూలంకషంగా అభ్యసించాడు. నిత్యానంత బాలసన్యాసి నిస్సందేహంగా మహాపండితుడు. హిందూ మతానికీ హిందూ నాగరికతకు సరైన ప్రతినిధి అనవచ్చు.

హిందీ, బెంగాలీ, మహారాష్ట్ర, తెలుగు, తమిళం, ఆంగ్ల భాషల్లో గట్టిపాండిత్యం ఆయనది. వివిధ కావ్యశాస్త్రాదుల్ని ఆ యా భాషల్లోనే చక్కగా చదివి నేర్చిన నిఖార్సైన జ్ఞానమాయనది. ఆయన చెప్పే వేదాంతంలో వట్టి వాగ్రూపమైన విద్వే గాకుండా మంచి పరిశోధనాత్మకమైన ప్రతిభకూడా కనపడ్తుంది. మమకార రహితమైన వాదనా సామర్థ్యముంది. ఆయన జీవన్ముక్తి ఫల

---

* ఈ ఎట్టయాపురం ఘటికముత్తు పండితు డెవరైందీ స్పష్టంగా తెలియడంలేదు. భారతిగారికి ఎట్టయాపురం సంస్థానంతో సన్నిహితసంబంధ మున్నది. ఎట్టయాపురం సంస్థానాధిపతి వెంకటేశ్వర ఎట్టెప్ప (1816-1839), ఆయన కుమారుడు జగదీశ్వర రామకుమార ఎట్టెప్ప కాలంలోనూ - ఆ సంస్థానంలో చాలామంది తెలుగు తమిళ విద్వాంసులున్నట్లు నిడదవోలు వెంకటరావుగారు తన 'దక్షిణదేశ వాఙ్మయం' (మద్రాసు విశ్వవిద్యాలయం - 1960)లో పేర్కొని వున్నారు, వారిపేర్లుకూడా ఇచ్చివున్నారు. వారిలో ద్రావిడ కవీంద్రులైన 'కడికై క్-ప్పులవర్' అనే ఆయన ఎొకరని పేర్కొన్నారు. అరవంలో పులవర్ అంటే 'పండితుడు' అని చెప్పవచ్చు, కడికై క్--ఘటిక పండితుడు, అని అన్వయించుకోవాలేమో. వీరు వ్రాసిన గ్రంథాలేమిటో తెలియడంలేదు. ఎట్టయాపురం సంస్థానపండితుల్లో ఎొకరైన సుబ్బరామ దీక్షితులు కవిత్రయ మహాభారతాన్ని తమిళంలోకి అనువాదం చేసినట్లు, అది అచ్చయినట్లు కూడా చెప్తారు. ఎట్టయాపురం సంస్థానంవారే దీనిని ప్రచురించినట్లు డా॥ చల్లా రాధాకృష్ణ శర్మగారు తన "సుబ్రహ్మణ్య భారతి" అనే గ్రంథంలో పేర్కొనివున్నారు.

సాధనకు స్త్రీతోడు లేకపోవడ మొక ఆటంకమనే చెప్పాలి. ధన విద్యలు లేకపోయినా జీవన్ముక్తిపొందవచ్చు కానీ ప్రేమవిషయంలో విజయం చేకూర్చుకోనివాడు యిహలోకంలో ముక్తిమార్గాన జీవించడం కష్టసాధ్య మనిపిస్తుంది.

బౌద్ధమత సంపర్కంవల్లనే మొదట స్త్రీసహవాసాన్ని వీడి ముక్తికై ప్రాకులాడ్డమనేది ఈ దేశంలోనూ ప్రపంచంలోనూ నిర్ణయింపబడిందని చెప్పుకోవల్సి వుంది. వేదకాలపు ఋషులు తమతమ ధర్మపత్నులతో వుంటూనే అడవుల్లో తపస్సు చేసినట్లు మన ప్రాచీన గ్రంథాలు ఘోషిస్తున్నాయి.

బౌద్ధం నుండే హిందూమతం మొదలైన కొన్ని మతాలు ఒక్కసారిగా ఇహలోకబంధాల్ని వీడి నిత్యసన్యాసపద్ధతిని ఆచరణలో తెచ్చినట్లు తోస్తుంది. వేదఋషులు మోక్షసాధనంగా చేసిన యజ్ఞయాగాలకు వారివారి భార్యలు పాల్గొనాలని మనవాళ్లు శాసించివున్నారు. పూర్వకాల విషయ మెట్లా వున్నా సంసారంకాదే సద్ధర్మంకాదని అవ్వయార్[1] వాక్యాన్నే నేను ప్రమాణంగా తీసుకున్నాను.

"ఇల్లరమల్లదు నల్లరమను"[2]

ప్రేమ పెడమార్గాన పోయినప్పుడు సత్యానికి దూరమైనప్పుడు ఈలోకంలో మహా దుఃఖాలకు దారితీస్తుంది. నిజమైన ప్రేమ జీవ

---

1. తమిళంలో తిరువళ్లువర్ తర్వాత చెప్పుకోవల్సిన ప్రజాకవయిత్రి అవ్వైయార్. అవ్వై తిరువళ్లువర్ సోదరి అని నమ్మేవాళ్లకూడా వున్నారు. ఆత్తిచూడి, కొండ్రైవేంద్రన్, వాక్కుండాం, నల్వళి మొదలైన నీతిగ్రంథాలను ఈమె రచించినట్లు చెప్తారు. కానీ నానారకాల కల్పనాకథలు ఆమె జీవితానికి సంబంధించి ప్రచారంలో వుండబట్టి అందులో ఏవి ఆమె వ్రాసినవో నిర్ణయించడం వీలుగావడం లేదు. అసలు ఆమె పూర్తిపేరుకూడా తెలియదు. అవ్వైయార్ అనే మాటకు పూజ్యురాలు-అని అర్థం చెప్పవచ్చు. సామెతలుగా ఈనాటికీ తమిళుల జిహ్వాగ్రాల్లో అవ్వైయార్ సూక్తులు నిల్చివున్నాయి. ఈమెకాలం 12 శతాబ్ది అని తేల్చారు.

2. సంసారధర్మం కానిది సద్ధర్మం కాదు - అని ఈ వాక్యార్థం.

న్మ్మక్తికి గొప్పసాధనం. నిజమైన ప్రేమమార్గం మిట్టపల్లాలతో కూడింది.[1]—అని షేక్స్పియర్ కూడా అంటాడు. ఆ దుర్గమమైన మార్గంలో ఎవరైనా కొంతదూరం భీతిచెందకుండా, బలహీనుడు గాకుండా, నీచమార్గాల్లో పడకుండా, నిష్కల్మషంగా పోతే సుఖాన్ని పరిశుద్ధమైన స్థితిలో అనుభవించగలడు.

ఇకలోకసుఖాలు క్షణికాలనీ నిమషాల్లో పుట్టి పోతాయనీ చెప్పేవారికి చిత్తస్థైర్యం లేదన్నమాటే. ఈ ప్రపంచ సందర్శనం, ప్రకృతి సౌందర్యదర్శనం మొదటి మహదానందం. సూర్యుడు, ఎండ, పక్షులు, మృగాలు, తోటలు, కొండలు, నదులు, అరణ్యాలు, సెల యేళ్లు, నీటిబుగ్గలు, ఆకాశం, భూమ్యాకాశాలు కలియడం, చంద్రుడు, నక్షత్రాలు – చూచేకొద్దీ వెగటు తోచకుండా వుండే నిత్యానందాలు.

దీనమానవుడా! ఇవన్నీ శాశ్వతం కావా? నిమషంలో పుట్టి పొయ్యేవా? ఒకొక్కచెట్టు పోవచ్చు కానీ వృక్షజాతి నశిస్తుందా? ఒకొక్క పక్షి, మృగం చావొచ్చు. కాని పక్షిజాతీ మృగాలు నశిస్తాయా? కొండలు, సముద్రాలు, ఆకాశం, అంతరాళం, సూర్య చంద్ర నక్షత్రాలు ఎప్పుడూ మారేవికావు. ఏదో యుగాంతంలో ఇవి మార్తాయని విద్వాంసులు వూహచేసి చెప్తారు. ఈ వూహా వాదాన్ని మనం లెక్కపెట్ట నక్కర్లేదు. ఎన్నోకోట్ల సంవత్సరాల తర్వాత ఇవి నశించిపోతాయని మన శాస్త్రాలుచెప్తున్నా వాట్ని నిత్యవస్తువులుగా స్వీకరించడంలో తప్పేముంది?

పోనీండి. ప్రపంచంలో మానవుడికి చిరకాల సుఖాన్నిచ్చేవి ఎన్నో వున్నాయి. మంచి భోజనం ఆకలి తీర్చుకునేంతమట్టుకే ఆరగిస్తే మానవుడికి భోజనానందం వెగటన్పించదు. జబ్బులేనపుడు స్నానానందం చెప్ప నలవికాదు. ఇక మైత్రి, విద్య, సంగీతం మొద

---

1. "The course of true love never runs smooth" (Midsummer night's dream.)

లైన ఎన్నో కళలు ఏ కాలంలోనూ అతి అన్పించకుండా సుఖాన్నిచ్చేవి ఎన్నో వున్నాయి. ఇహలోకసుఖాలు క్షణికాలనీ నీటి బుడగలమాదిరి పుట్టి నశించేవనీ చెప్పేవారు మూర్ఖులు. సోమరిపోతులు, ధైర్యవిహీనులు.

సుఖమయమైన ఈలోకంలో కనపడే అన్నిసుఖాల్లో ప్రేమానందమే పరమానందం. ఇందులో నిష్కల్మషంగా స్థితబుద్ధితో నిల్చిస్తే అదెప్పటికీ వట్టిపోని సుఖప్రదమైన అమృతవాహినిగా వుండి మానవజీవితాన్నమరత్వంచేసి నిరవధిక సుఖానందాన్నిస్తుంది.

ఒక పురుషుడు వొకే స్త్రీని, వొక స్త్రీ వొకే పురుషుణ్ణి స్థిరంగా ప్రేమించే పద్ధతిని అంతా చక్కగా ఆచరిస్తే వారుభయుల ప్రేమానందం ఎంత గొప్పదో ఎంతటి అమూల్యమైన ప్రయోజనాన్నిస్తుందో తమంత తాము సులభంగా తెల్సుకోగలరు. ఈవిధంగా ఆలోచించిన తర్వాత – బాలసన్యాసి నిత్యానందస్వాములు తాను విశాలాక్షిని ప్రేమించడం న్యాయవిరుద్ధమేమీ కాదని తీర్మానించుకున్నాడు.

ఒకనాడు సాయంకాలం మిఠాయంగడి శంకరయ్యర్ మిద్దె మీద బాలసన్యాసీ, విశాలాక్షీ ఏకాంతంగా కల్సుకొన్నారు. వాళ్ళిద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు. తాను సన్యాసానికి స్వస్తి చెప్పి, లౌకికజీవితాన్ని స్వీకరించి విశాలాక్షిని పెండ్లాడడానికి నిశ్చయించుకున్న కారణాలను ఆమెకు వివరించాడు. ఆమె ఆ కారణాలన్నీ న్యాయమైనవిగానే అంగీకరించింది.

వాళ్ళిద్దరూ చంద్రికా సహితంగా ఎగ్మూర్లో వుండే వీరేశలింగం గారింటికి పొయ్యారు. అక్కడికి పొయ్యేముందు నిత్యానందులు తన కాషాయకమండలాలను కడలిలో పారేసి తెల్లధోవతీ-చొక్కా-పంజాబీ తలపాగా ధరించారు వరుడివేషంలో. ఈ లౌకిక రూపంలో స్వామినిచూస్తే సాక్షాత్తు నేపాళయువరాజులా వున్నాడు– అని శంకరయ్యర్ వువాచ.

స్వాములు:-ఇంక నన్ను 'స్వాములు' అనొద్దు. సన్యాసి వేషాన్ని కాషాయ కమండలాల్నీ విసర్జించిపారేసాను. ఇకమీదట నా ప్రేయసి విశాలాక్షి పేరుకు సాటిగా విశ్వనాథశర్మ అని పిలవండి.

శర్మను ఈ లౌకిక వేషంలో చూడగానే విశాలాక్షికి ఆయనపై వున్న అనురాగం సహస్రాధిక మైంది. ఆమెలో ఆవేశం వుప్పొంగిపోయింది. తన్ను తాను మర్చిపోయింది. ఇద్దరూ పంతులుగారిల్లు చేరారు.

విశాలాక్షి ఆ దంపతులతో తనను విశ్వనాథశర్మ పెండ్లాడేందుకు కుదుర్చుకున్న వొప్పందం, ఆ తీర్థానానికిముందు జరిగిన సంగతి సందర్భాలను వివరంగా విన్నవించుకొంది. ఆ దీనజనోద్ధారకులైన దంపతులకు అపరిమితానందమైంది.

విశాలాక్షి వివాహవిషయంలో వారు అనేక చోట్ల ఆరాలుతీసి ప్రయత్నాలుచేసి సఫలంగాలేక నిస్పృహలో వుంటున్నదశలో తమ ప్రయత్నం లేకుండానే తమ అభీష్టం నెరవేరడంతో వారి ఆనందానికి ఎల్లలేకుండా పోయింది.

పంతులు:-అంతా దైవసంకల్పం. మనమొకటితలిస్తే దేవుడు మనమంచికే మరొకటి తలుస్తాడు – అని నిండుమనస్సుతో భగవంతుణ్ణి స్మరించాడు. తర్వాత పంతులుగారే విశ్వనాథశర్మనూ, విశాలాక్షినీ బ్రహ్మసమాజంలో చేర్పించారు.

గోపాలయ్యంగారి వివాహమైన రెండువాలకే మద్రాసు బ్రహ్మసమాజాలయంలోనే సమాజవిధులప్రకారం విశాలాక్షి-విశ్వనాథశర్మల వివాహం వైభవంగా జరిగిపోయింది.

వివాహం జరిగిన వొక వారంరోజులకల్లా మిఠాయంగడి శంకరయ్యర్, ఇంకా ఇతరమిత్రుల తోడ్పాటుతో విశ్వనాథశర్మకు వుద్యోగమొకటి కుదిరింది – టంకశాలవీధిలో వుండే ముగ్గురు నలుగురు గుజరాతీ కోటీశ్వరుల బిడ్డలకు రాత్రులపూట హిందీ సంస్కృతం

ఇంగ్లీషుపాఠాలు భోదించే వుద్యోగం. శంకరయ్యర్ ఇంటికి రెండు మూడిళ్లతర్వాతనే వొక చిన్న ఇల్లు ఖాళీ అయింది. ముందు రెండు గదులు, ఎత్తైన మిద్దె, వెనకాతల వొక చిన్నతోట వుంది. అందులో వొక చిన్న పర్ణశాలను ముచ్చటగా నిర్మించి, విద్యార్థులు కూర్చు నేందుకు కుర్చీలు, మేజాలు, బల్లలు శంకరయ్యర్ గారే అందులో కొనిపెట్టాడు.

ఆ గృహంలోనే ఈ నవదంపతుల కాపరం పెట్టించాడు శంక రయ్యర్. శంకరయ్యర్‌కు శర్మగారిపై ఇదివరకటికంటే భక్తి నూరింతలైం దిప్పుడు. కొద్దిమాసాలు తిరగంగానే గుజరాతీబిడ్డలకు విద్యగరపడంద్వారానేగాకుండా కొన్ని ఇతర వరుంబల్లుకూడా శర్మకు లభించాయి. మద్రాసునుండి వచ్చే కొన్ని ఆంగ్ల, తమిళ పత్రికలకు వ్యాసాలు శీర్షికలు వ్రాసిస్తూ శాస్త్రవిషయాల్లోనేగాక లౌకిక విష యాల్లోకూడా శర్మగారు తన పాండిత్యానికి మెరుగులు దిద్దుకోవడం ప్రారంభించారు. రచనానైపుణ్యంలోకూడా గట్టిదిట్ట అన్పించుకో గలిగారు. పత్రికాధిపతులు వారివ్యాసాల్ని శ్రద్ధాభక్తులతో స్వీకరించి తగిన పారితోషికంకూడా ఇస్తుండేవారు. క్రమంగా బొంబాయి, కలకత్తానగరాల్లో నుండివచ్చే పత్రికలకూ, ఇంగ్లండ్-అమెరికా వగైరా విదేశీ పత్రికలకుకూడా వ్యాసదానం చేస్తుండేవారు. ఇట్లా ప్రతినెలా 500 రూపాయలదాకా వరుమానం వుంటుండేది. విశ్రాంతి లేని పరిశ్రమ మొదలుపెట్టాడు శర్మగారు.

మెల్లగా వారి ముఖంలోవుండే దిగులు, విచారం మాసి పోయాయి. ఇప్పుడు వారి ముఖంలో వొక కొత్త ఆనందం, తృప్తి తాండవమాడ్తున్నాయి. విశాలాక్షికూడా మునుపటికన్నా అధిక సౌందర్యంతో ప్రకాశిస్తూవుంది.

పాలకు వొక ఆవునుకూడా కొన్నారు. పాలు పిండేందుకు, చంద్రికను సాకేందుకు, ఇంట్లో పాచిపనులు చేసేందుకు కాస్త అను భవం బుద్ధిసూక్ష్మతలున్న 'వెల్లాల' ముసలి పనిమనిషి కుదిరింది.

ఆమెకు రెండుపూటలా భోజనంపెట్టి నెలకు 8 రూపాయ లిస్తుండే వారు. వీళ్లకు ప్రతినెలా ఇంటిఖర్చు నూర్రూపాయ లయ్యేది. నెలనెలా 400 రూపాయలకు తగ్గకుండా శర్మగారు నమ్మకస్తుడైన గుజరాతీ షరాబుదగ్గర దాచిపెట్టడం ప్రారంభించారు.

మరి కొంతకాలానికి శర్మకు పత్రికలనుండే హేరాళంగా సంపాయిద్యం వుండబట్టి బిడ్డలకు పాఠాలు చెప్పడం మానేసాడు ప్రతిదినం పొద్దున్నే లేచి కాళ్లు చేతులు కడుక్కొని ఇంట్లోనుండి బయలుదేరి హైకోర్టు కెదురుగ్గావుండే వాగర్తలో చాలాసేపు షికారు చేసి 9 గంటలకు ఇల్లు చేరేవాడు. 11 గంటలనుండి సాయంత్రం 3 గంటలదాకా ప్రాతపన్లోనే వుండేవాడు. తర్వాత ఫలహారం చేసి టీ త్రాగి, వొక గంట చదవడంలో, మర్రోజు ప్రాయాల్సిన వివిధ విషయాలనుగూర్చి ఆలోచించడంలో కాలం గడిచిపోయేది. ఆతర్వాత సాయంత్రం వాళ్లు చిన్న గుర్రబ్బండిలో దంపతులిద్దరూ చంద్రికను వెంటబెట్టుకొని మెరీనా బీచికెళ్లి రాత్రి ఏడుగంటలకు ఇల్లు చేరేవారు.

8 గంటలకు భోంచేసి దంపతులిద్దరూ రాత్రంతా మధుర సంభాషణల్లో క్రీడావిలాసాల్లో గడిపేవారు; ఏ 12 గంటలకో నిద్ర పొయ్యేవారు. ఈలోపు వేటినిగూర్చి మాట్లాడుకునేవారో ఆ దేవుడికే తెలియాల. వీళ్ల సంభాషణలు, ఆటలు, నవ్వులు పక్కిళ్ళలో వారికి అప్పుడప్పుడూ నిద్రాభంగంకూడా కల్గించేవి. ఒకరిమాటలు వొకరికి తేనై అమృతమై ఎంత విన్నా విసుగనిపించేవి కావు. కొన్నిరాత్రుల్లో విశాలాక్షి ఆర్మోనియం శ్రుతిపెట్టి పాటలు పాడేది, ఆ గానమాధుర్యంలో శర్మ తన్మయత్వం చెంది మోహావేశుడై పొయ్యేవాడు. చంద్రిక, పనిమనిషి వొకగదిలో నిద్రపొయ్యేవారు.

వీళ్ళిద్దరి అన్యోన్యప్రేమ మానవాతీతమైందిగా తోచేది, ఈ కలియుగంలోని అనురాగంగా కనపడేది కాదు. ఒకే స్త్రీని ఎల్లకాలం ప్రేమించే ఏకపత్నీవ్రతంలో శ్రీరామచంద్రులు ఆదర్శ

మూర్తి. ఆయనకూడా ఆ భార్యపై అనుమానపడి లంకలో ఆమెను నిప్పులో దూకమనేంత మాటలన్నాడు. మళ్లీ లోకాపవాదానికి వెరచి గర్భవతి అయిన ఇల్లాల్ని అడవులకు పంపాడు. ఇట్లాంటి కళంకా లేమీ లేకుండా మన శర్మగారు సాక్షాత్తు శ్రీమన్నారాయణమూర్తిగా శ్రీదేవియెడల వుంచిన గాఢానురాగాన్నే ప్రదర్శించే వారు. విశాలాక్షికూడా పరమ జ్ఞాని అయిన తన భర్తపై దేవతా విశ్వాసంకలిగి సాక్షాత్తు భగవదవతారమని తలచి ఎనలేని భక్తి ప్రపత్తులతో సంతుష్టురాలుగా మెలిగేది.

ఇట్లా ఒకటిన్నర సంవత్సరాలు గడిచాయో లేదో ఒక విపరీతం సంభవించింది. శర్మగారికి వున్నట్టుండి పిచ్చి పట్టింది! యోగాభ్యాసంచేత ముక్తి పొందవచ్చుననుకుని మనస్సును వివిధంగా యెడతెంపు లేకుండా అణిచిపెట్టడంచేత బలాత్కారం చేసినందువల్ల బుర్ర చెడిపోయింది!

ప్రాతపనులు ఆగిపోయాయి. తన ఇంట్లోనే ఒక నాటు వైద్యుడిసాయంతో చికిత్స పొందుతున్నాడు. మాంత్రికులకు చూపమని శంకరయ్యర్ సలహాయిచ్చాడు కానీ విశాలాక్షి వద్దని వారించింది. విశాలాక్షి పరిస్థితి దీనాతిదీనమైంది. స్వర్గంలోని ఇంద్రపదవినుండి హఠాత్తుగా త్రోసివేయబడి, పామై భూలోకంలోకి పడిన నహుషునిగతే పట్టింది.

ప్రేమతో మోక్షం పొందవచ్చునని శర్మ చెప్పింది దృఢంగా నమ్మి సుందరుడూ జ్ఞానీ అయిన తన భర్తను మన్మధరూపంగా విష్ణువుగా శివుడుగా భావించి భక్తి ప్రపత్తులతో సేవచేస్తూ వారిప్రేమను పొంది ఆనందపరవశురాలైంది.

ఇప్పుడీ ఘోరవ్యాధి వారికి సంభవించడంతో ఆమె దుఃఖ సాగరంలో మునిగిపోయింది. మధ్యమధ్య అప్పుడప్పుడూ శర్మకు తెలివి వస్తుండేది. అప్పుడుమాత్రం ఆమెను పిలిచి తనచెంతన వుంచుకుని ఓదార్చేవాడు, ధైర్యవచనాలు చెప్పేవాడు.

"ప్రియా నీవు దేనికీ దిగులు పడవద్దు. దిగులుపడకుండా భయపడకుండా వుండడమే ముక్తి. ఈలోకంలో దిగులుపడకుండా వుంటేనే ఏ వ్యాధీ రాకుండా వుంటుంది. భయపడకుండావుంటే ఏ ఆపదా సంభవించకుండా వుంటుంది. పొరపాటున ఏదైనా వ్యాధిగానీ ఆపదగానీ సంభవిస్తే దానికై దిగులుచెందకుండా స్థైర్యంగా వుంటే అవే దూరమైపోతాయి. దిగులును జయిస్తే మరణాన్నే గెలవొచ్చు. భయం, దుఃఖం, దిగులు లేకుండావుంటే ఈ లోకంలో ఎల్లకాలం జీవించవచ్చు. అయితే నాకు అంతుబట్టని కొన్ని భయాల్లో నేనిప్పుడు పడిపొయ్యాను. అందుకే ఈ వ్యాధి నన్ను ఆవరించింది. కొద్దిరోజుల్లోనే అదే తీరిపోతుంది. మనకు డబ్బులేదనే దిగులొద్దు. నేనింక మూడేళ్లు వ్రాయకపోయినా, పైసా సంపాదించకపోయినా గుజరాతీ వాళ్లదగ్గర యిచ్చినడబ్బుతో నీవు దర్జాగా కాలం గడపొచ్చు. నన్ను గూర్చిన ఏ దిగులూ విచారమూ నీమనస్సులోకే తెచ్చుకోబాకు..." ఈ ధోరణిలో ఆమెకు మనస్థైర్యం చెప్పి ఓదార్చేవాడు శర్మ.

తిరుత్తక్క దేవరకవిగారు తన 'జీవక చింతామణి'[1] గ్రంథంలో ఈవిధంగా అంటారు :

---

1. తమిళ పంచకావ్యాలలో ఇదొకటి. ఆ పంచకావ్యాలు - మణిమేఖలై, శిలప్పదికారం, జీవక చింతామణి, వళయాపతి, కుండలకేశి. ఇందులో ఆఖరి రెండు నామమాత్రంగానే విలిచివున్నవి, ఆ కావ్యకర్తల పేర్లుకూడా తెలియడం లేదు. మణిమేఖలై, శిలప్పదికారం తర్వాత పేర్కొనవగిన ఈ జీవక చింతామణి కావ్యం శృంగారరసప్రధానమైనది. ఈ కావ్యకర్త తిరుత్తక్కదేవర్ జైనముని, చోళవంశీయుడని ప్రతీతి. క్రీ. శ. 5 వ శతాబ్దంవాడని పండితులు, 9 వ శతాబ్దంవాడని పరిశోధకులూ తేల్చారు. జైనుల తాత్విక రహస్యాలు, వారి సంప్రదాయాలు, ఆనాటి సాంఘికవిషయాలూ ఈ కావ్యంలో ప్రతిఫలిస్తున్నవి. మనోహరమైన వర్ణనలతోను, మధురమైన శైలితోను చెలువారే ఈ కావ్యం తర్వాతికవులకు మార్గదర్శకమైంది. ఈ జీవక చింతామణికి "ముదిపొరుళ్ తొడర్నిలై నెయ్యుళ్" అని ఇంకొక పేరు కూడా వుంది. 'మణనూల్' అనే మరోపేరుకూడా వుంది.

"ఇదుకక్కూణ్ వందుట్రుకాాలై, ఎతీకిండ్రడ విళకుక్కపోల
నదుకక్క మొన్డాాిను మిన్రి నగుగ, కాం నకక్కపోదా
విడుకక్కాలై యరియుం మెకాాం, ఇరుందళుది యావరుయిందార్ ?"1

"విశాలాక్షీ! ఈ వుపదేశం నీ వెప్పుడూ మర్చిపోబాకు. ఏమి సంభవిస్తుందోనని మనసులో దిగులు పెట్టుకోబాకు. ఏ బాధలూ రోగాలూ లేకుండా సుఖంగా వుండాలనేనా ఆశయం. నీవు మనసులో బాధపడ్తుంటే నేను చూడలేను..." శర్మ ఇట్లా ఎన్నెన్నో చెప్పి విశాలాక్షిని ఓదార్చేవాడు. ఈ మాటలు వింటుంటే విశాలాక్షీకి అశ్రుప్రవాహం ఇంకొంచెం అధికమయ్యేది. విశాలాక్షి ఏడ్పు చూచి శర్మకూడా బిగ్గరగా విలపించేవాడు.

ఒకనాడు వీళ్లిద్దరూ పెద్దగా విలపిస్తుంటే వైద్యుడొచ్చాడు. ఈ దురవస్థనుచూచి వైద్యుడు విశాలాక్షితో—అమ్మా నిన్ను చూడగానే శర్మకు వ్యసనం జాస్తవుతుంది, వ్యాధికూడా అధికమౌతుంది. దయచేసి మీ భర్తతో ఏకాంతంగా మాత్రం మాట్లాడొద్దు. అంతగా మాట్లాడాల్సిన సందర్భమొస్తే ఏదో ముక్తసరిగా మాట్లాడండి కానీ ఎక్కువసేపుమాత్రం మాట్లాడొద్దు-అన్నాడు.

ఆమెకూడా తన భర్తకు ఎట్లాంటి కష్టం కలగ్గూడదని భోజనాలప్పుడు తప్ప తక్కినసమయాల్లో ఆయన్ని చూడకుండా దూరంగా మెలగుతూ కాలం గడిపేది. ఇందువల్ల శర్మకష్టాలు మానసిక బాధలు ఎక్కువయ్యాయేగానీ తగ్గలేదు. అయితే తనను ఆమె నిర్లక్ష్యం చేస్తున్నదనిమాత్రం అపార్థం చేసుకోలేదు. తన దేహస్థితి అర్థం చేసుకుని తన మేలుకొరకే తోట బంగళాకు రాకుండా తనతో ఎక్కువసేపు మాట్లాడకుండా వుంటున్నదని అనుకోసాగాడు.

---

1. "మనకు కష్టాలొచ్చినపుడు ఏమీ కలతపడకుండా చిరునవ్వుతో స్వాగతం చెప్పాలి. ఈ చిరునవ్వే ఆ దుఃఖాన్ని ఛేదించేందుకు అనువైన కత్తిగా మారుతుంది. అట్లాగాకుండా దుఃఖసమయంలో మనం బాధపడిపోతే అదే మనల్ని నాశనం చేస్తుంది."

ఈ వ్యాధుల్ని గూర్చి వొక చిన్న కథ. మునుపు కలరా పిశాచం మక్కా-కు వెళ్తుంటే దారిలో పారశీక దేశంలో వొక గొప్ప తపస్వీ జ్ఞానీ అయిన మాల్వీగారు ఆ పిశాచాన్ని చూచి...

మాల్వీ:-అరే సైతాన్, ఎక్కడికి పోతున్నావ్?

సైతాన్:-మక్కా-నగరంలో ఇప్పుడు తిర్నాళ్లు జరుగుతున్నది. నానాదేశాలనుండి లక్షలాదిప్రజ లొచ్చి చేర్తారు. వాళ్లను వేటాడేందుకు వెళ్తున్నాను.

మాల్వీ:-ఛీ, మూగ్ఖుడా! మక్కా-నగరంలో సర్వేశ్వరుడైన అల్లాను చూడ్డానికి భక్తులు వెళ్తుంటే నువ్వు వాళ్లమీద పడ్డం నే నొప్పుకోను.

సైతాన్:-స్వామీ, నన్నుకూడా ఆ అల్లాయే సృష్టించాడు. ప్రాణుల్ని బలిగొనడమే నా వుద్యోగం. ఈ లోకంలో జరిగేవన్నీ వారి లీలలే, మరి వేరే లేవుగదా. వారికి తెలియకుండా వొక అణువు కూడా కదలదుగదా. నా ప్రయాణం జరిగితీరాల్సిందే. మీరు నా ప్రయాణాన్ని మాన్పించచూడ్డం భావ్యంకాదు. అయినా మక్కా-కు వచ్చిన వాళ్లంతా పుణ్యాత్ములనీ, దర్మిష్ఠులనీ, సద్భక్తులనీ అనుకోకండి. ఎందరో పాపులు, దుష్టులు, ఖురాన్ శాసనాల నుల్లంఘించినవారూ అక్కడికి వస్తుంటారు. పైగా పుణ్యాత్ములకు ఈ ప్రపంచంలో చావులేదని అల్లాప్రభువు ఎక్కడా శాసించలేదే. పాపాత్ములతోబాటు పుణ్యాత్ములుకూడా మరణిస్తూనేవున్నారు. ఇతర రోగాలవల్ల చాలాకాలం బాధపడికృంగికృశించి చావకుండా నాచేత మరణం పొందడం మానవుడికి మంచిదే కానీ కీడుకాదే. నానోట్లోకూటికి అడ్డంరావడం తమరికి న్యాయంకాదు. అయినా మహాత్ములైన తమకు కాస్త సంతోషం కల్గించేమాట వొకటిచెప్తా. తమరు కావలిస్తే నానోట ఇంతమందిని మాత్రమే వేసుకోమని ఆజ్ఞాపించండి, అంతకుపైన వొక అరప్రాణంకూడా మింగననీ మీపాదాలపై వొట్టు పెట్టుకుంటాను.

మాలీ:-సరే, అట్లనే పో. అక్కడ లక్షలాదిజనం చేరి వుంటారు. వారిలో నీవు ఎొక వెయ్యిమందిని మాత్రమే పొట్టన పెట్టుకో. ఆపైన ఎొక్కరి ప్రాణిజోలికి కూడా పోవద్దు. సరేనా?

జీన్ అట్లాగేనంటూ ఎొక సలాంచేసి వెళ్లిపోయింది.

కొద్ది రోజులైన తర్వాత తిరణాళ్లు కొచ్చిన వారిలో కలరా తగిలి లక్షమందిదాకా మరణించారని మాల్వీ విన్నాడు. తనను ఆ సైతాన్ మోసం చేసిందని దుఃఖితుడైవున్నాడు. మర్నాడు సైతాన్ ఆ దారిన మక్కానుండి తిరిగిపోతూ మాల్వీకి సలాం చేసింది. మాల్వీ గారు కోపంతో-ఛీ, నీచుడా, అబద్ధాలవెధవా, నాదగ్గర వెయ్యి మందికంటే ఎక్కువగా ఎొక్కర్నికూడా తాకనని ప్రమాణంచేసి అక్కడకుపోయి మక్కాలో లక్షమందిని నీ పొట్టన పెట్టుకున్నావా? నీకు ఏమిశిక్ష?-అన్నాడు.

జీన్:-అయ్యా మాల్వీజీ, తమకిచ్చిన మాట ప్రకారంగానే వెయ్యిమంది మాత్రమే నావల్ల చచ్చారు. ఆపైన ఎొక్కర్నికూడా నేను తాకలేదు. మిగిలినవారు భయపడిపోయి వాంతి భేదులు చేసుకుని మృత్యువుపాత బడ్డారు. దానికి నేనేమి చేయగల్ను? మీరు నామీద నిందవేస్తే ఏం లాభం?

మాల్వీ:-(పెద్దగా నిట్టూర్చి) అయ్యో, ఓరి దౌర్భాగ్య మానవుడా! భయంచేత సంశయంచేత నిన్ను నీవే ఎల్లవేళలా చంపుకుంటున్నావు. నీ మహా మూఢత్వాన్ని, దాన్ని ప్రోత్సహించే మహాభయాన్ని కల్గించే ఆ విధినీ తల్చుకుంటే నామనస్సు వ్యాకుల మైపోతుంది. నేనేం చెయ్యాలి? నోర్మూయ్. మనమేంచేస్తాం? అల్లాహో అక్బర్! అల్లా మహాత్ముడు. వారి ఆజ్ఞప్రకారంగానే అన్నీ జరుగుతున్నాయి. వారి పాదారవిందాలే మనకు శరణ్యం - అంటూ మోకాళ్లపై వ్రాలి ఆకాశంకేసి చూస్తూ తదేక ధ్యానంతో ప్రార్థించడం మొదలుపెట్టాడు.

సైతాన్ సెలవుతీసుకుని వెళ్లిపోయింది.

ఈ కథను నేను చిన్నప్పు డెక్క-డో చదివాను. వ్యాధికి ముఖ్యమైన కారణం మనుషుల మనసుల్లోపుట్టే భయం, సంక్షోభం, సంశయం, అసూయ, అసంతృప్తి, ద్వేషం మొదలైన విషగుణాలని యీ కథవల్ల తెలుస్తుంది. దీని సారాంశాన్ని నే నొప్పుకుంటాను.

మనసులో వుద్భవించే యీ భయాదులే రోగాలను కల్గిస్తాయి- అనే విషయం నిర్వివాదాంశం. కానీ ఆ వ్యాధుల్ని పోషించి పెద్ద చేసి, దాని కారణంగా మరణాన్ని సులభం చేసుకునేపనులు చాలా మటుకు వైద్య వరేణ్యులచేత చేయబడుతున్నవని నా భావం. 'సహస్రసంహారీ సగంవైద్యుడు' అన్న సామెత అక్షరాలా సత్యం. దీనివల్ల వైద్యశాస్త్రం తప్పనికానీ, వైద్యులందరూ శాస్త్రాన్ని చక్క-గా చదవకుండానే కేవలం వేషధారు లైనవారనికానీ, కావాలని నరహత్య చేసేవాళ్ళనికానీ నే చెప్పదలచుకున్నట్లుగా మీరు భావించుకో పన్లేదు.

వైద్యశాస్త్రంలో ఎన్నో ప్రత్యక్షమైన ఫలాలున్నాయి. వైద్యుల్లో అనేకులు శాస్త్రగ్రంథాలు అధ్యయనంచేసి జీవకారుణ్యంతో సేవచేసే మహాత్ములున్నారు. కానీ రోగాలు పెరిగేందుకు, మరణమనేది జీవుల్ని గుట్టలు గుట్టలుగా క్రుంగివేసేందుకు వైద్యులదే చాలామటుకు బాధ్యతనడం తప్పుకాదేమో.

మనకథలో ఈ భాగం ఇప్పటికే ఎక్కు-వగా సాగింది. కొంత సేపు విశాలాక్షి దంపతుల్నివదిలి, మరితర సంగతులు చెప్పాల్సి వచ్చింది. వైద్యుల్ని గురించి ఇంకా చెప్పదల్చిన సంగతులు మున్ముందు చెప్తాను.

*

8

విశాలాక్షి వివాహమైన రెండు సంవత్సరాలకు, మేనెల సాయంత్రం, మైలాపూరు లజ్ చర్చి వీధిలో సోమనాథయ్యర్ ఇంటి మిద్దెమీద అయ్యర్ గారూ ఆయనభార్య ముత్తమ్మ కుర్చీల్లో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. విరిసిన వెన్నెల పిండారబోసినట్లుంది.

ముత్తమ్మ:-కాఫీ తీసుకోరానా ?

సో. అయ్యర్:-వద్దు. మధ్యాహ్నం భోజనం ఇంకా జీర్ణం కాలేదు. కడుపులో కదలకుండావుంది. రాత్రికి 'నమయతి' చేద్దామా అనుంది. కాఫీ ఇప్పుడు తాగడం అంత మంచిదికాదు. నీ కొకవలి స్తే చేసుకుని తాగు.

ముత్తమ్మ:-ఎప్పుడు చూచినా ఏదో అనారోగ్యం గురించే చెప్తుంటారు. అదీ నన్నుచూస్తే మరీను. మీరు జబ్బుసంగతి చెప్పడంలో మహారాజులు. ఈవేళ నా దేహారోగ్యం బాగుందని మీ నోటితో చెప్పంగా నే నొకసారైనా విన్నేదుగదా, నా ప్రాణ మున్నంతలో ఆ మంచిమాటను నొకసారైనా వినగలనో లేదో. చేతులుపోట్లు, కాళ్లునొప్పి, ఇక్కడవాపు, అక్కడకురుపు, తలపోటు, అజీర్ణం-ఎప్పుడూ ఈమూదరి రోగరోదనం వినివిని నాచెవులు తూట్లు పడిపోయినాయి. ఒకమాట జాగ్రత్తగా మనసుకెక్కించుకోండి-మీ ఆరోగ్యం బాగుంటే మీరు సుఖంగావుంటేనే నాతో చెప్పండి, జబ్బుగావుంటే నాతో చెప్పకండి. ఈ దీనురాల్ని అంతమాత్రం కటాక్షిస్తే చాలు, అదే పదివేలు.

సోమనాథయ్యర్ కు చటుక్కుమని కోపం వచ్చింది. అసలే ఆయన ముక్కోపి. భార్యను ఇష్టంవచ్చినట్లు తిట్టడం ప్రారంభించాడు.

సోమ:-ఓసి ముండా! కృతఘ్నురాలివి. నీకోసం నే పడేపాట్లు ఏకేటప్పుడు పత్తికూడాపడదు. చెప్పను, ఎంచను వీలవుతుందా ?

గాడిదమాదిరి చాకిరీచేస్తున్నాను. ఊళ్లో వుండేటప్పుడే వరుమానం బాగుణ్ణింది. ఇక్కడకు వచ్చిందగ్గర్నుంచి నానాటికి తీసికట్టుగా వుంది. నీకు నీబిడ్డలకు కూడు, గుడ్డలు, మందులు సమకూర్చేందుకు నేను పడేకష్టాలు చెప్పతరంగాదు. నేను వెనకేసిందల్లా శుభ్రంగా తుడిచి పెట్టుకునిపోయి పదివేల రూపాయలు అప్పుపడ్డాను. అబద్ధాలు చెప్పవల్సి వస్తున్నది. మోసం చేస్తున్నా. ధర్మాసనంలోకివెళ్ళి మనస్సుకు తెలిసి అబద్ధాలు చెప్పడం వృత్తి అయింది. ఈ వకీలు నాకరిసరే, వేశ్యావృత్తిసరే. ధర్మాన్ని, ఇహపరసుఖాన్ని నాశనం చేసుకుని నీకై నానాకష్టాలు పడ్తున్నాను. పైగా వొకకేసు గెలిస్తే పదికేసులు గోయిందా. ఈ వృత్తిలో కక్షిదార్లదగ్గరా కోర్టులోనూ గొంతెండిపోయేటట్లు అరవ్వల్సి వస్తున్నది. అందువల్ల వుష్ణాధిక్యమై మలబద్ధకం ఏర్పడింది. ఈ మలబద్ధకమే అన్నిరోగాలకు మూల కారణమని నవీన వైద్యశాస్త్రజ్ఞులు చెప్తున్నారు. అందుకని నా శరీరంలో ఏదోరూపంగా ఏదో వొకవ్యాధి ఎప్పుడూ వుంటూనే వున్నది. బిడ్డలకేదైనా జబ్బుచేస్తే, దేవుడా వాళ్ళ ఆరోగ్యం బాగ్గావాలని వేడుకొంటూ దిగులుపడ్తున్నా. ఇట్లా దిగులు పడ్తుండడంచేత తల నెరిసిపోయింది. బట్టతలకూడా క్రమంగా వ్యాపిస్తున్నది. నీకు చాకిరీచేయడంలోనే నాకు వృద్ధాప్యం దాపు రించింది. నీ గొడవల్తోనే నా ప్రాణాలు గుటుక్కుమనేటట్లుంది. ఒక రోజా రెండ్రోజులా? ఒకవారమా రెండువారాలా? నీవు కాపరాని కొచ్చిన లగాయతూ నన్ను ఏదో వొకవ్యాధి ఎప్పుడూ నిమిషం కూడా వదలకుండా పీడిస్తున్నది. వీటన్నిటికీ వోర్చి నేనింకా బ్రతి కున్నానంటే ఆశ్చర్యంగానే వుంది. ఇంతకూ నీవు నాకు చేస్తున్న ప్రత్యుపకారమేమిటి? కల్లబొల్లిమాటలు, పనికిమాలిన కారు కూతలు, మనసు దహించే నిందలు-ఇవేకదా నీ వడ్డనలు. నీకర్కశ మైన పల్కులువిని నా చెవులు నరాలు తరుక్కొని పోతున్నాయి. పైగా చీరలకనీ, రవికలకనీ, నగలకనీ, బిడ్డల గుడ్డలకనీ అన్నీ దండగ ఖర్చులు పెట్టిస్తున్నావు. అంతా యమబాధ. ఓరి దేవుడా నన్నీ

కూపంలోకి తోశావు. ఈ కష్టాలు ఇంకా ఎన్నాళ్లు పడమంటావు – అని అయ్యర్ పెద్దగా ఏడవడం ప్రారంభించాడు.

ముత్తమ్మ:–మీ రోదనవిలాపాలు నా దగ్గరికి తెస్తున్నారు. చిరునవ్వు, సంతోషం, ఆనందం, శృంగారం–వీటికి వేరే వొక దాన్ని పెట్టుకోండి. లేకపోతే నన్ను తరిమేసి వేరే ఆమెను పెండ్లి చేసుకోండి. మరో చిన్నదాన్ని అందక త్తెను, కొత్తదాన్ని తెచ్చుకొని ఆమెతో సుఖజీవనం గడిపితే మీ మనోవిచారాలు తొలగిపోతాయి. కలతలు పోయి వుత్సాహం వస్తుంది. కోర్టులో మీ నైపుణ్యం వాక్సామర్థ్యం ప్రకాశిస్తుంది. వకీలు నౌకరిలో మీ వరుమానం పెరుగుతుంది. మీ వ్యాధులు పటాపంచలౌతాయి. ఆరోగ్యంగా సంతోషంగా వుండ గలుగుతారు. మలబద్ధకంవల్ల రోగాలొస్తాయని అంటున్నారు. కానీ మావిశాలాక్షి అందు కొప్పుకోదు. ఆమె మీలానే పెద్ద వేదాంతి, జ్ఞాని. ఆమె అభిప్రాయం చెప్తా వినండి. డబ్బు కష్టాలవల్లనే, మానసిక బాధలవల్లనే రోగాలొస్తాయని ఆమె నమ్మకం, సిద్ధాంతం. నామాట విని మీరు మరో ఆమెను చేసుకోండి. నేనో ముగ్గురుబిడ్డల ముసలి దాన్ని. అందువల్ల ఇంకో చిన్నదాన్ని పెళ్లాడి మీ కష్టాలు తీర్చు కోండి; మీ కే రోగాలూ రావు.

సోమ:–నిన్ను, నీ బిడ్డల్ని సాకడంలోనే నాతల పగిలి పోతున్నది. ఇక ఇంకో కొత్తదాన్ని పెళ్లి చేసుకుని ఆమెను, ఆమెకు పుట్టే బిడ్డల్ని సంరక్షణ చేయడం పెట్టుకుంటే నాతల వెయ్యిప్రక్కలై పోతుంది. మాటిమాటికి వేరేదాన్ని పెళ్లి చేసుకొమ్మని సిఫారసు చేస్తున్నావు. నీమీద ఏమి నేరంచూపి ద్రోహంసెయ్యను? గొడ్రాలవు కాదుగదా. అబద్ధంగా నా పరువు పోయ్యేటట్లు వ్యభిచరించావని చెప్పుకోగలనా? పోనీ ఏదో వొక కారణంతో తోసిపుచ్చినా నిన్నూ నీ బిడ్డల్ని రక్షించే బాధ్యత తీరిపోదుగదా. పైగా ముసలి దాన్ని. నే నింకో చిన్నదాన్ని తెచ్చుకుని వెయ్యికళ్లతో ఆమెను 'పోలిస్' చెయ్యలేను. నీకు పుణ్యముంటుంది గాని వేరే పెళ్లి చేసుకో మనే సిఫారసుమాత్రం చెయ్యబాక.

ముత్తమ్మ:-ఇస్ అబ్బబ్బ. నాకు తలనొప్పి జాస్తవుతున్నది. సరే నేను కిందకుపోయి కాఫీ పెట్టుకుని తాగుతాను—అని లేచి పోబోయింది.

సోమ:-కాఫీ తాగి మళ్లీ వస్తావా!

ముత్తమ్మ:-ఎందుకు? ఇంకా ఏవైనా వషట్కారాలు మిగిలున్నాయా? నేను కారుకూతలు కూస్తానని బాధపడ్తున్నారుగానీ నన్నుగూర్చి మీరు పదేపదే చెప్పేమాటలు మాత్రం నాకు అమృతంగా వున్నాయనా మీ తలంపు? ఒక నిమషంముందు నాతో కాపరం చెయ్యడంలోని ఆనందాన్ని వర్ణించారుగా. ఆ మాటలు నా చెవులకు దేవామృతంలాగా వున్నాయిగా. తాటితోపునక్క తాటాకుశబ్దాలకు భయపడితే ఏం లాభం? మీతో ఎన్నాళ్లు కాపరం చెయ్యాలని నా నొసట వ్రాసుందో అన్నాళ్లూ మీ వదనారవిందం నుండి ఇట్లాంటి మహదాశీర్వాదాలు వెలువడ్తూనే వుంటాయి. వాటి నంతా నేను సహించే తీరాలి. నా కెటూ విముక్తి లేదు. మీరైనా మరొకతెను పెళ్లాడితే సుఖంగా జీవించగలరు. ఆడదాన్ని నేనూ అట్లా చేయగలనా? నాకు దిక్కెవరు?

సోమ:-ఓసిగాడిదా! నాపునర్వివాహావిషయమై మళ్లీ నా చెవిన బడేటట్లు వుచ్చరిస్తున్నావా? నీ కేమైనా మట్టూ మర్యాదా వుందా? సిగ్గు శెరం వుందా? ఇదే పెద్ద రోదనమైపోయిందే. (తనలో) దీని నోరు మూయించేమార్గం కనపడ్డంలేదే. ఓరి భగవంతుడా! ఏదైనా పెద్దజాడ్యం వచ్చి దీన్నోరు పడిపొయ్యేటట్లు కరుణించవా!

ముత్తమ్మ:-సరే, చాల్లేండి. కర్ణరసాయనమైంది. కాఫీ తాగి మళ్లా రమ్మని వుత్తర్వులు జారీ చేసారే, ఎందుకో?

సోమ:-కాఫీ తాగిరా. తర్వాత చెప్తా. ముందుగానే పలానా పనికోసం నిన్ను పిలుస్తున్నానని ముచ్చిలిక వ్రాసి చేవ్రాలు చేస్తేగానీ రావా ఏమి?

ముత్తమ్మ:-సరే, వస్తాన్లెండి. ఇందుగ్గా గొంతు ఆరిపొయ్యే టట్లు అరవక్కర్లేదు. ఇది హైకోర్టుకాదు. మనం కాపరముండే ఇల్లు- అంటూ ముత్తమ్మ తన కడాపటి అస్త్రాన్ని ఆ పేదబ్రాహ్మడిపై ప్రయోగించి వెళ్లిపోయింది.

ఆమె వెళ్లిపోయింతర్వాత సోమనాథయ్యర్ స్వగతంలో పడ్డాడు.

"నాకు హైకోర్టులో ఏం లాభంలేదని యీ మొఖం నన్ను ఎగతాళి చేసిపోతున్నది. ఈకుక్క నోరు మూయించేందుకు నాకు మార్గమే తెలియలేదే దేవుడా!

"విల్లంబు చొల్లంబు
మేదినియిలే ఇరండామ్
విల్లంబిర్ సొల్లంబే మేలదిగమ్"*

—అని పాత సామెతొకటుంది. ఈ వాక్నిర్మాణాన్ని ప్రయోగించడంలో పురుషులకన్నా స్త్రీలే చాలా నేర్పరులు. ఇందుకారణం పురుషులు స్త్రీలకు కల్గించే శారీరకబాధలు, బలాత్కారాలు, అన్యాయాలు, అవినీతులే కావచ్చు. బలవంతులు తమ శక్తితో బలహీనుల్ని కష్టపెట్టేటప్పుడు, బలహీనులు వాక్బలాన్ని ప్రయోగించడంలో సమర్థులౌతున్నారు. శరీరబలం తగ్గినవారికి అన్యాయం జరిగినప్పుడు వాగ్బలమే శరణ్యమవుతుంది.

పైగా స్త్రీలు తల్లులుగా, సోదరీమణులుగా, భార్యలుగా ఇతర బంధువులుగా వుండి పురుషుల శక్తిసామర్థ్యాలు ఎక్కువ కావాలనే ప్రయత్నం చేస్తుంటారు. ఆ శక్తి, బలం తమకు విరోధంగా వుపయోగమవుతుందని తెలిసికూడా అబలలు తమ మొగవాళ్లను ప్రేమాభిమాన వాత్సల్యాలతో చూస్తుంటారు. తాము పురుషుల బలాన్నాశ్రయించి జీవించే అవసరం ఏర్పడుతుంది గనుకనే వారు

---

* వాక్కాణమనీ, ధనుర్బాణమనీ ప్రపంచంలో రెండురకాల బాణాలున్నయ్; ఇందులో ధనుర్బాణంకన్నా వాక్బాణమే బలమైంది—అని ఈ సామెత అర్థం.

పురుషుల శక్తి సామర్థ్యాలు పెంపొంద జేయడానికి నిర్విరామకృషి చేస్తుంటారు.

ఈ ప్రాపంచికజీవితంలో వొకడు జయం పొందాలంటే సహన గుణం అలవర్చుకోవడం ముఖ్యం. మానవుడి మనస్సు సింహంవలె పైబడి హింసించేశక్తిని కల్గి వుండడమేగాక ఒంటెవలె సహనశక్తిని కూడా కల్గివుండాలి. ఇట్లాంటి సహనం బలహీనులచేత కాదు.

మనోశక్తి లేనివాళ్ల నరాలు సులభంగా నీరసిల్లిపోతాయి. చిన్న ఎదురుమాట విన్నా, స్వల్పమైన అసందర్భం జరిగినా వారి నాడులు పెద్ద దుమారంలో వూగులాడే తీగల్లాగ చలించిపోతాయి. మనోధైర్యంలేనివాడి నరాలు పేలవంగా వుంటాయి. అట్లాంటివాడు లెక్కలు ప్రాస్తుంటే బిడ్డ ఏడుపు వినబడంగానే గణితం ఆగిపోతుంది, లేదా తప్పులు దొర్లుతాయి. పక్కఇంట్లో కొత్తగా ఎవరైనా హార్మోనియమో మద్దెలో అభ్యసిస్తూ ఆధ్వనులు వినబడితే చాలు వీరి లెక్కలే కాదు, శ్వాసకూడా ఇంచుమించు ఆగిపోయేపరిస్థితి ఏర్పడుతుంది. కొత్తగా ఎవరైనా చూస్తే సిగ్గుపడిపోతాడు. వానకురిసినా, గాలికొట్టినా చలించిపోతాడు. తన సమానులుగానీ తగ్గువారుగానీ తన ఆశయాల్ని ఎదిరించి మాట్లాడితే చాలు ఆమాటలతని చెవికి కర్కశాలుగాతగిలి బాధపడిపోతాడు.

సహనం లేనివాడు ఇహలోకంలో కష్టాల్నేగానీ ఏనాడూ సుఖాల్ని చూడలేడు. ఒకడికి ఎంతకెంతకు సహనం పెరుగుతుందో అంతకంతకు యీ లోకవ్యవహారాల్లో జయం సిద్ధిస్తుంది. ఇందుకనే మనవాళ్లు – ఓమ కలిగినవాడు ఓమ నేలగల్గుతాడు, పొంగినవాడు నేలపాలవుతాడు–అనేసామెత చెప్తుంటారు.

ఇట్లాంటి వోర్పుగుణాన్ని వొకడికి అలవర్చేందుకే అతడి బంధువులు, ముఖ్యంగాభార్య విరుద్ధంగా ఎదురుమాటలు చెప్తుంటారు. కోపం వచ్చేటట్లు పలుకుతుంటారు. ఇంటి అభ్యాసమే దేశంలోనూ ఏర్పడుతుంది. ఇంట్లో సహనం పాటించలేనివాడికి దేశవ్యవ

ఊరాల్లోనూ ఎోర్పు వుండదు. ఓర్పు తగ్గేకొద్దీ అంతకంతకూ అతని వృత్తి వ్యాపారాదుల్లోనూ గెలుపు తగ్గిపోతుంటుంది.

ఒకడిలో సహనశక్తి కల్గించడానికి వుపాయమేమిటి? శరీరంలో సహనశక్తి కల్గేందుకు జపాన్‌లో తల్లిదండ్రులు శైశవదశలోనే తమబిడ్డల కాళ్లను, చేతులను మంచుగడ్డల్లో వుంచుతారట. కాగేనీళ్ళల్లో చెయ్యి పెట్టమని అలవాటు చేస్తారట. ఈ అభ్యాసాలు వుత్తరోత్తరా శీతోష్ణాలు సహించేందుకు మార్గాలు. ఇట్లాగే సుఖదుఃఖాలను ఎోర్చుకునేందుకు, మనస్సుకు సహనగుణ మబ్బేందుకు- ఎత్తిపొడుపు మాటలు, పరుషవాక్కులు తరచు మాట్లాడుతుంటారట. ఆ మాటల్ని విని విని చెవులూ మనస్సూ దార్ఢ్యతను పొందుతాయి.

ఈవిధంగా మనస్సుకు సహనం ఎక్కించేందుకు, మానవుడిలో వుత్పన్నమయ్యే పనికిమాలిన దిగుళ్ళనుండి, అనవసర భయాలనుండి; వాడి మనస్సును బలాత్కారంగానైనా మరోవైపుకు తిప్పుతూ వాడి భార్యా తల్లులు అత డెదురుచూడని ఎత్తిపొడుపు మాటల్ను పరిహాసోక్తుల్ని చెప్తుంటారు. అందులోని ప్రేమ ఎంతగాఢమో తెల్సు కోవడంకూడా ఎొక ఆశయమై వుంటుంది. ప్రేమ సహిస్తుంది. ప్రేమ వుంటే కోపంరాదు. కొన్ని సమయాల్లో తనకు తెలియకుండానే కోపం వచ్చినా చాలా సులభంగా సమసిపోతుంది. తమ భర్తలు ఇంత ప్రేమ కల్గున్నారా అని పరిక్షించేందుకు ఆడవాళ్లు కొందరు కోపం కల్గించేమాటలు మనస్ఫూర్తిగా పలుకుతుంటారు.

మన తల్లులు సోదరీమణులు భార్యలు మనమీదవుండే ప్రేమాతిశయంలో అప్పుడప్పుడూ వ్యర్థమైన నిరుపయోగమైన మాటలు మాట్లాడుతుంటారు. దీంతో పురుషులు స్త్రీలకు బుద్ధి లేదని అనుకుంటుంటారు. ఇది తప్పు. అట్లా అనుకునేవాడు మూఢుడు. పురుషుడు తను నేర్చుకునే ప్రత్యేకవిద్యల్లోను, వృత్తుల్లోను, శరీర బలంలోనూ స్త్రీలకన్నా నేర్పరి కావచ్చునేమో కానీ జీవితాను

భవంలో, సాధారణ జ్ఞానార్జనలో, యుక్తితంత్రాల్లో, బుద్ధిసూక్ష్మతలో స్త్రీలు తక్కువనుకోవడం అజ్ఞానం.

కుటుంబజీవనంలో సహనమనే వుత్తమమైన దైనిక దైవిక గుణాన్నీ అందువల్ల కలిగే అనంతశక్తులనీ పొందగోరేవారు తల్లి, భార్య, ఇతర బంధుస్త్రీలు అప్పుడప్పుడూ జుగుప్సాద్వేషాలు కలిగే విధంగా మాట్లాడినా కాస్త ఓర్పుతో వినడం అలవర్చుకోవాలి. ఆడది నోరు తెరవంగానే ఆమెపై పెద్దపులిమాదిరి పడి సమరాట్ట వాసం చేసే పురుషవీరులు నానాటికీ ప్రపంచవ్యవహారాల్లో వోటమిని పొందుతుంటారు.

ఈ వ్యవహారాలన్నీ కొద్దికొద్దిగా సోమనాథయ్యర్ మనసుకు తోచసాగాయి.

ఇటీవల కొన్ని నెలలక్రితమే ఆయన వృద్ధమాత రామవ్వ కాలధర్మం చెందింది. ఆమె పొయ్యేముందు కొడుకును ఏకాంతంగా పిలిచి కొంతసేపు మాట్లాడింది.

రామవ్వ:-ఒరే సోమూ! నీ పెళ్ళాం ముత్తమ్మ సామాన్యమైన ఇల్లాలని అనుకోబాకరా. పతివ్రతరా. నీ హితంకోరి. నీకు సహనగుణం అలవాటు కావాలని అప్పుడప్పుడూ ఎగాదిగా మాట్లాడినా నీవు కోపపడడం, జుగుప్స చెందడం సరికాదు. నేను రేపో మాపో పోతాను. తల్లి తర్వాత నీకు అదే దిక్కు. ఇంతదాకా నీవు నీభార్య ముత్తమ్మను నానాబాధలుపెట్టి ఆనందించేవాడివి. కట్టుకున్న పెళ్ళాన్ని రాచి రంపాన పెడ్తే ఇంట్లో లక్ష్మి వుండదురా నాయనా. ఈమాట మర్చిపోబాకు. ఇదే మహామంత్రమని ముడివేసిపెట్టుకో - అని హితోపదేశం చేసిన సన్నివేశం జ్ఞాపకమొచ్చింది.

తల్లిమాటలు అప్పుడప్పుడూ ఆయన మనసుకు తడ్తున్నవి. అత్తమహిమ చస్తే తెలుస్తుందంటారు పెద్దలు. రామవ్వ వృద్ధదశలో, తనను హింసపెట్టడానికి బ్రతికుండే ముసలిదగ్గుడు యంత్రం- అని సోమనాథయ్యర్ అనుకునేవాడు. ఆమె చచ్చి కూర్చున్నాక

ఆ తల్లిమహిమ తెలిసొస్తున్నది. తల్లిదండ్రులే మొదటి దేవతలన్న నానుడి సార్థకంగా బోధపడ్తున్నది.

ప్రపంచాన్ని సృష్టించి రక్షించే జగన్మాత తల్లిరూపంలో ఇహలోకంలో అవతరించి తనను రక్షిస్తున్నది. ఆమాటకొస్తే ఈ ప్రపంచంలోని వస్తువులన్నీ భగవత్స్వరూపాలే గదా.

"పురుష ఏవేదగ్ం సర్వం
సర్వం విష్ణుమయం జగత్."

విష్ణువు సర్వవ్యాపకుడు. పనివాడుగావచ్చి పనులు చేసేవాడు దేవుడే. మిత్రుడు, శత్రువు, గురువు, శిష్యుడు, తల్లిదండ్రులు, భార్యా బిడ్డలు మొదలైన నానారూపాల్లో కనపడుతూ మనచుట్టూ ఆయనే వుంటున్నాడు. ఇతరరూపాలతో ఆయనచేసే వుపకారాల కన్నా, తల్లిదండ్రులుగా వుండి చేసే వుపకారాలు వర్ణనాతీతాలు. ఈ ఇద్దరిలోనూ తల్లిప్రేమ గొప్పది. అందువల్లనే తల్లిదండ్రులు మొదటిదైవమనే వాక్యంలో మొట్టమొదట తల్లిపేరే గ్రహింపబడింది.

మన సోమనాథయ్యర్ కామక్రోధాదులను వెంటనే అదుపులోకి తీసుకోరాలేకపోయినా శాస్త్రప్రవచన శ్రవణాదులచేత ఆయన మనస్సు కాస్త నిష్కల్మషమై అప్పుడప్పుడు కామాది గుణ ప్రాబల్యాల్ని అణిచిపెట్టి సద్గుణాలను ప్రకాశింపజేస్తుండేది. అప్పుడతనికి గొప్ప సత్యాలు ప్రస్ఫుటమయ్యేవి.

రెండు సంవత్సరాలక్రితం విశాలాక్షిమూలాన తాను పొందిన అవమానం పరస్త్రీల విషయంలో వుత్సాహాన్ని క్రమంగా తగ్గిస్తూ వచ్చింది. పాపఫలితమే మృత్యువని కైవల్యవేదం చెప్తుంది. దుఃఖాన్నీ భయాన్నీ తన్మూలమైన మరణాన్నీ జయించదలచినవాడు భయదుఃఖహేతువులైన పాపాలను పారద్రోలాల. కష్టపడి మానవుడు ఒక పాపాన్ని గెలవగల్గితే ఇతర పాపాలపై విజయం సాధించడానికి అంత శ్రమపడ పన్లేదు. అసురులను జయించడం అట్లాంటి

వాళ్ళకు సులభం, అసురులంటే ఇంకెవరో కాదు, మన మామూలు పాపాలే. దేవతలంటే హితంచేకూర్చే శక్తులు.

సోమనాథయ్యర్ ఎప్పుడూ పాపాలు చేసినవాడుకాడు. ముఖ్యంగా వ్యభిచార దోషానికి వశపడ్డవాడేమీకాదు. చాలా వరకు ఆయన ఈ పాపాన్ని మానసికస్థాయిలోనే వుంచుకున్నాడు. కానీ క్రియారూపంగా తీర్చుకున్నవాడుకాదు. పరస్త్రీలతో శరీర సంబంధం కల్గినవారు మాత్రమే వ్యభిచార పాపగ్రస్తులని అనుకోపల్లేదు. మానసికంగా పరస్త్రీని కోరడంకూడా వ్యభిచారదోషమని క్రీస్తుచెప్పాడు.

ఇతరుల ద్రవ్యాన్ని దొంగిలించి, పోలీసులకు పట్టుబడి శిక్ష పొంది జైల్లోపడ్డవాడే దొంగ అని ప్రజాసామాన్యం అనుకుంటుంది. ఇతర్ల సొమ్మును అపహరించాలని అనుకోవడంతోనే మానవుడు దొంగ అవుతున్నాడు. దొంగకు తగిన శిక్ష ఈలోకంలో లభించక పోయినా భగవంతుడు తప్పక శిక్షిస్తాడు.....

లేత వెదురుకర్రను వంచడం సులభం. ముదిరిన తర్వాత వంచలేం, విరిగిపోతుంది. అట్లనే మానవహృదయం బాల్యంలో అయితే సులభంగా చక్కపడ్తుంది, ముదిరితే దాన్ని తీర్చిదిద్దడం సులభసాధ్యంకాదు. పెద్ద లందుకనే 'బాల్యే విద్యా' అన్నారు. అయినా శ్రద్ధగా ప్రయత్నిస్తే అసాధ్యం ఏదీ వుండదు. వెదురువలె ముదిరిపోదు, ముదిరిపోయిన తర్వాత తపస్సుచేయడం కష్టమని భావించకూడదు. విద్యాతపస్సులు ఎప్పుడైనా ఎక్కడైనా కాల పరిణామంతో నిమిత్తంలేకుండా ప్రారంభించవచ్చు; సిద్ధిపొందవచ్చు. ఇవన్నీ పరిశీలించే అయ్యర్ తపస్సుచేయాలని తీర్మానించుకున్నాడు. తపస్సనగానే అడవిలోకిపోయి నారపట్టలు కట్టుకుని కందమూలాదులతో జీవించడమనికాదు. ఇంద్రియనిగ్రహమనే సత్యతపస్సును ప్రారంభించాడు.

ఆత్మజ్ఞానమంటే - అన్నీ ఎొకటే, అన్నీ ఆ పరమాత్మనుడే, అన్నీ ఆనందాలేనని అనుకోగల్గే భావాన్ని తన నిత్యానుభవంలోకి తెచ్చుకుని ఆచరణలో నడుచుకోవడమే గొప్ప తపస్సు. అధర్మంలో సుఖాలనుపొందే ఇంద్రియాలను నిషేధించాల. ఇంద్రియాల్ను నిషేధించడమంటే మనస్సునే బహిష్కరించడం. ఇంద్రియాలతో పని చేసేది మనస్సే. చాంచల్యం, భయం మొదలైన పాడుగుంటల్లోపడి బాధపడకుండా వుండడమే తపస్సు. అన్ని పాపాలకు కారణమైంది భయమే కాబట్టి భయాన్ని విసర్జిస్తే మిగిలిన పాపాలను గెలవొ్వచ్చు. ప్రధానమైన భయాన్నికూడా సులభంగా గెలవొ్వచ్చు. ఈ రెండు మార్గాలు ఏక కాలంలో ప్రయత్నించడం మంచిది. సోమనాథయ్యర్ వాంఛించింది ఈ తపస్సునే.

తపస్సులలో గొప్పది పూజ. దుష్టమార్గాలనుండి మనస్సును సన్మార్గంలోకి ప్రవర్తింపజేయడానికి తోడ్పడేది పూజ. ప్రేమతో చేసే వుపచారమే పూజ అన్పించుకుంటుంది. సర్వవ్యాపితుడైన భగవంతునియెడ, భగవత్స్వరూపమైన సమస్త వస్తుజాలంయెడ, అన్ని జీవరాసులయెడ ప్రేమతో మెలగడం ఆ ప్రేమసంబంధంగాచేసే వుపచారాదికాలే తపస్సు. ఇదే మోక్షమార్గం. ప్రేమే మోక్షం. ఈ ప్రేమనే బుద్ధభగవానుడు నిర్వాణ మహాముక్తికి సాధనంగా బోధించాడు. ప్రాణులయెడ ప్రేమకల్గి పరిచర్యలు చేయడం, వాత్సల్యంతో వారికి కావల్సిన సౌకర్యాలు కల్గించడమే భగవత్పూజ. అంతేకానీ వట్టిజపాలుచేస్తూ భగద్భక్తి కలవాడని చెప్పుకునేవాడు వేషధారి మాత్రమేననీ నిజమైన భక్తుడుకాడనీ ఏసుక్రీస్తు చెప్పాడు. ప్రత్యక్షంగావున్న ప్రాణులపై ప్రేమ చూపలేనివాడు అప్రత్యక్షమైన జగత్కారకుడు, మూలప్రకాశకుడూ అయిన ఆది దేవునియెడ ప్రేమకలవాడు కానేరడు.

ఇవన్నీ బాగా తెల్సిన సోమనాథయ్యర్ సమస్త జీవులపై కారుణ్యం కల్గివుండడం ఒక వ్రతంగా స్వీకరించాడు. ప్రాణుల యెడ, ముఖ్యంగా తోడిమానవులయెడ, నిజమైన ప్రేమతో మెలగడం

వ్రతంగా పాటించడం సులభమైన పనికాదు. పుట్టుకతో వచ్చిన సంస్కారం జీవరాసులకు స్వతస్సిద్ధంగా వుంటుంది. ఇతరులపట్ల భయం, ద్వేషం, జుగుప్స అనేవి నైజాలు. కొన్ని ప్రాణులపట్ల వాత్సల్యం వున్నా, మరికొన్నిటిపట్ల అసూయాద్వేషా లుంటాయి. ఈ అనాదిసిద్ధమైన జీవవిరోధాన్ని తొలగించి సర్వజీవకారుణ్య భక్తిని అలవర్చుకోవాలని తీర్మానించుకున్నాడు అయ్యర్ గారు. ఇంత వరకు తాను ద్వేషించి నీచభావంతో త్రుణీకరించిన వారిని చూచినప్పుడు ఆనందోత్సాహంతో చిరునవ్వుతో ఇంపుగా మాట్లాడ్డం సాధనచేయడం ప్రారంభించాడు.

ప్రథమంలో ఇది కష్టంగానే వున్నింది. మొదట తనభార్య ముత్తమ్మతో సుముఖంగా ప్రేమగా ముఖం చిట్లించుకోకుండా మాట్లాడమనేదే కష్టమనిపించింది అయ్యర్‌కు. మానసిక వ్యభిచారాన్ని సైతం సులభంగానే అరికట్టుకోగల్గాడు కానీ ముత్తమ్మతో సుఖంగా సౌమ్యంగా వుండేందుకు మాత్రం కష్టంగా వుండేది.

కార్యమైన కొన్నెల్లవరకు ముత్తమ్మతో అలకలు, ఆలింగనాదులు ఆనందంగానే వుండేవి. అవతలమాత్రం అంత సుఖహేతువులు గాకపోయినాయి. పదిహేనోయేట సౌభాగ్యవతి ముత్తమ్మ వొక చంటిబిడ్డతో పడకగదిలోకి ప్రవేశించింది. అయ్యర్ ముత్తమ్మను ముద్దుపెట్టుకోబోతే బిడ్డ క్యావ్ మన్నది. మలమూత్ర విసర్జనంచేసి ముత్తమ్మ వొడిని ఖరాబుచేసింది. అయ్యర్ గుడ్డలూ ఖరాబయ్యాయి.

ఆనాటినుండి కష్టాలు ప్రారంభమయ్యాయి. క్రమంగా కొత్త బిడ్డలు రాప్రారంభించారు. తనకు తన సతీమణికి యవ్వనం జారిపోయిందని తన బిడ్డల్ని చూచినప్పుడల్లా అయ్యర్ మనసులో రాళ్లు పడ్తుండేయి. తన సొంతబిడ్డల్నే అసహ్యించుకోడం, చిరాకుపడ్డం; భార్య కంటబడగానే మొహం చిట్లించుకోడం, విసుక్కోడం – ఈ

దుర్గుణాలు అలవడ్డాయి. రోజురోజుకూ ఈ దుస్థితి దట్టమై మన స్సులో గాఢంగా నిల్చిపోయింది.

ఇన్నాళ్లకు తనకు కల్గిన జ్ఞానోదయంవల్ల భార్యపట్ల ప్రేమగా ప్రవర్తించడం సాధనచేయు సాగాడు అయ్యర్. మొదట్లో ఇది వేపచమురు తాగినట్లే వున్నింది. భర్తలో కల్గిన కొత్తపరిణామం చూచి ముత్తమ్మ మనస్సులో ఆనందించింది. వారిప్రేమను స్థిరపర్చు కోవాలని అయ్యర్ను నానా కఠినపరిక్షలకు లోనుచేసింది. ఆమె గొప్ప బుద్ధి కల్గినామె కాబట్టి తనభర్తలో ఆవరించిన అజ్ఞానవిషాన్ని సాధ్యమైనంత త్వరలో తొలగించివేసి జ్ఞానామృతాన్నిచ్చి ఆనం దించాలనుకున్నది.

ధర్మపత్నియొక్క ప్రేమబంధం జీవామృతం వంటిది. దాన్ని వేపచమురుతో సమానంగా భావించేవాడు పరమమూఢుడు. అట్లాంటిమూఢుణ్ణి ఎన్నిపాట్లుపడైనా ఆ అజ్ఞానాంధకారంనుండి వెలుగులోకి తెచ్చేబాధ్యత ధర్మపత్నిది. మొదట కష్టాలెదురైనా పర్వాలేదు. కాలిలో విషములు గుచ్చుకోనుంటే, దాన్ని సూదితో గుచ్చి తీసెయ్యాల. గుచ్చేటప్పుడు కలిగేబాధకు తాళలేక వాడు బాధ పడ్తాడని ముల్లును తీసివేయడానికి ప్రయత్నించకుండా వాడి హితం కోరేవాడు ఏం చెయ్యాలనేది ప్రశ్న. హితకారి అయిన వాడు, అతను కుయ్యో మొర్రో అని కేకలుపెడ్తున్నా లెక్క చేయ కుండా ఆ విషపుముల్లు తీసేసి బాధనుండి చావునుండి వాణ్ణి రక్షిం చడం నిజమైన ప్రేమకు చిహ్నమవుతుంది.

ఈ ఆలోచనల్తో ముత్తమ్మ తన భర్తకు అప్పుడప్పుడు శృంగారపుకట్ట పూజలు చేస్తుండేది. రోజులు గడిచేకొద్దీ అయ్యర్కు ఈ విషయం కొద్దికొద్దిగా అర్థమౌతూ వచ్చింది. కానీ దాన్ని ఆయన సహించలేక పొయ్యేవాడు.

ప్రేమమందిరం మహా పవిత్రమైంది. ఒకప్పుడు పాపంచేసి ఆ మందిరంనుండి తరమబడితే మళ్ళీ అందులోకి ప్రవేశించడానికి చాలాపాట్లు పడవల్సి వుంటుంది.

కంటిని పొడుచుకుని చూపును పోగొట్టుకోడం సులభమే కానీ ఆ చూపును మళ్ళీ పొందడం అంత సులభం కాదుగదా. అయ్యర్ గుడ్డికళ్ళను పోగొట్టి మంచినేత్రాలుగా చెయ్యాలని ముత్తమ్మ పాపం చాలాప్రయత్నాలు చేసింది. ఆ చికిత్సలను ఆయన భరించలేక పోయేవాడు. కానీ ఎట్లయినా పోగొట్టుకున్నచూపును మళ్లీ తెచ్చుకోవాలన్న ఆసక్తిచేత చికిత్సావిధానం ప్రయాసగావున్నా నోరు మూసుకుని సహించేవాడు. అందుకని ముత్తమ్మను ఎప్పుడూ తనతో వుండమని, ఏదైనా మాట్లాడుతూవుండమని నిర్బంధించడం మొదలు పెట్టాడు అయ్యరు.

ఎంతగా భార్యా సాన్నిధ్యాన్ని కోరాడో అంతగా భార్య ఆయనకు చాలై దూరంగా వుండడం తటస్థించింది. నా భార్యను గృహదాసిగా పనికత్తెగా దాదిగా తలుస్తూ వుండేవాణ్ణి. అప్పుడేమో నాకు దాస్యంచేస్తూ నా ఆజ్ఞలను శిరసావహిస్తూ వుండేది. ఇప్పుడు దానిప్రేమ ననుభవించాలనుకుంటుంటే అది వూరకే మోడి చేస్తున్నది; పైగా నీచంగా తిరస్కరిస్తున్నదికూడా. ఇది మరీ పరిహాసమై పోయింది. ఇప్పుడు భార్యే ప్రేమరాజ్య రాణి అని అనుకుంటుంటే అది నన్ను నీచంగా పనివాణ్ణి చూచినట్లుగా చూస్తున్నది. పాతివ్రత్యమా చట్టుబండలా? బాల్యంలో దీన్ని నీచంగా చూచా నని ఇంతకాలానికి ఇది నన్ను అసహ్యించుకుంటున్నది. ఆడదాని అంతు ఎవడికి తెల్సు? కడలిలోతునైనా తెల్సుకోవచ్చుగానీ కామినీ హృదయరసగ్రహణం అసాధ్యమైంది కదా!

పురుషుడికన్నా స్త్రీకి కామం ఎనిమిదింతలు ఎక్కువట. తల బట్టగట్టి వెంట్రుకలు నెరిసిపోయి వృద్ధుడైన నాతో సుఖాన్ని పొంద లేక నన్ను ధిక్కరిస్తుండడం వింతకాదు.

నా కుటుంబంలోనేకాదు, ఈ లోకంలో ఏమివింత ! ప్రపంచంలో పురుషుడు భార్యను తన కోర్కెల్నితీర్చే బానిసగా కట్టేసాడు. ఈనాడు నేను భార్యను దైవంమాదిరిగా ప్రేమించాలనుకుంటే నన్ను ఎగతాళి పట్టిస్తున్నది. అంతమాత్రంచేత ఈమె పతివ్రత కాదనడానికి వీల్లేదు.

చావబోయేముందు మా అమ్మ, ముత్తమ్మ సాధ్వీమణి అని చెప్పింది. అంత ఆలోచించకుండానే తల్లి సొంతకొడుకుతో అబద్ధం చెప్తుందా ? పైగా నాతో ఆమె ఈమాట చెప్పేటప్పుడు ఆమె ముఖకవళికలు గమనించాను. పరిశుద్ధమైన పవిత్రమైన మనస్సుతో సత్యంపై విశ్వాసంతో చెప్పిందని ఆమె ముఖవర్చస్సు ప్రస్ఫుటం చేసింది. ముత్తమ్మమోసంలోపడి మా అమ్మ అట్లా అనుంటుందనడానికి వీల్లేదు. పాముకాళ్లు పాముకేగదా తెల్సు. స్త్రీ రహస్యాలు స్త్రీలకు తెలియకుండా వుంటాయా? ఒకటా రెండా పదేళ్లు రాత్రిం బగళ్లు జాగ్రత్తగా పరిశీలించిగదా చెప్పింది. ఎంత దాచినా ఆ రహస్యం ఆమెకళ్ళకు అగపడకుండా వుంటుందా? అందుకని మా అమ్మమాటను అనుమానించడం అవివేకం.

'సంశయాత్మా వినశ్యతి.' సందేహించేవాడు నాశనమౌతాడు అని గీతలో సాక్షాత్ శ్రీకృష్ణమూర్తి సెలవిచ్చాడు. మనకంటికి నేరుగా అగపడే విషయాన్నిగూర్చి వ్యర్థంగా మనస్సులో సంశయ పడ్తే లాభమేమిటి ? ముత్తమ్మ నిస్సందేహంగా సాధ్వి.

నాలోని ప్రేమను సత్యాన్ని పరిక్షించడానికే ముత్తమ్మ ఇట్లా ప్రవర్తిస్తున్నది. అందుకే ఆమెపట్ల నేను విరసంగా వుండ కూడదు. నాకు తారకం ఆమే, వేరే దిక్కులేదు. సర్వకాల సర్వావస్థలందు జ్ఞానశీలంతో వుండడానికి నా తల్లి యిచ్చిపోయిన దీపాన్ని ఆరిపోకుండా చూచుకోవాల. ఓ మూఢమనసా ! ఎందుకు దిగులు ? ముత్తమ్మ నిన్నేంచేసింది ? అలిగింది, అలకేగదా ప్రేమ రసానికి ప్రాధానమైన మధురస్థానం. ఆలింగనంకన్నా అలకే మధుర

మైందని సాక్షాత్ బ్రహ్మదేవుడి అంశాన పుట్టిన మహాకవి తిరువళ్లువరు[1] అన్నారు.

"ఊణలినుం ఉండదఅలినిదు కామం
పుణర్దలిన్ ఊడలినిదు."[2]

ఓ మనసా, నీకుకళ్ళు-బుద్ధి పోలేదు. ఈమేంది నాతో అలిగే దేందనే గర్వాంధకారంలో పడివున్నావు. అందువల్ల నీకు కష్టమే గానీ సుఖంకాదు. ఓరి మూర్ఖుడా, పాణిగ్రహణం చేసిననాడు ప్రేమరాజ్య సింహాసనాన్నెక్కి-మనస్సు, ఆత్మ, శరీరం మూడింటినీ ఆమెకే కానుగ్గా సమర్పించావు. రాణి ఆలింగనంచేస్తే అదొక సుఖం, అలిగితే అదీ వొక ఆనందమే...ఈ విధంగా ఆ మిద్దెపై కూర్చొని వెన్నెల్లో చంద్రుణ్ణి చూస్తూ ఆలోచిస్తూ సోమనాథయ్యర్ నిద్రావశుడైనాడు.

కొంతసేపటికి కళ్లు తెరిచి చూచాడు. చంద్రుడు ఆకాశంలో చాలాదూరం ప్రయాణం చేసాడు. సాయంత్రం 7 గంటలప్పుడు

---

1. తిరువళ్లువర్ కులాన్నిగూర్చి, మతాన్నిగూర్చి, కాలాన్నిగూర్చి భిన్నాభిప్రాయాలున్నాయి. పంచమజాతివాడనీ, పురోహితజాతివాడనీ; శైవుడనీ, జైనుడనీ పలువురు పలు రకాలుగా అన్నారు. అట్లనే క్రీ. పూ. వొకటో శతాబ్దం మొదలుకుని క్రీ. శ. మూడో శతాబ్దం దాకా అతని కాలనిర్ణయం చేసివున్నారు. ఏ కులంవాడైనా, ఏ కాలంవాడైనా అతని 'తిరుక్కురళ్' గ్రంథం తమిళ వేదంగా ప్రఖ్యాతిబడసింది. ఈ నీతి ప్రధానమైన రచనలో 1330 కురళులున్నాయి. రెండుపాదాల చిన్నపద్యానికి 'కురళ్' అని పేరు. మన వేమనయోగి ఆట వెలదుల్లో అనల్పమైన విషయాలను చెప్పినట్లుగా; తిరువళ్లువర్ రెండేరెండు పాదాలుండే గీతాల్లో చిన్నచిన్న మాటలతో రసవత్తర కావ్యంగా కుదించాడు. అవగింజను తొలిచి అందులోకి సప్తసముద్రాలను చొప్పించాడా అన్పిస్తుంది. ధర్మ, అర్థ, కామ-ఈమూడు పురుషార్థాలనుమాత్రమే ఇందు వివరించడం జరిగింది కాబట్టి దీనికి 'ముప్పాల్' (త్రివర్గం) అనే ప్రసిద్ధ నామాంతరంకూడా ఏర్పడ్డది. మద్రాసు మైలాపూరులో తిరువళ్లువర్ దేవాలయంకూడా వొకటుంది తిరుక్కురళ్‌ను కనుపర్తి వెంకటరామ విద్యానందులు, చొక్కనరసింహులు నాయుడు, గరిమెళ్ళ సత్యనారాయణ, శ్రీ పూతలపట్టు శ్రీరాములరెడ్డి మొదలైనవారు తెలుగులోకి అనువదించి వున్నారు.

2. "ఉపవాసంకన్నా ఆహారం రుచికరమైంది, భోజనంకన్నా కామం ఇంకా రుచికరమైంది; కామంలో సంభోగానికన్నా అలకే ఆనందకరమైంది."

కాఫీతాగి వస్తానని వెళ్లింది ముత్తమ్మ. ఇప్పుడు గంట ఎంతైవుంటుందోనని చొక్కా-జేబులోనుంచి గడియారంతీసి చూసాడు. రాత్రి 12 అయింది. పడకగదిలోకివెళ్లి చూసాడు. కిరసనాయిల్ దీపం పెద్దదిగా వెలుగుతున్నది. ఒక్క-నిమిషం ఆలస్యమైవుంటే గ్లాసు పగిలుండేది. పెద్ద ప్రమాదమైవుండేది. అయ్యర్ పరుగెత్తి వత్తిని తగ్గించాడు. దీపం చక్కబడింది.

మంచంలో ముత్తమ్మ పడుకుని నిద్రపోతున్నది. మరో మంచంలో బిడ్డలు నిద్రపోతున్నారు. ముత్తమ్మను లేవగొట్టి భోజనం చేస్తా మనుకున్నాడు. ఆకల్లేనప్పుడు భోజనం చెయ్యడం రోగాలకు కారణమని, ఉపవాసం చేయడం శుభంగా ఈ రోజునుండే ప్రారం భిద్దా మనుకున్నాడు. పైగా భార్య గాఢనిద్రలో వుంది. ఆమెకు నిద్రాభంగంచేసి అన్నం పెట్టమనడం మహాపాపం. అందుకని ఈ పూటకు వుపవాసమే వుండామనుకున్నాడు అయ్యర్. దీపం చిన్నదిగా చేసి వొకమూలగా పెట్టాడు. చప్పుడు గాకుండావచ్చి భార్యను గోముగాతడివి ఆలింగనం చేసుకుని ముద్దు పెట్టుకున్నాడు. ఆ రాత్రి వారికి అపూర్వమైన స్వర్గసుఖస్వప్నాలు కల్గాయి.

★

9

ముగించని ముగింపు

మర్నాడుదయాన్నుంచి ముత్తమ్మదే రాజ్యం. ఆమె పలికిందే శాసనం, చెప్పిందే వేదం. అయ్యర్ ఏదైనా చెయ్యాలనుకుని ముత్తమ్మ వద్దంటే ఆమెదే పైచెయ్యి. అయ్యర్ వద్దని అమ్మగారు కావాలంటే ఆమె చెప్పిందే జరిగేది. ఈ ముత్తమ్మ రాజ్యంలో అయ్యర్‌కు అప్పుడప్పుడు శృంగభంగ మవుతుండేది, అయ్యర్ పట్టించుకునేవాడుకాదు. భక్తుణ్ణి దేవుడు ఎన్నోవిధాల పరిక్షిస్తాడు. ఆ మాత్రానికే జంకితే వాడిభక్తి ఏమౌతుంది? భక్తుడికి ఆఖర్లో కలిగే విజయా లేమవుతాయి? ఈమె మనకు ప్రత్యక్షదైవం. భార్య కన్నా వేరేదైవం లేదన్నారు కాబట్టి ఆ పరిక్షలకు భయపడకూడదని తీర్మానించుకున్నాడు.

ఒకరోజు ముత్తమ్మ అయ్యర్‌తో – రేపు ఆదివారంకదా, మీకు కోర్టులో పన్లేదు, మనమిద్దరం బిడ్డల్నీ పనివాణ్ణీ...

★

[ఆధునిక తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి ఈ వాక్యాన్నీ నవలనూ పూర్తి చెయ్యకుండానే యశశ్శరీరు డయ్యాడు. రెండో భాగంలో అసలు 'చంద్రిక కథ' చెప్పడల్చుకున్నాడేమో. ఆయన వ్రాసుకున్న చిత్తులో సోమనాథయ్యర్ దంపతుల సముద్రతీర వాహ్యాళి, విశాలాక్షి దంపతులు–చంద్రిక, వారి సుఖజీవనం వర్ణింపబడి వున్నాయని తెల్సినవారన్నారు. ఆ చిత్తుప్రతిని భారతిగారు స్వదేశమిత్రన్ మేనేజరుకు ఇచ్చిపోయినట్లు చెప్తారుకానీ ఆ చిత్తు కాగితాలు ఈనాటిదాకా దొరకనేలేదు.]